# గజేంద్రమోక్షణరహస్యార్థము

గ్రంథకర్త,

అనుభవ వేదాంత ప్రవక్త,

చదువుల వీర్రాజుశర్మ,

శృంగవరపు కోట.

శ్రీకృష్ణా ప్రింటింగ్ ప్రెస్,

పాలకొల్లు.

1000 కాపీలు.

వెల 1-8-0

ACC No 4770



చ॥ చదువుల వంశవర్ధనుఁడ ♦ క్ష్మాసురుఁడౌ రఘురామచంద్రునిం
పొదవఁగఁ గొల్చుభక్తుఁడ, న ♦ ముజ్జ్వలతత్త్వ విశేష ధర్మముల్
నదయులహాయసంగఁ దగు ♦ సత్సభలందు సువక్తయంతు నె
న్నది పద నిచరిత్రమిటు ♦ వ్రాసితినామము వీరరాజిలన్.

# విజ్ఞప్తి.

వైరాగ్య పుష్పగుచ్ఛము - భగవద్గీతా మండనము గీతా ప్రశ్నోత్తరములు - రామగీతార్థము - బాల వేదాంతాది గ్రంథములు - రచియించుటకు ముందుగ నేనీ గజేంద్ర మోక్షణమను చరిత్రమునకు, భాష్య - రహస్య లేక, నధ్యాత్మిక తాత్పర్యములు విశేషముగా వ్రాయుటలో శ్రుతి స్మృతులు సందర్భానుసార ముపయోగించి సృష్టిక్రమముం - గాముకుని లక్షణములుం- దత్కామజనిత కష్టములు - వాటి నివారణోపాయములు - నున్నగునవి. యెల్లరకు బోధపడునటులు, పూర్వపక్ష సిద్ధాంతములతో సమకూర్చడమైనది. పాలయందు వెన్నగలదనియు నయ్యది నేయిగా మారగలదనియు నందఱకుం దెలిసిన విషయమే, కాని, సక్రమముగాం గాచిననే యదివచ్చునుగాని లేనినాడది చెడిపోవునటులనే, యీ గ్రంథముం జక్కగాం జదివిన వారికే బోధపడగలదని వేఱె చెప్పనక్కరలేదు. అదిగాకం జందోవ్యాకరణాదు లంతగాం దెలిసినవాండను గాను గాన నిందే నైనం బొరపాటు లగుపడిననని నాకుం దెలియపర్చినచో సవరించుకొందును అంతియేగాక నచ్చటచ్చట నద్వైతమును గూర్చి నే నుపన్యాసము లిచ్చుచుండుటలోం బాల్లగ్రామము వారీ పుస్తకమచ్చు గూర్పింపం బ్రోత్సహించి కొంతధన సహాయము నొసర్చి రా తదుపరిం బాలకొల్లు రామలింగేశ్వర స్వామి వారి యాలయములో గీతోపన్యాసము బోధించుచుం బ్రస్తావనలోం బై గ్రంథమును గూర్చి ప్రచ్ఛరింపం దెనాలి తాలూకా వరహాపురం అగ్రహారం వాస్తవ్యులును - ప్రస్తుతము నర్సాపురం తాలూకా దిగమర్రు గ్రామము

లోఁ గాపురముండి. పాలకొల్లు సంగమన్నారు పేటలోఁ బార్మసీ నేర్పాటుజేసి, తెలుఁగు వైద్యము నింగ్లీషు వైద్యము నతి నిపుణతతో నొనర్చువారును - శ్రీ వంకమామిడి సాంబయ్యగారి కుమారులు నగు శ్రీ కృష్ణమూర్తి డాక్టరుగారు, మీపుస్తక మీ పాలకొల్లు గ్రామములోనే యచ్చు పడగలదని హెచ్చరించి రంత, వారి వాక్యమోఘమైయీ గ్రామమునఁగల మహాభక్తుల సహాయముచేతను శ్రీ కృష్ణమూర్తిగారి మిత్రబృంద సహాయము చేతను శ్రీ పూళ్లగ్రామీయుల సహాయము చేతను గృష్ణాప్రెస్ వారిచే ముద్రణ పూర్తి యైనది గాన శ్రీకృష్ణమూర్తి డాక్టరుగారినిఁ దదితరమహాభక్తులననేక విధముల నభినందించుచు నన్ని గ్రామము రప్పించి నటులొనర్చిన వెలివెల దేవల రాజు పంతులుగారికి నీగ్రంథ విషయములో నాకు సర్వవిధములఁ జేతోడుగానుండి సంస్కరించిన - ఆయుర్వేద భిషక్ - మహాకవి - కవిసింహ - నల్లా చినకోటయ్యగారికి, బహు దొందరగా నచ్చుపనిఁ బూర్తిగావించి యొసంగిన తత్కృష్ణాప్రెస్ మేనేజరు శ్రీ కాకుల వేంకటస్వామి గారికిని, మహా పవిత్రమైన నీ గ్రంథమును భక్తిశ్రద్ధలతోఁ జదివినవారికిని, విన్నవారికిని నఘటనాఘటన సమర్థుండగు శ్రీరామచంద్రమూర్తి యష్టైశ్వర్యంబులం జేకూర్చి రక్షించుచుండునుగాక.

ఇట్లు,

శృంగవరపు కోట
3—5—1954

అనుభవ వేదాంత ప్రదర్శక,
**చదువుల వీరరాజుశర్మ**

# ఏ తద్గ్రంధ ప్రకాశిక పవిత్ర నామములు.

## మ హా రా జ పో ష కు లు

### పా ల కొ ల్లు.

మ॥రా॥శ్రీ కొడంగి రామప్పగారి కుమారుడు

| | | |
|---|---|---|
| | కె. ఆర్. గోపాలరావుగారు | 25 0 0 |
| | **రాజ పోషకులు - పాలకొల్లు** | |
| ,, | కె. ఆర్, శ్రీనివాసరావుగారు | 10 0 0 |
| ,, | కె. ఆర్. లక్ష్మీనారాయణగారు | 10 0 0 |
| ,, | బి. సత్యానందరావుగారు | 10 0 0 |
| ,, | సింహాద్రి సత్యనారాయణమూర్తిగారు (రాజవొాగి) | 11 0 0 |
| ,, | యిమ్మిడి సత్యనారాయణమూర్తి శ్రేష్టిగారు | 10 0 0 |
| ,, | నాళం సుబ్బారావు గుప్తగారు | 10 0 0 |
| | (పూళ్లగ్రామము) | |
| ,, | వెలిచేటి రామమూర్తి పంతులుగారు | 15 0 0 |
| | ( రిటైర్డు గవర్నమెంటు మిల్టరీ గెజిటెడ్ ఆఫీసరు ) | |
| ,, | పూళ్ళ పెదకోదండరామయ్యపంతులుగారు | 10 0 0 |
| | (హెడ్కరణం) | |
| ,, | తోట కృష్ణమూర్తిగారు బి. ఏ. | 10 0 0 |
| ,, | మద్దుల చంద్రనాగపూర్ణగోపాలరాయుడుగారు | 10 0 0 |
| ,, | కల్లి వెంకటేశ్వరరావు నాయుడుగారు | 10 0 0 |

## ——* పో ష కు లు *——

| | | |
|---|---|---|
| మ॥రా॥శ్రీ | పడ్డి వీరన్నగారు | 5 0 0 |
| ,, | అడబర్ల అప్పారావుగారు | 5 0 0 |
| ,, | పప్పా సరసయ్యగారు | 5 0 0 |
| ,, | కాకితి సుబ్బరాజుగారు | 5 0 0 |

| | | |
|---|---|---|
| మ॥రా॥శ్రీ | ఉద్దగర్ల నారాయణ అప్పారావుగార్లు | 5 0 0 |
| ,, | దేవాలయంట్రస్టీలు | 5 0 0 |
| ,, | అల్లు అప్పలస్వామిగారు | 5 0 0 |
| ,, | వడ్డిపట్ల చినగంగరాజుగారు | 5 0 0 |
| ,, | వర్తక సంఘమువారు | 5 0 0 |
| ,, | వెజ్జు సోమన్నగారు | 5 0 0 |

## —♦ దిగమఱ్ఱు గ్రామము ♦—

| | | |
|---|---|---|
| మ॥రా॥శ్రీ | అల్లూరి సర్సింహరాజుగారి భార్య వెంకయ్యగారు | 5 0 0 |
| ,, | కుంచె శ్రీమన్నారాయణమూర్తి, విశ్వనాథంగార్లు | 5 0 0 |

## పాలకొల్లు గ్రామము

| | | |
|---|---|---|
| ,, | ఆనందాశ్రమమువారు | 5 0 0 |
| ,, | యు. యస్. రామారావుగారు | 5 0 0 |
| ,, | కూచిబొట్ల సత్యనారాయణమూర్తిగారు | 5 0 0 |
| ,, | కాకుల మాచిరాజుగారు | 5 0 0 |
| ,, | నడపంటి గోపాలకృష్ణమూర్తిగారు | 5 0 0 |
| ,, | వెలివెల దేవలరాజుగారు | 5 0 0 |
| ,, | గుడిమెట్ల రాజలింగగుప్తగారు | 5 0 0 |
| ,, | సింగంశెట్టి లక్ష్మీనారాయణగారు | 5 0 0 |
| ,, | సూకల సూర్యారావుగారు | 5 0 0 |
| శ్రీమతి | కె. ఆర్, సత్యవతీదేవిగారు(కె.ఆర్.గోపాలరావుగారుభార్య) | 5 0 0 |
| ,, | గోటేటి అన్నపూర్ణమ్మగారు | 5 0 0 |
| ,, | కారుమూరి శేషమ్మగారు | 5 0 0 |
| ,, | దశిక మాణిక్యాంబగారు | 5 0 0 |
| ,, | కొమ్మూరి సూర్యకాంతమ్మగారు | 5 0 0 |
| | పల్లాపజ్జుల లక్ష్మీకాంతమ్మగారు | 5 0 0 |

ఓం

శ్రీరామ చంద్ర పరబ్రహ్మణేనమః

# గజేంద్ర మోక్షణ రహస్యార్థము.

ఓంకార ప్రతిపాద్య శాశ్వత పరబ్రహ్మాభిధ శ్రీపతి
స్వేచ్ఛానుగ్రహవాన్ పరస్త్రిగుణతస్సృష్ట్యాదికర్తాస్వరాట్
బాహ్యాభ్యంతరగోనిరూఢమహిమా స్వేషాంపుమర్థాన్ దద
ద్యః క్రీడార్థమభూన్నృపస్తమజితం రామం శరణ్యం భజే॥

## ఓంకార రహస్యము.

శ్లో॥ అష్టాంగంచ చతుష్పాదం - త్రిస్థానం పంచ దైవతం
ఓంకారంయోనజానాతి - బ్రాహ్మణో నభవేతుసః॥

## కృష్ణ పరమాత్మ స్తవము.

శ్లో॥ కృష్ణత్వదీయపదపంకజ పంజరాంతే ఽ
ద్యైవమే విశతుమానస రాజహంసః
ప్రాణ ప్రయాణ సమయే కఫవాత పిత్తైః
కంఠావరోధన విధౌస్మరణంకుతస్తే॥

తంబు యత్నించి కష్టించుచుఁ దత్సంబంధుల వలన వంచితులయి దుఃఖించుచు మోక్షమార్గమునకుఁ గడుదూరగులై తమతమ కర్మ విశేషంబున దేవదానవ నరమృగ పశుపక్షి క్రిమికీటకాది యోనులంబుట్టుచు గిట్టుచుఁ జన్మాంత చర్వణముగాఁదిరుగు కష్టజీవులయందుఁ గనికర హృదయులై మహామహులైన పెద్దలనేకచోట్ల దేవాలయములు నిలుపుటయేగాక, పురాణములు, - భక్తులయొక్క చారిత్రములు మొదలగునవి తగు దృష్టాంతములతో వర్ణించిరందు, సత్యముయొక్క మహిమనుచూపించుటకై హరిశ్చంద్రుని యొక్కకథయు, భక్తుల మహిమ వెల్లడి చేయుటకై ధ్రువుని యొక్కయు, ప్రహ్లాదునియొక్కయు కథలును - సతీధర్మములు ప్రకటించుటకై సీతా· సావిత్రీ మహిళామణులయొక్క కథలును - పితృభక్తి యొక్కయు, బ్రహ్మచర్యము యొక్కయు మహిమలఁ దేటపఱచుటకై శ్రీరామ, భీష్ముల చరితములును - అతిథి సేవా మహిమను బోధించుటకై మయూరధ్వజుని చారిత్రము మొదలగునవి యెన్నిటినో, సమాధి_లౌకిక - పరకీయ భాషలయందా యా సమయానుకూలములుగా ననేక రకముల రూపకముతో సరళములుగా నేరుపఱచి చిరస్మరణీయులైరి. ఆచరిత్రలఁ జదివియు నాలకించియు - నాయాపద్ధతులలోఁ దమతమ కనుకూలములైన - ధర్మములను - శీలములను - గ్రహించి యాచరించి కొంతమంది ధన్యాత్ములైరి. అట్టివారిలోఁ

బరీక్షిన్మహారాజొక్కఁడతండు శమీక మహాముని తనూజుండగు శృంగియను వానివలన శపింపఁబడి, శుక మహామునిచే నేడు దినంబులలో శ్రీమద్భాగవతం బాలించి తరించెనట్టి భాగవతంబుననే, బుద్ధియను జలంబులతో నిండి - సందేహములను తరంగములతోను - నింద్రియార్థములను బిసప్రసూనములతోడను గూడిన, మనస్సను సరస్సునందు, జీవుఁడను గజేంద్రుఁడు దిగి, కామమను మొసలిచే పట్టువడి, జన్మపరంపరలను నానావిధ దుఃఖములనుభవించి వ్యాపక చైతన్య స్వరూపుండగు శ్రీ చక్రాయుధునిం బ్రార్థించిన, నాజనార్దనుండంతజ్ఞానమను చక్రముచే మొసలినిఁద్రుంచితత్కుంజరాధిపతిని రక్షించెనెట్లనగా-

శ్లో॥ అహంకారలతావిష్టం - కామః క్రోధదళాద్యుతం
ఇంద్రియార్థ భ్రమః పుష్పం - సందేహతరగంతథా
బుద్ధిరూపజలోపేత - మగాధం తృష్ణసంజ్ఞితం
ఆశాకూల విశాలంచ - కంచిదస్తిసరోవరం
యస్యసంజ్ఞమనశ్చేతి - యస్మిన్ జీవోవగాహతి
అనపేక్ష్యతాని పుష్పాణి-తస్మిన్ స్నానంకరోతియః
తేనపత్రలతాస్పందం - నసంభవతి కుత్రచి
న్నాభిజాయత్యహంకారో —సజీవన్ముక్తఉచ్యతే॥

తాత్పర్యం॥ అహంకారమను లతాన్వితమైనట్టియుఁగామాదిదలయుక్తమైనట్టియు —నింద్రియార్థము (విషయము)లను భ్రమజనక పుష్పంబులును, సంశయతరం

గములును, ధీరూపజలంబును, ద్రుష్ణ యను నగాధంబు (లోతు)ను, ఆశయానుకూలంబు (ఒడ్డు) ను, గలిగినయొకానొక మనోనామక సరోవరముకలదు. తత్సరస్సునందు జీవుండుప్రత్యహము (ప్రతిదినము) ను స్నానముఁ జేయుచుండును — ఇంద్రియార్థ (శబ్దాద) పుష్పముల నపేక్షింపక " శారీరం కేవలం కర్మకుర్వన్నాప్నోతికిల్బిషమ్" శరీరోపయోగమాత్రముఁ గర్మఁ జేయుచున్నవాఁడుపాపమును పొందఁడు, అను గీతావచన ప్రకారము జీవన్ముక్తుఁడని చెప్పబడు చున్నాడు —

అనగా నిమిత్తమాత్రమైనచో, నహంభావమనులతయును విషయసుమంబులను —స్పృశించక ప్రారబ్ధ భోగమాత్రుం డైనవాఁడు జీవన్ముక్తుఁడని యాశయము.

ఇట్లు శ్రుతి, స్మృతి, పురాణ, యుక్తి: యుక్త ప్రమాణములతోఁడను—అనుభవ పూర్వకమైన యుపమానములతోఁడను—రహస్యార్థ, బాహ్యార్థములు వ్రాయుబడినవి

సీ॥ మానవాధీశ్వర ♦ మనువునాలనవాఁడు
తామసుండనఁగ,ను – త్తముని భ్రాత
పృథివీపతులు, కేతు, – వృష, నర. ఖ్యాతాదు
లతనిపుత్రులు పద్ధు – రధికబలులు
సత్యకహరివీర – సంజ్ఞాలు వేల్పులు
త్రిశిఖనామమువాఁడు – దేవవిభుఁడు

మునులుజ్యోతిర్వ్యోము — ముఖ్యులు, హరిపుట్టె
హరిమేధునకుఁబ్రీతి — హరిణియందు
గ్రాహబద్ధుండైన — గజరాజు విడిపించి
ప్రాణభయము వలనఁ — బాపికాచె
హరిదయాసముద్రుఁ — డఖిలలోకేశ్వరుఁ
డనినశుకునిఁజూచి — యవనివిభుఁడు.

బాహ్యార్థము— హేపరీక్షిన్మహారాజా! ఉత్తముని భ్రాత యగు తామసుండనుచతుర్థమనువునకుఁ గేతు, వృష నర, ఖ్యాతాది పుత్రదశకంబుఁగలిగినది. సత్యక, హరి, వీర, నామకులగు వేల్పులును—త్రిశిఖుఁడను దేవవిభుఁడును - జ్యోతిర్వ్యోమాది మునులును — హరియును జన్మించిరి, హరిమేధునకుఁ బురంధ్రి యగు హరిణియందు — గ్రాహముచే, పట్టువడిన గజేంద్రుని రక్షించినట్టి శ్రీమహావిష్ణువవతరించెనని శుకమహాఋషి చెప్పినఁబరిక్షిద్భూవిభుండు -

రహస్యార్థము — క్షరాక్షరముల కంటె నన్యుఁడగు పరమాత్మ "ఉత్తమః పురుషస్త్యః" అతనియొక్క భ్రాత మాయాప్రతిబింబితుఁడగు నీశ్వరుఁడు. వాని వంశమందు ముఖ్యుఁడగు హరివాసుదేవవ్యూహాత్మకుండగు శ్రీమహావిష్ణువు గజేంద్రుఁడగు జీవుని - కామ గ్రాహమువలన భోగహేతుకమైన జన్మ పరంపరల నుండి విముక్తునిఁజేసి రక్షించెనని శుకముని చెప్పిన విని యవని విభుండు వానినిఁగాంచి —

కం॥ నీరాట వనాటములకుఁ
బోరాటంబెట్లుకలిగెఁ — బురుషోత్తముచే
నారాటమెట్లు మానెను
ఘోరాటవిలోని భద్ర — కుంజరమునకున్.

బాహ్యా॥ ఉదకమందు సంచరించు మకరమునకును - అరణ్యమందుఁ దిరుగు ద్విరదంబునకును - కలహ మెట్లు సంభవించె నావెనుక నాకుంజర ప్రాణాదం బాలించి వనమాలి మొసలినిఁగూల్చి యేనుఁగు నెట్లు రక్షించెను?

రహ॥ నీరు, అనగా బుద్ధి, చిత్స్వరూపి, శ్లో॥ యోవైసర్వ గతోవిష్ణుశ్చిత్స్వరూపీ నిరంజనః సవీవరు(ద్ర)దరూపేణ గంగాంభోనాత్ర సంశయః" చిత్స్వరూపమగు సర్వవ్యాపక విష్ణువే ద్రవ (జల) రూపమయి, నిస్సంశయముగా గంగారూపము నొందుచున్నాడు. అట్టి జలరూప బుద్ధియే సంకల్ప రూపము నొందుచున్నది. "బుద్ధి సంకల్పితాకారా ప్రయాతి మనసాస్పదం-సంకల్ప మనసీభిన్నే నకదాచన కేనచిత్"బుద్ధియేసంకల్ప రూపమగు మనోరూపము నొందు చున్నది. సంకల్ప మనస్సుల కెట్టివారును భిన్నత్వ మెన్నఁడుఁ గలుఁగఁ జేయఁజాలరు. కావున నట్టి సంకల్ప జల జనిత కామము నకును "సంకల్ప ప్రభవాన్ కామాన్" "కామమా! నీ జన్మమూలమునేనెఱుంగుదు, సంకల్పము వల్లనే కదా పుట్టుచున్నావు. అట్టి కామము నకును, వనాటమనగా "వస్యతే సేవ్యత ఇతివనం" జీవులచే సేవింపఁబడునది. అధిష్ఠాన చైతన్యము దాని యందుఁ జరించునది. ఆత్మ యొక్క కళయగు ప్రతిబింబిత జీవునకును - సంసారరూప ఘోరాటవియందుఁ గలహమెట్లు కలిగెను? పురుషోత్తమునిచే నా పోరు (భవదుఃఖము) ఎట్లు నివారింపఁబడెను? అనిజనపతిప్రశ్నింప. జీవుఁడనగా "శ్లో॥ చైతన్యం యదధిష్ఠానం లింగదేహశ్చయః పునః

చిచ్ఛాయాలింగదేహస్థాతత్సంగో జీవ ఉచ్యతే" అధిష్ఠాన చైతన్యము-
సూక్ష్మదేహము - నాసూక్ష్మదేహమను లింగదేహమందు ప్రతిబింబిత
కళయునుఁ గలసి జీవుఁడయ్యెను.

కం॥ మునినాథ యీకథాస్థితి
వినిపింపుము వినఁగ నాకు - వేడుకవుట్టెన్
విని మొదఁ గర్ణేంద్రియముల
పెనుబండువు సేయు మనముఁ - బ్రీతిం బొందన్

భాష్యా॥ ఓ మునిచంద్రమా! యిక్కథ వినుట కెంతయు సం
తోషమగుచున్నది. కర్ణపుటాంజలిచే తత్కథామృ
తముఁ బానముఁ జేసెదఁ గావున నానతిమ్ము.

రహ॥ మునియనగా ॥ శ్రు ॥ "బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తి
ష్ఠాసేత్ - బాల్యంచ పాండిత్యంచ నిర్విద్యాథ ముని రమౌనంచ మౌ
నంచ నిర్విద్యాథ బ్రాహ్మణః". బాల్యేన అనగా బ్రహ్మజ్ఞానబలభావము
చే విషయదృష్టినిఁ దిరస్కరించి యుండుటకుఁ గోరి, బాల్యంచ, -
ఆత్మవిజ్ఞాన బలభావమును, పాండిత్యంచ - అనాత్మజ్ఞాన తిరస్కా
రము. అనగాఁ బ్రపంచ సత్యత్వభ్రాంతి నిరసనముఁ బూర్ణముగా, స
భ్యసించి, మౌనము - (సంకల్ప రాహిత్యము) కలుగువాఁడు ముని,
వాఁడే బ్రాహ్మణుఁడు. మునినాథా! యీకథాస్థితి అనగా సధ్యారోపాప
వాదపూర్వకమగు కల్పనాకథ - అధ్యారోపమనగా సత్పదార్థమునం
దన్య పదార్థకల్పన "రజ్జుసర్పః శుక్తిరజితః" మున్నగునవి. అప
వాదమనగా - యదార్థవస్తువును గ్రహించి ఆరోపిత వస్తుభావ నిరస
నము - బ్రహ్మమునందు నామరూప జగదారోపణముఁ బిమ్మట బ్ర
హ్మజ్ఞానముచే నపవాదము "సర్వం బ్రహ్మైవ కేవలమ్" అని జగ
త్తును బ్రహ్మముగా చూచుటయగును. —

పూర్వపక్షి - "శ్రు॥ అశబ్దమస్పర్శమరూపమవ్యయం నిష్కలం నిష్క్రి

యం” శబ్దాది విషయ రహితము, నవ యపరహితము, క్రియారహితము, మున్నగు విశేషములచేఁ బరిగణింపఁబడిన బ్రహ్మమునందు కల్పన యెట్లు కలిగె, నది. శ్రుతి విరోధము - నద్వైత భంగముకాదా?

సిద్ధాంతి- శ్రు॥ తస్మిన్ త్రిగుణసామ్యాసా - మూలప్రకృతిసాజ్ఞికా, శుక్లలోహిత కృష్ణైకా శక్తిరాసీత్ స్వయం ప్రభా - మరుభూమావాజలం శుక్తౌ రౌప్యం స్థాణౌచ పూరుషః - స్ఫటికేపిచ రేఖేవ - భాసమానానిజభ్రమాత్” అట్టివిశేషణ యుక్త వ్యాపకమైతన్యమగు బ్రహ్మమునందు, ఎండ మావులందు జలము - ముత్యపుఁ జిప్పయందు వెండి - స్థాణువునందుఁ బురుషుఁడు - స్ఫటికము నందు రేఖలు - వలె, త్రిగుణ రూపియగు శక్తి (ప్రకృతి) స్వయం ప్రకాశమానమైకలిగెను, ఇదియే అద్వైత మతము, భ్రమచే కల్పితమైన పదార్థములు సత్యమైనచో మీ ప్రశ్న, ముపపన్నమగును - గాని, స్వప్న సత్యమువలెఁ బూర్వోత్తరముల యందుఁ దోచక వర్తమానమునందు మాత్రమేఁదోచునది “ ఆదావంతే చయన్నాస్తి వర్తమానేపి తత్తథా” యేది ఆద్యంతములయందభావమో. అది ప్రస్తుతమునఁ గూడ, లేదనియే నిశ్చయింపఁబడును “ మాయా మాత్రమిదం ద్వైత మద్వైతం పరమార్థతా - మాయా కార్యాదికం నాస్తి - మాయానాస్తి జగన్నహి -

నేహనానాస్తికించన, ననిరోధో నచోత్పత్తిర్నచబ ద్ధో నచసాధకః నముముక్షు ర్నవైముక్తః ఇత్యేషా పరమార్థతా" ద్వైతముగాఁదోచుదృశ్యమానప్రపంచము మాయామాత్రమే కాని సత్యముకాదు. పరమార్థమున అద్వైతమే నిశ్చయము - మాయా కార్యాదికమును - మాయయును - జగత్తునులేవు - నానాత్వమేమియులేదు. నిరోధము — ఉత్పత్తి, బద్ధము, సాధనము — ముముక్షువును లేరు, అనెడి మొదలగు శ్రుతులన్నియు నద్వైతమునే నిశ్చయించుచున్నవి. ఇందులకు యోగవాశిష్ఠమందు శ్రీరామచంద్రునకు శైశవమున నిద్రిపట్టుటకునై, దాదిచేనొక కథచెప్పఁబడినది యెటులనఁగా—

శ్లో॥ ద్వానజాతౌతథైకస్తు గర్భఏవ నచస్థితః
వసంతితే ధర్మయుక్తాః అత్యంతాసతిపట్టనే
స్వకీయాచ్ఛూన్యనగరా — న్నిర్గత్యవిమలాశయాః
గచ్ఛంతో గగనేవృక్షా — దదృశుఃఫలశాలినః
భవిష్యన్నగరేతత్ర - రాజపుత్రాస్త్రయోపితే
సుఖమధ్యస్థితాః పుత్రి — మృగయావ్యవహారిణః

ఓ శ్రీరామచంద్రా! అసత్పట్టణ మందు ముగ్గురు రాజపుత్రులుకలరు. వారలలో నొకఁడు గర్భమునందు పతనము లేనివాడును - పరిశిష్టద్వయమును మిలిగిన యిద్దరు పుట్టుకలేనివారలు నయి, స్వకీయ శూన్య నగరము

నుండి వెడలి గగనమునందు ఫలవంతములగు వృక్షములను జూచి భవిష్యన్నగరము (ముందుకట్టబోవు పట్టణము) నుండి వేటాడ వెడలనిచ్ఛావినోదులై యుండిరి. ఇట్లు మా ఉపప్రశ్న లేనిచో నుడువుట కెడతెగని కల్పిత కథలెన్నియో చెప్పఁబడును —

సీ॥ అజ్ఞులు వచియించు ♦ నాఖ్యాయి కంబోని
జగముల సృష్టిదృ ♦ ష్టాంతమగును
అదియెట్టులన్నచో ♦ నాకాశకుసుమంబు
గంధర్వనగరస్థ ♦ కాంతదురిమి
ఆభాసవస్త్రమ్ము ♦ నాచ్ఛాదనమొనర్చి
మరుభువిజలముల ♦ మగ్నమగుచుఁ
ద్రుమరహితంబైన ♦ తోటలో విహరించి
సంగహీనునితోడ ♦ సరసమాడి
యిండ్లు లేనట్టి పట్టణ ♦ మిరవుఁ జేసి
కనియె సుతులను వంధ్యయై ♦ కలవుఁదీఱ
ననెడు సామెతవలెజగ ♦ మనృతమగును
గానివాచావికారమై కానబడును.

కావున నానందముగవిని యెదఁజెప్పుమని.

కం॥ ఏకథలయందుఁబుణ్య
శ్లోకుఁడు హరిసెప్పఁబడును — సూరిజనులచే
నాకథలు పుణ్యకథలని
యాకర్ణింపుదురు పెద్ద— లతిహర్షమునన్.

భా॥ తా॥ ఏచరిత్రములయందు గోవిందునిఁ గూర్చి ప్రశం
సింపబడునో తచ్చరిత్రములు మోక్ష దాయకమగు
కథలని యార్యులు ప్రీతితో వినియెదరుకదా!

రహ॥ హరి - "హరిశ్వతి పాపాని" పాపహరుఁడగు శ్రీపతిఁగూర్చివ్యానం గముఁజేయఁబడునో అనగా శ్రు॥ ఉత్తమాతత్వ చింతాచ -మధ్యమంశాస్త్రచింతినం — అధమామంత్ర చింతాచ —తీర్థ భ్రాంత్యధమాధమం" తత్వచింతన (బ్రహ్మవిచారణ) ఉత్తమమును - శాస్త్ర చింతనమధ్యమము — మంత్రచింతన మనగా, నభిచార వశీకరణాదిక, మధమమును - దీర్ఘయాత్రాధిక మధమాధమముగాఁ జెప్పుచున్నారు తత్వమనగా నాపరమాత్మయే నీవనిబోధ —

శ్లో॥ యథైధాంసిసమిద్ధోగ్ని - భస్మసాత్కురుతే ఉర్జున
జ్ఞానాగ్ని సర్వకర్మాణి - భస్మసాత్కురుతేతథా.
నహిజ్ఞానేన సదృశం - పవిత్రమిహ విద్యతే॥

ప్రజ్వలితాగ్ని, యింధనము (చిదుగు) లను భస్మముసేయునటులు జ్ఞానాగ్ని సకల కర్మలను భస్మముచేయును. జ్ఞానముతోఁదుల్యమగునదెద్దియు లేదు.

శ్లో॥ మోక్షార్థం బ్రహ్మవిజ్ఞాన - మితివేదాంతడిండిమః
బ్రహ్మవిచారణమోక్షార్థమేయగును. "శ్రు॥ జ్ఞానాదేవహికైవల్యమ్" జ్ఞానమువలననే తప్పక మోక్షముగలుగను —

శ్లో॥ అశ్వమేధ సహస్రాణి - వాజపేయశతానిచ
ఏకస్యజ్ఞానయోగస్య — కలాంనార్హంతిషోడశీం॥

వేయి యశ్వమేధములు - నూఱు వ్యాజపేయము లనగా

(యష్ట్ర విశేషము)లయొక్క ఫలరూపసుఖము - క్షణికాన్ధ కాలముఁ జేసిన బ్రహ్మవిచారణ ఫలజనితానందమునకుం దులఁదూఁగఁజాలవు.

శ్లో॥ స్నాతంతేనసమస్తతీర్థనిచయే-దత్తంమహీమండలం
విప్రేభ్యః పితృదేవతా సురగణా - సర్వేపి సంతర్పితాః
జప్తంమంత్ర సహస్రకోటిదమునా - తప్తంచతీవ్రంతపో
యస్యబ్రహ్మవిచారణేక్షణమపి - ప్రాప్నోతిస్థైర్యంమనః

పుణ్యతీర్థములందు స్నానముఁ జేసినందువలనను - సకల దానములొనర్చినందువలనను బ్రహ్మయజ్ఞపితృ తర్పణము లొనర్చినందు వలనను - దేవతారాధనముల వలనను — గాయత్ర్యాది మంత్రముల వలనను — చాంద్రాయణాది తపస్సులవలనను - ఏమి ఫలముగలదో, నిర్విషయ స్థితిలో నుండి పరమాత్మ నొక్కక్షణము ధ్యానించిన నంతఫలము గలుగఁగల దందురు — కాన సత్వర మెఱఁ గింపుఁడని.

ప్రాయోప విష్టుండైన పరీక్షన్నరేంద్రుం డడిఁగిన శమీక మునిపుత్రుండగు శృంగి యనువానిచే శపింపఁబడి పరీక్షిద్భూవిభుండు మరణాసన్న నిశ్చయచిత్తుండై శ్రీమద్భాగవతంబున గజేంద్రమోక్షణ కథ వినఁదొందఱ పడుచుండె నని శుకముని కనికర హృదయుండయి.

తహా॥ పరీక్షితుఁడనఁగా నశ్వత్థామ, కరవిముక్త విశిఖాగ్నిచే, నుత్తర గర్భస్థుండగు జీవుఁడు పరితప్తుండై శ్రీకృష్ణపరమాత్మునిఁ బ్రార్థింప నతండు తత్ప్రాణానలోప శమనంబుఁగావించి రక్షించిన తదుపరిఁ దన్ను

రక్షించిన పరమ పురుషుండెచ్చటనున్నాడని పరీక్షించి నందునంబరీ
క్షిత్తని పిలువంబడె, శ్రీకృష్ణుండనగా (సచ్చిదానందము)

శ్లో॥ కృషిర్భూవాచకశ్శబ్దో - ణశ్చనిర్వృతివాచకః
తయోరైక్యం పరబ్రహ్మ - కృష్ణయిత్యభిధీయతే॥

కృ - అనగా భూవాచకము (భూ, సత్తాయాం) సత్, ణ - కారమనగా నిర్వృతిః (ఆనందము) ష—కార మనగా చిత్, తద్వర్ణసంయుక్తము, సచ్చిదానందము అట్టి సచ్చిదానందరూప శ్రీకృష్ణ పరబ్రహ్మ మెచ్చట నున్నది యని యన్వేషించినందున, నాత్మా, నాత్మలను పరీక్షించి నందునం బరీక్షిత్తని పిరక్షింపంబడెను—ఆయాత్మానాత్మ లనగా నెవ్వి?

శ్లో॥ అస్తిభాతి ప్రియంరూపం- నామంచేత్యంశపంచకం
ఆద్యత్రియం బ్రహ్మరూపం—జగద్రూపంతతోద్వయం

అస్తి— సత్, భాతి— చిత్, (ప్రకాశము)ప్రియం- ఆనందము అనగా నెట్లు శర్కర శ్వేత మృధుమధురములు విభజించుటకు వీలులేనో, అట్లు సచ్చిదానందమును బదత్ర యముగా విభజింప వీలులేనియాత్మ - శేషించిన రూపము నామములు —మాయాస్వరూపము. సచ్చిదానంద మొకే రూపముతోం బ్రకాసించు పరబ్రహ్మమగును.

శ్రు॥ తస్యప్రియమేవశిరః మోదోదక్షిణః పక్షః ప్రమో
ద ఉత్తరః పక్షః ఆనంద ఆత్మాబ్రహ్మపుచ్ఛంప్రతిష్ఠా॥

ప్రియము - మోదము — ప్రమోదము—కుడి —

[illegible]—[illegible] భాగములు కలిగి ఆనందాత్మకమయి, [illegible] (పుచ్ఛ) మగు నేయానందమయ కో[illegible] కలదో అదియేయాత్మ—

[illegible] — అయితే, పరమాత్మ అన్నమయాది కోశా[illegible] చెప్పఁబడినదికదా! యనిప్రశ్నించిన

[illegible]— నామరూపాత్మకమగు జగత్తుతో సమానాధికరణముఁజేసి చెప్పినపుడు. అనుభవ పూర్వకమగు ఆనందమయ కోశమే, యాత్మయని చెప్పఁ బడెను. "బీజనిద్రాయుతః ప్రాజ్ఞః — సాచతుర్యేనవిద్యతే" సుషుప్తియందస్వప్న బీజమును, వ్యాపక చైతన్య (బ్రహ్మ) కళయును, చంద్రోదయ యాపధము [illegible] సువర్ణవర్ణము మిళితమైనట్లు జగద్బ్రహ్మములు సుసంగతమైయున్నవి. ఆకళయే అవిద్యాప్రతిబింబిత ప్రాజ్ఞుఁడని పిలువఁబడును. తురీయమునందస్వప్న బీజములేదు. సుషుప్తి వఱకే సర్వానుభవమగుటచే ప్రత్యక్త్వామిళిత మగు నానందమయ కోశమేయాత్మయని బోధించికోశసమాప్తిఁ జేయఁబడినది కావున — అస్తి — భాతి — ప్రియములను సచ్చిదానంద స్వరూప బ్రహ్మమును (ఆత్మయును) రూప, నామములగు అనాత్మయును క్షీరనీరముల వలె నేకాకారమైయున్నవి.

శ్రు॥ తద్ధేదంతర్హ్యవ్యాకృతమాసీత్ — తన్నామరూపా భ్యామేవ వ్యాక్రియతా సానామాయ మిదం రూపఇతి.

ఆపరబ్రహ్మమే గుణసామ్యమగుప్రకృతితోఁగలసి మొదట నవ్యక్తము (బీజము) గానుండి పిదప దేవదత్తాది నామములచేతను, నీలపీతాది రూపముల చేతను — వ్యక్తమయి, షడ్వికారయుక్తమాయాకార్యమగుసంసార పాదపమగుచున్నది. యెట్లువృక్షమునకు బీజము కారణమయి పృథ్వియధిష్ఠాన(స్థితికిఆధార) మగుచున్నదో యటులు సంసార పాదపమునకు. అవ్యక్తము కారణమయి బ్రహ్మమధిష్ఠానమగుచున్నది. యెట్లు వృక్ష బీజములతోఁ బృథ్వికి సంబంధములేదో యట్లు మాయా,తత్కార్యములతో బ్రహ్మమునకు సంబంధములేదు. కావున దేహేంద్రియ ప్రభృతి అవ్యక్తపర్యంతము . ననాత్మయని చెప్పఁబడినది

శ్లో॥ దేహేంద్రియ ప్రాణమనోహమాదయః — సర్వేవికారా విషయాస్సుఖాదయః, వ్యోమాది భూతాన్యఖిలంచవిశ్వ - మవ్యక్త పర్యంతమిదంహ్యనాత్మ

దేహము, ఇంద్రియములు,ప్రాణములు, మనస్సు బుద్ధి, (అహం) శబ్దస్పర్శాదివిషయములు, తజ్జనితములగు నానావిధదుఃఖములు, ఆకాశాది భూతపంచకమును, దన్మేళనమగు నశేషప్రపంచమును - నవ్యక్తపర్యంతమనాత్మయని చెప్పఁబడినది. (ప్రకృతి, అవ్యక్తము, మాయ, అశ్వ

ద్ధము, మున్నగునవి. యనాత్మకుఁబర్యాయపదములు) బీజ మునకు మృదధిష్ఠానమైనటు. లనాత్మకుఁబురుషుఁడే. యధి ష్ఠానమని సంశ్రివణమగుచున్నది.

శ్లో॥ మనసశ్చపరాబుద్ధిః - బుద్ధేరాత్మామహాన్పరః
మహతః పరమవ్యక్త - మవ్యక్తాత్పురుషః పరః
పురుషాన్నపరంకించి - త్సాకాష్ఠాసాపరాగతిః.

సంకల్పరూప మనస్సుకంటె నిశ్చయాత్మకమగు బుద్ధియును - బుద్ధికంటె - నాత్మ(ప్రతిబింబకళ) క్షేత్రి జ్ఞుఁడు, ఆత్మకంటె—మహత్తత్వము (హిరణ్మయుఁడు-సూ త్రాత్మ, మహత్తత్వము కంటె -అవ్యక్తము [అంతరాత్మ] దానికంటెఁబురుషుఁడు [పరమాత్మ] పరములు. ఆ స్థితినిఁ గాష్ఠయని నుడువుదురు. కాష్ఠ, పరా, ఆత్మ, క్షేత్రిజ్ఞుఁడు సాక్షి మొదలగునవి. యాత్మకుఁబర్యాయపదములు-ఇట్లా త్మానాత్మల పరీక్షకుఁడగుఁ పరీక్షిన్నరేంద్రుండు ప్రాయో పవిష్టుండై యనగాఁ బధికునకు గమ్యస్థాన దీక్షవలె మో క్షైక దీక్షాపరుండై సర్వసంగములనువర్జించి, మరణాసన్న నిశ్చయుండైయుండెనని తాత్పర్యము — ముముక్షువునకు బహిరంగసాధనములను వైరాగ్యబోధోపరతులలో, వైరా గ్యము ప్రిథమ సోపానముగాఁ జెప్పబడినది యెటులనగా!

శ్రు॥ వమనాహారవద్యస్య -భాతిసర్వేషణాదిషు—
తస్యాధికారస్సన్యాసే - త్యక్తదేహాభిమానినః

ఎట్లు మాంసభక్షకుఁడు, మత్స్యాదిపచన సంస్థా

రజనితదుర్గంధామలను, సౌరభముగా గ్రహించునో, వాటి నే తపోధురీణుండగు సద్బ్రాహ్మణుఁ డెట్లుసహ్యామని యేవ గించి నాసికావివరముల మూసికొనునో యట్లు గాఢవైరా గ్యవంతుఁడగు ముముక్షువు. ఈషణత్రియ స్త్రీ వి త్తాది విషయములందు వమనాహారము వలె దేహాభిమాన వర్జి తుండై పూర్వానుభూతార్థ దుఃఖస్మృతిచే నిశ్చయంబుగా వివర్జిత విషయుండగును. వమనాహారమును, శ్వానము పు నర్గ్రహణ మొనర్చినటుల దేహాద్యభి మానాధీనుఁడగు జడుఁడు - మరల, మరల సంసారవిషయ గ్రహణా సక్తుం డగును. అట్టి దేహాభిమాన వర్జితునకే సన్యాసము నందధి కారమగును. గుడమునువిసర్జించినచోఁ బిపీలకము [చీమ] లుచేరనటులు విషయ భోగాభిలాష పాత్రమగు గాత్రము పై శరీరాభిమానముఁద్యజించినచోఁదన్మూలకములగుసకల దుఃఖపుంజములును. నశించును.

శ్రు॥ సంసృతిర్వ్రత్తతేర్బీజం - శరీరం విద్ధిభౌతికమ్
భావాభావ దశాకోశం — దుఃఖరత్నసముద్గతమ్
బీజమస్యశరీరస్య - చిత్తమాశావశానుగమ్॥

ప్రాప్తా- ప్రాప్త [హర్షామర్షా] ద్యవస్థలకుఁగో శము [వర] అయినట్టియు— దుఃఖములకు స్థాన మయినట్టి యు, నీపాంచభౌతిక శరీరమే సంసారపాదపమునకు బీజమ గుచున్నది.యాశావశమగు చిత్తమే శరీరద్రుమమునకువిత్త నమైయున్నది. ద్విశీర్ష భుజంగము [రెండుతలలపాము] ఇరు

దెసలను స్వచ్ఛందగమనముఁగలిగి యొక శిరస్సునశించిన
చో నితరము శక్తి విహీనమయి క్రమముగ నెట్లు నాశన
మగునో యటుల, నవిద్యాకార్యము [వాసనాకర్మము] ల
న్యోన్య కారణములై యొకటి నశించినచో నితరమునకుఁ
గూడనాశనముఁగల్గును.

శ్లో॥ హేతుద్వయంచచిత్తస్య—వాసనాచసమీరిణః
తయోర్వినష్ట ఏకస్మిం — స్తద్వావపివినస్యతః

చిత్తమను వృక్షోపజీవనమునకుఁబూర్వకర్మఫల
భోక్తృత్వ పేరకమగు వాసన [దృఢేచ్ఛ] యును, సమీర
ణమనగాఁబ్రాణవాయు స్పందము [వర్తమానకర్మ ప్రివ
ర్తకము] నను, కారణద్వయముకలదు. వాటిలో నొకటి
నష్టమైనచోఁ దద్వంద్వ వినష్టముకల్గును - బాహ్యావిషయ
ప్రకృత్యను సంధానమునందు ఫలమును. తత్ఫలమునందు
వాసనారూపకృములు సహజముగా నంకురించియుండును.

శ్లో॥ బాహ్యాను సంధిః పరివర్ధయేత్ఫలం
దుర్వాసనామేవతత స్తతోధికామ్
జ్ఞాత్వావివేకైః పరిహృత్యబాహ్యామ్
ఆత్మానుసంధిం విదధీత నిత్యమ్

బాహ్యవిషయేంద్రియసంయోగాను సంధానము
నిశ్చయముగా ఫలముఁగలిగించును. దానివలన నధికమగు
దుర్వాసన కల్గును. [అట్లైతింగిజ్ఞానులు బాహ్యాను సంధిని
వర్జించియాత్మానుసంధానముఁజేయవలెను]వాసనయనగా?

శ్లో॥ దృఢభావన యాత్యక్త్వా – పూర్వాపరవిచారణం
యదాదానంపదార్థస్య – వాసనాసాప్రకీర్తితా॥

పూర్వానుభూతయాతన (దుఃఖము) ను. రాబో వుకష్టములను యోచనసేయక. దృఢవాంఛా నిబద్ధుఁడై, విషయగ్రహణ మొనర్చునెద్దియో, దానినే వాసనయని పరిగణింతురు.

ఎట్లు పృష్టసుగంధ జంతువులగు పునుగు జవ్వాజి మున్నగు పిల్లులు నిశలయందెచ్చటెచ్చట విశ్రమించునో యా యా ప్రస్తర (జాతి) ఫలకములయందు సువాసనలు గ్రమ్మునట్లు వర్తమాన దుష్క్రియ (కర్మ)ల యందు రాగ ద్వేషములను వాసనాబీజములు అంతఃకరణఫలకమునందు వెదజల్లఁబడి, తద్వాసనలు పునరాగమ,భవ (రాబోవుజన్మ) మునందు దేహారంభాంకురములుగాఁ బరిణమించి ప్రారబ్ధ కర్మరూపజలసించితము లై దుఃఖ రూపఫలంబుల నొసంగుచు రథాంగము (చక్రము) వలెఁద్రిమ్మరుచుండును –

శ్లో॥ క్రియాశరీరోద్భవ హేతురాదృతా
ప్రియా ప్రియాతౌ భవతస్సురాగిణః
ధర్మేతరౌతత్రపునశ్శరీరకం
పునఃక్రియాచక్రవదీర్యతేభవః

కర్మమువలన జన్మమును – అనుభవజన్మక్రియలయందు ప్రియాప్రియములు (ఇష్టాయిష్టములు)ను. తన్నిమిత్తంబులగు ధర్మాధర్మములు (పుణ్యపాపములు)ను తత్ఫ

లసేవ్యమగు పరజన్మమును, ఇటులమాటిమాటికిని నూర్ధ్వాధోగమనముఁగలిగిన చక్రమువలె రాగవంతునకు భ్రమణముఁగలిగియుండును. వృక్షమునకు బీజమెట్లు సంప్రాప్తమయ్యెనో యనుపలబ్ధము (తెలియబడదు) కాని, వృక్షలబ్ధబీజములు పునరారోపణకారణములని తెలియఁబడును.

శ్లో॥ వృక్షదర్శనకాలేతు – నబీజముపలభ్యతే
వృక్షోద్ధితానిబీజాని – దృశ్యంతేవృక్షబీజవత్॥

ప్రత్యక్షవృక్షమునకు బీజమెట్లు లబ్ధమైనదో తెలియఁబడలేదు కాని తత్ఫలబీజములు భవిష్యద్వృక్షోత్పత్తికారణములని తెలియఁబడుచున్నవి. ఆరీతిని సుప్తి ముండా? కారుముండా? అనునట్లువాసనా కర్మము లన్యోన్య సహాయ సంపాదకములై యుండును. ఎట్లు సాధము నాశ్రయించిన పిశాచము తత్సాధ్యాత్మని బాధించునో యటులు స్థూల, సూక్ష్మోపాధిగతములైనయాధివ్యాధులు చిదాభాసుఁడగు జీవుని బాధించుచుండును – ఆధివ్యాధులనగా!

శ్లో॥ శరీరేజ్వరకుష్ఠాద్యాః క్రోధాద్యామానసాస్మృతాః
ఆగంతుకాభిఘాతోద్ధాః సహజాఃక్షుత్తృడాదయః॥

జ్వరకుష్ఠాదులు స్థూలోపాధివ్యాధులును– కామక్రోధాదులు సూక్ష్మగతములును – ఘాతాను [ దెబ్బ ] లాగంతుకములును – క్షుత్తృడాదులు సహజజ్వరములునైయున్నవి. రాగద్వేషములు పిండోత్పత్తి సమయమునందే వాసనారూపమున విస్తృతమయి (వ్యాపించి) యుండును.

శ్లో॥ ఇచ్ఛాద్వేషసముద్ధేన - ద్వంద్వమోహేనభారత
సర్వభూతాని సమ్మోహం - సర్గేయాంతిపరంతప॥

ఓయిభాగతా! భా:— ప్రకాశమగు పరమాత్మని యందు రత— ఆసక్తికలిగినవాఁడా! భార - సంసారమును త — [తనుత్వము] విస్తరింపఁజేసినవాఁడా! పరంతప — శత్రువులను తపింపఁజేయువాఁడా! లేక, పరమునుగూర్చి తపించువాఁడా!యని,ద్వ్యర్థిసంబోధనలు - ఇచ్ఛా ద్వేష, రూపద్వంద్వజనితమోహముచే సర్వభూతములును — సర్గే— పిండోత్పత్తిసమయము నందే వాసనా రూపమగు మోహమును పొందుచున్నవి.

అనగా జీవునకు వాసనాజనితమోహ రూపమహోదధి యు లంఘ్యమని యాశయము - కొండప్రక్కనుండు మృత్తు దృఢమయి క్రమంబున ఱాతిగాఁ బరిణమించినట్లు పూర్వ వాసనలు పరజన్మమునందుఁగ్రియారూపమయి సర్వదుఃఖా కరమగును.

శ్లో॥ దేహమూలమిదందుఃఖం దేహఃకర్మసముద్భవః
కర్మప్రవర్తతేదేహే — హంబుధ్యాపురుషస్యహి
అహంకారస్త్వనాదిస్యా - దవిద్యాసంభవోజడః
జీవకామ పిశాచేన — వాసనోవివశోభవేత్॥

పార్థ్రాను భవమునకు, దేహమును, దానికిఁగ ర్మమును, గర్మమున కహంతయును, దానికి నవిద్యయును గారణములు - అవిద్యాప్రతిబింబుఁడగుజీవుఁడు కామపిశా

చరిస్తుండగును. కావున జీవాశ్రయమగు విషయ భోగ వాంఛయే పిశాచమువలెఁ బ్రతిబంధకమగును.

శ్లో॥ భోగేచ్ఛామాత్రకో బంధ - స్తత్త్యాగో మోక్ష ఉచ్యతే

భోగేచ్ఛయే బంధమును - తత్త్యాగమే మోక్షమునునగును. గాని, తద్వ్యతిరిక్తంబు బంధమోక్షములు లేవు, భోగములన్ననో?

శ్లో॥ భోగో మేఘ వితానస్థో — విద్యుల్లేఖేవచంచలా
ఆయురప్యగ్ని సంతప్త — లోహస్థజలబిందువత్॥

భోగములు మేఘవితాన [మేఘవ్యాప్త] విద్యుల్లేఖ మెఱుపువలెఁజంచలములగును. ఆయువన్ననో యగ్నిదగ్ధ లోహగతజలబిందువువలె సద్యోనాశన స్వభావమైనది.

శ్లో॥ ఛాయేవలక్ష్మీశ్చ పలాప్రతీతా
తారుణ్యమం బూర్మితదధ్రువంచ
స్వాప్నోపమం స్త్రీ సుఖమాయురల్పం
తథాపిజంతో రభిమానవేషః

ఐశ్వర్యముఛాయవలెఁజపలమైనది. యౌవనము తరంగమువలె నస్థిరమైనది. స్త్రీసుఖము స్వప్న లబ్ధానంద మువంటిది. జీవితము క్షణభంగురము అనియిట్లు చక్షుర్గోచరమైనను. మనుజుఁడు సంసారమును సత్యమను ప్రత్యయము [విశ్వాసము]చే, నభిమానమును విడువకున్నాడు! ఇదియాశ్చర్యము? ఇట్లువలోడన [విచారణ] సేయువాఁడు జన్మములను గోరకముక్తినేగోరును.

శు॥ శ్రేయోహిధీరోఽభిప్రేయసోవృణీతే ప్రేయోమం
దో యోగక్షేమాద్వృణీతే॥

బుద్ధిమంతుఁడు జననమరణ ప్రవాహ ప్రయచ్ఛ
కమగు, కర్మలనుండి నివృత్తుఁడై, మోక్షమార్గము (శ్రే
యస్సు) నే కోరును. మందుఁడు ప్రేయస్సు కర్మమార్గము
యొక్క యోగక్షేమములనే గోరును. [యోగ మనఁగా,
లేనిదానిని సంపాదించుట. క్షేమమనఁగా, సంపాదించిన
దానిని వృద్ధిఁజేయుట)

శ్లో॥ వైరాగ్యతైలసంపూర్ణే - భక్తివర్తిసమన్వితే
ప్రబోధపూర్ణపాత్రేతు - జ్ఞప్తిదీపంవిలోకయేత్॥

వైరాగ్యతైలపూరితమగు ప్రబోధయను ప్రమి
దయందు. భక్తియనువర్తిఁజేర్చి జ్ఞానమను జ్యోతిని వెలిఁ
గించి పరమాత్మను జూడవలెను. వైరాగ్య బోధోపరతు
లుత్తరోత్తర పథానుక్రమ సహాయ సంపాదకములైయుం
డును.

శ్రు॥ వైరాగ్యస్యఫలంబోధో - బోధస్యోపరతిఃఫలమ్॥

వైరాగ్యముయొక్క ఫలము జ్ఞానము - జ్ఞానవి
హీనమైనచో వైరాగ్యము లేదనియే గ్రహింపవలెను.
అట్లే బోధయొక్క ఫల, ముపరతియు దానియొక్క ఫలము
స్వాత్మానందమును, శాంతియునైయున్నవి. కదళీవృక్షము
గెలవేసినతోడనే స్వనాశనముఁ గలిఁగినట్లు వైరాగ్యాదు
లు, బ్రహ్మానందఫలముఁగలిఁగినతోడనేనశించును కావున

శ్రు॥ సర్వవ్యాపారముత్సృజ్య - అహంబ్రహ్మేతిభావయు
అహంబ్రహ్మేతినిశ్చిత్య - అహంభావంపరిత్యజ॥

వ్యాపారవర్జితుఁడవై, నేను బ్రహ్మమునని భావించుము. నిశ్చయానంతర మంహంభావమును విడువుము ముముక్షు,విశ్లేకాగ్ర చిత్తుఁడై, దేహావసాన సమయమును గూర్చి నిరీక్షించుచుండును.

శ్రు॥ మృత్యుంచనాభినందేత - జీవితంవా కథంచన
కాలమేవప్రతీక్షేత - నిర్దేశంభృతకోయథా॥

ముముక్షువు జననమరణాది వృత్తులను గూర్చి యభిలషించకఁ, గూలివాఁడు నిర్దిష్ట సమయము ముగియుకొఱకు నిరీక్షించినట్లు ప్రారబ్ధక్షయకాలము కొఱకెదురు చూచుచుండు నిట్లు శ్రుతిస్మృతి యుక్త్యనుభవ పూర్వకమగు, గాఢవైరాగ్యవంతుఁడగు పరీక్షిద్భూపాలకుండు. ప్రాయోపవిష్టుండై [మరణాసన్ననిశ్చయుండై] కూర్చుని బాదరాయణి యగు శుకునడిఁగెనని రహస్యార్థము. బాదరాయణిః, బదరికాశ్రమ స్థాతయగు వ్యాసుఁడు, అతని పుత్రుఁడు శుకుఁడు

శ్లో॥ విశ్రుత స్తుసదాపుణ్యో - ఖ్యాతోబదరికాశ్రమః
నరనారాయణౌయత్ర - తేపాతేతే మునీతపః॥

నరనారాయణులను ఋషు లేయాశ్రమమునఁ దపంబొనరించిరో, యది పవిత్రమగు బదరికయను వనవాటికయని ప్రశంసింపఁబడినది. తదాశ్రమవాసి వ్యాసుఁడు.

ఆతని పుత్రుఁడగు శుకుండిట్లనియె. శుకుండనఁగా? విహంగమార్గగామి.

శ్లో॥ శుకశ్చవామదేవశ్చ - ద్వేస్మృతీదేవనిర్మితే
శుకోవిహంగమః ప్రోక్తో - వామదేవః పిపీలికా॥

కైవల్యమునకు, శుక —వామదేవమార్గములను మార్గద్వయము కలదు. అందు శుక మార్గము, విహంగ—(సద్యోముక్తి)మార్గమనియు,వామదేవ, మార్గము, పిపీలికామార్గమనఁగాఁగ్రమముక్తియని, శుకమార్గమనఁగా?

శ్రు॥ అతద్వ్యావృత్తిరూపేణ - సాక్షాద్విధిముఖేనవా
మహావాక్యవిచారేణ —సాంఖ్యయోగసమాధినా
విదిత్వా స్వాత్మనోరూపం —అసంప్రజ్ఞాసమాధితః
శుకమార్గేణవిరజాః — ప్రయాంతి పరమంపదం॥

ప్రపంచాభివృత్తి [సంకల్పము] మరలించుట వల్లను బ్రహ్మాకారవృత్తితోఁజూచుటవల్లను,విధి, [బ్రహ్మ] ముఖాంబుజగళితమగు చతుర్విధ మహావాక్యముల బోధచే గాని, సాంఖ్యయోగసమాధి, తత్వములను విచారణ జేసి పురుషుఁడ సంగ చిద్రూపుఁడని తెలియుటచేగాని,అసంప్రజ్ఞాత (ధీవిలయ) సమాధిచేగాని, స్వస్వరూపమును దెలిసికొని రాగ విరహితులై శుకమార్గముచే,నాజన్మము నందే ముక్తి నొందుచున్నారు. కావున నట్టి విహంగమార్గ ప్రదర్శకుఁడగు శుకుండిట్లు చెప్పెనని రహస్యార్థము —

సీ॥ రాజేంద్ర వినుసుధా ♦ రాశిలోనొకపర్వ
తము త్రికూటంబనఁ ♦ దనరుచుండు
యోజనాయుతమగు ♦ నున్నతత్వంబును
నంతియ వెడలుపు ♦ నతిశయిల్లు
కాంచనాయసార ♦ కలధౌతమయవులై
మూడుశృంగంబులు ♦ మొనసియుండుఁ
దటశృంగబహురత్న ♦ ధాతుచిత్రితములై
దిశలు భూనభములుఁ ♦ దేజరిల్లు
భూరి, భూజ, లతాకుంజ ♦ పుంజములును
మ్రోసిపఱతెంచు సెలయేటి ♦ మొత్తములును
మఱిగి తిరిఁగెడు దివ్య వి ♦ మానములను
జెలుల క్రీడించు కిన్నర ♦ చయముఁగలిగి

తాత్ప॥ పయోరాశియందు పదియోజనము, లున్నతము
ను, నంతియనై శాల్యమును, గలిగి - సువర్ణ, రజి
త, అయో, [యినుము,] మయములగు మూడు
శిఖరములచే నొప్పి చఱియ [కొండపార్శ్వము] ల
యందును, శిఖరములయందును, నిండియుండు నవ
రత్న కాంతులచేఁ బ్రకాశింపఁజేయు దిగంతరాళము
లును, నానావిధవృక్షములు నచ్చటచ్చటఁ బ్రాకు
తీవల సమూహములచే, సహజ నిర్మితములగు పొద
రిండ్లును, ప్రతిధ్వనులిచ్చు చిన్నచిన్న సెలయేళ్ళు
ను, గాఢముగా సంచరించు, దేవ విమానములు

ను, కిన్నరులు [దేవతా విశేషములు] విహరించు చఱియలును, గలిగి త్రికూటంబనెడి యొకానొక పర్వతముఁగల్దదు.

రహ॥ సుధారాశి యనఁగా?

శ్లో॥ పరిత్యగ్వస్తునిని స్తరంగసహజా—నందావబోధాంబుధౌ

సంకల్పరహితమగు నిశ్చలసమాధియను, ప్రత్యగూపసహజానందాంబుధియనగా "నాన్యత్పశ్యతి, నాన్యచ్ఛృణోతి, నాన్యద్విజానాతి, సభూమా" యేస్థితియందితరముఁజూడఁడో, వినఁడో, యెఱుఁగఁడో, యాస్థితినిభూమాబ్రహ్మానందమని చెప్పఁబడును.

శ్లో॥ యంలబ్ధ్వాచాఽ పరంలాభం —మన్యతేనాధికంతతః
యస్మిన్స్థితో నదుఃఖేన — గురుణాऽపి విచాల్యతే
తంవిద్యాదుఃఖసంయోగ—వియోగంయోగసంజ్ఞితం

ఏబ్రహ్మానందసుఖమును బొంది యితర సుఖములను, దానికంటెనధికమని తలంచఁడో, యేస్థితియందుండి గాఢదుఃఖముగలిగినను, ఇంచుకైనఁ జలింపఁడో, యాసుఖమును, దుఃఖరహితమగు బ్రహ్మానందమని తెలియవలెను. అట్టిసహజ జ్ఞానానంద సుధారాశియగు పరబ్రహ్మమునందు యోజనాయుతమగునున్నతమును—పదివేల యోజములయెత్తు ననగా పాదోఽస్యవిశ్వాభూతాని — త్రిపస్యామృతందివి" అను మంత్రవాక్యముచొప్పున,. ననంమని భావము. అంతియ వెడలుపు — నోతప్రోతములు

(పడుగుపేక) గాఁగూర్పఁబడిన పరబ్రహ్మమునందు గుణ సామ్యమగు ప్రకృతి కాంచన రజోగుణంబును [హిరణ్మయము] అయస్సార — తమోగుణంబును, కలధౌత — సత్వగుణంబును, పృథగ్విధములుగా వ్యక్తమయి, తత్తత్ప్రతిబింబములగు (ఈశ్వర) బ్రహ్మ, విష్ణు, రుద్రులు, గలిఁగి త్రిగుణంబులను, శృంగములచే బ్రకాశించుచుఁ దట- చఱియలయందు, హిరణ్మయ (సూత్రాత్మ) సూర్య చంద్రాదికాంతులచే, భాసమానంబులగు మహత్తత్వ, యహంకార, మనస్తత్వ - అన్నమయాది కోశభూసభోంతరాళములును, సంసార (అశ్వత్థ) పాదపంబులును, ఆశాలతానిర్మిత (చవిక) పొదరిండ్లును "శుభాశుభాభ్యాంమార్గాభ్యాం వహంతీ వాసనాసరిత్" వాసనా ప్రవాహము, శుభాశుభమార్గములయందుఁ బ్రవహించు చుండును అను శ్రుతిచొప్పున, వాసనలను ప్రవాహములును, మఱిగి తిరిఁగెడు దివ్యవిమానము లనగా?

శ్రు॥ ఆత్మానంరథినంవిద్ధి - శరీరం రథమేవచ
బుద్ధింతుసారథింవిద్ధి - మనఃప్రగ్రహమేవచ
ఇంద్రియాణిహయాన్విద్ధి - విషయాస్తేషుగోచరాః
ఇంద్రియైర్మనసాయుక్తం - భోక్తారంవిద్ధిపూరుషమ్॥

శరీరమేరథమును, నింద్రియములే గుఱ్ఱములును మనస్సే ఖలీనము(కళ్లెము) బుద్ధియేసారథియును, మనస్సేంద్రియ యుక్తుఁడగు జీవుఁడే రథియగు పురుషు, డాతఁడే భో

_క్తయని యెఱుంగు మట్టి శరీరములను, రథంబులును, స్థూల సూక్ష్మ, కారణంబులగు, విమానములును, దత్తదుపాధు లయందుఁజరించుఁ విశ్వ, తైజస, ప్రాజ్ఞులను, కిన్నరులును గలిగిన త్రికూటంబను పర్వతంబుకలదు,

సృష్టి క్రమము.

శ్లో॥ ఇదమగ్రే సదేవాశీ — త్సౌమ్యపైంగలనిర్గుణం
సత్యజ్ఞానానందపూర్ణం — నిత్యముక్తమవిక్రియం
ఏకమేవాఽద్వితీయంత — త్పరబ్రహ్మసనాతనం
తస్మిన్త్రిగుణసామ్యాసా — మూలప్రకృతిసంజ్ఞికా
శుక్లలోహితకృష్ణైకా —శక్తిరాశీత్స్వయంప్రభా
మరుభూమౌజలంశుక్తౌ — రౌప్యంస్థాణౌచపూరుషః
స్ఫటికేపిచరేఖావా — భాసమానానిజభ్రమాత్
మూలప్రకృత్యామేవాసౌ — నిర్గుణఃప్రతిబింబితః
సోకామయత సృష్ట్యాదౌ — సృజామీతిసదాశివః
తమోరజస్సత్వగుణా — ప్రకృతిర్ద్వివిధాభవతి
సత్వశుద్ధ్యవిశుద్ధిభ్యాం—మాయాఽవిద్యాచతేమతే
మాయాబింబోవశీకృత్య—తాంస్యాత్సర్వజ్ఞఈశ్వరః
అవిద్యావశగస్త్వన్య — స్తద్వైచిత్ర్యాదనేకధా
సాకారణ శరీరం స్యా —త్ప్రాజ్ఞస్తత్రాభిమానవాన్

సౌమ్యుఁడవగు నోపైంగలుఁడా! సృష్టిక్రమము, వినుము. పరబ్రహ్మమనఁగా. సత్యము. —జ్ఞానము — ఆనం దము — సచ్చిదానందమెట్లు చక్కెర శ్వేత మృదు మధుర

ములు విభజించుటకు వీలులేనో, యేకపదార్థముగా నుం డునో, యట్లు సచ్చిదానందమేకరూపమయి, " ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" మని సజాతీయాది భేదరహితమైన పరి పూర్ణమగు పదార్థముకలదు. అట్టిబ్రహ్మమునందు. మరు భూమియందుజలమును — శుక్తి (మంచి ముత్యపుఁజిప్ప) యందు రజితమును, స్థాణువునందుఁబురుషుఁడును, స్ఫటిక మునందు రేఖలును గల్పితముగాఁదోచినట్లు వివర్తోపాదాన కారణము [రజ్జుసర్పభ్రాంతి] వలె, మూలప్రకృతి, యవి నాభావసంబంధ [ఆత్మలేనిచో తానభావ]ముగా, నావిర్భ వించె నట్టి ప్రకృతియందు బ్రహ్మము ప్రతిబింబితమయి సదాశివుండని పేర్కొనఁబడెను. ఆ ప్రకృతిగాఁ, మాయ యనియు — నవిద్యయనియు - సమష్టివ్యష్టి రూపముగాఁ బరిణమించిన తత్తదుపాధులయందు నుఅల సదాశివుఁడు ప్రతిబింబించి, యీశ్వర, జీవులని పిలువం బడుచుండెను. అవిద్యాప్రతిబింబితుఁడగు జీవుఁడు, కారణోపాధి(సుషుప్తి) యందుండి ప్రాజ్ఞుఁడని పిలువఁబడెను. సుషుప్తి యనఁగా, నానందమయకోశము. మాయాప్రతిబింబితుఁడీశ్వరుఁడని వ్య వహరింపఁబడుచున్నాడు.

పూర్వపక్షి— బ్రహ్మము, పరిపూర్ణము, నిస్సంగము, నిరీ హము, (ఇచ్ఛ లేనిది) అను విశేషణయుక్తమని చె ప్పిదానియందు ప్రకృతి పుట్టినదనినుడువుట వ్యాహ తము [విరోధము] కాదా?

సిద్ధాంతి— ప్రకృతియనునది యేదో యొక సత్యమగు పదార్థముకలదనియు, జగత్తు తత్కార్యమగుననియుఁ జెప్పియుండలేదు మఱియేమనగా?

శ్రు॥ స్వప్నమాయే యథాదృష్టే - గంధర్వనగరంయథా తథావిశ్వమిదంద్రుష్టం- వేదాంతేషువిచక్షణౌ

స్వప్నము - మాయ — గంధర్వ నగరము - (పైశాచపట్టణము) మున్నగు మాయా కార్యములు వలెఁ బ్రపంచ, మసదాత్మకమని శ్రుతియుక్తము.

పూర్వపక్షి — సుఖదుఃఖప్రయచ్ఛకమగు ప్రత్యక్ష ప్రపంచము శూన్యమెట్లగును?

సిద్ధాంతి — మీకుసత్యముగాఁ దోచునది జాగ్రత్ప్రపంచమా? స్వప్నప్రపంచమా? తదుభయమునా? యందెద్దియును సరికాదెంమువల్లననఁగా?

శ్రు॥ స్వప్నేజాగరితం నాస్తి - జాగరే స్వప్నతానహి ద్వయమేవ భవేన్మిధ్యా - గుణత్రయ వివర్జితః॥

జాగ్రత్స్వప్న ప్రపంచము లన్యోన్యస్థితుల యందితరేతరము, లసత్యములగుచున్నవి. యట్లే గుణాతీత సుషుప్తియం దుక్తద్వయమును తద్ద్వయమునందు సుషుప్తి (మనోలయస్థితి) యు, నభావము నొందుచున్నవి. కావున నితరావస్థలయం దస్తంగతమగు ప్రపంచము సత్యమనుట యనుపపన్నము ( అసందర్భము ) కాదా ?

పూర్వపక్షి —పూర్వాపరములయం దగుపడకున్నను (ఘట మువలె) వర్తమానమునం దగుపడు విషయ, మవి షయమని యెట్లు విషయీకరింతురు

విషయము - ఇంద్రియ గోచరపదార్థము.

విషయీకరించుట - ఉద్దేశించుట.

సిద్ధాంతి - వర్తమానమునందు విషయాకారముగాఁదోచిన నేదిఘటమువలె బ్రాగభావ ప్రధ్వంసా భావమో యనఁగాఁ బూర్వమునందును, నాశనాంతరము నందును-ఘటాకారము లేక మృత్తే శేషింపఁబడునో యట్లే - యాద్యంతములయందభావమగు - జగత్తు వర్తమానంబునందును - అభావమనియే నిశ్చయిం పవలెను. కావున నవిద్యాపరిభావ జనిత విషయేం ద్రియ సంయోగకాలమందు మాత్రము సదాకార మువలెఁ దోచుచున్నది. యదియే మాయాలక్షణము

పూర్వపక్షి — నేను బాలుఁడను - యౌవనవంతుఁడను — సుఖిని - యను అనుభవమునకు మిథ్యాత్వ మెట్లు సాధింతురు ?

సిద్ధాంతి — అవస్థావంతుఁడగు జీవచైతన్యమునకే సత్యత్వ ముగాని, యవస్థా విశేషములకుఁగాదు.

శ్లో॥ నబాల్యం యౌవనేలబ్ధం - యౌవనం స్థావిరేతథా నపితుః పునరాయాతి - నాయాత్యేవ గతందినం॥

యౌవనమునందు, బాల్యమును, స్థవిర (వృద్ధ త్వమునందు యౌవనభావమును, వర్తించుటలేదు. పం త్వము నొందిన పితరుఁడు మఱలివచ్చుటయు, గతించి దివసము పునరాగమనములేదు.

శ్లో॥ గతం యథాత్రిబాలత్వం - తారుణ్యంచగతం తథ
తథాగచ్ఛతి వార్థక్యం - స్మరధ్వం యమశాసనః

బాల్య యౌవన వార్థిక్యములు, కాలానుసరణ ముగా గతించు చున్నవి. కాన మరణమునకు సిద్ధముగ నుండవలెను.

కం॥ మతిదలఁపఁగ సంసారం
బతిచంచల మెండమావు - లట్టులు సంప
త్ప్రితతు లతిక్షణికంబులు
గతకాలము మేలువచ్చు - కాలముకంటెన్

అను మొదలగు శ్రుతి స్మృత్యనుభవముచే, ససదాత్మకమగు ప్రపంచము సత్యమనుట కేవలము హారము ( మూర్ఖ వాదము ) మీ అద్వైత సిద్ధాంతము నందు నూయు యనఁగా లేనిది. తత్కార్యమగు విశ్వమో ప్రత్యక్షము. అనఁగాఁ గారణ కార్యము లన్యోన్య విరుద్ధ ములై యున్నవి. యెట్లనగఁ ? బులుసు తీపి, పులుసులోని ముక్క చేదు.

శ్రు॥ ఆకాశాద్వాయుః వాయోరగ్నిః

చుండఁగాఁ దత్సంధులయందు నాత్మయే స్థితమగును. ప్రస్తమగుమనన [మనస్సు] యొక్క యాకారమే స్వరూప స్థితిఁ జెప్పఁబడుచున్నది. యింకను బంధమోక్షములే సత్య మనునెడఁ బెక్కు, లనర్థములు గలిగి. ప్రశ్న లనుత్తార్య ములై యుండును. గ్రంథవిస్తరభీతిచే నుదహరించుట లేదు

పూర్వపక్షి — మీరు బోధించిన తత్వ ముపలబ్ధమయి (బోధపడి) నను అనుభవమునందు నాకు విశ్వాసము లేదు.

సిద్ధాంతి - మీ యుక్తి సమంజసముగా లేదు. కడుపునిండినది గాని — క్షుత్తుబాధించు చున్నదన్నటు, లేకార్థప్రయోగధాతువులలో నొకదానిచేఁ బఠిస మాప్తినిఁ జెప్పి వ్యతిరేకముఖముగు క్రియచే నాస మాప్తినిఁజెప్పుట ప్రథమ ధాత్వర్థమునకుఁగూడ లోపమగును. కావున బోధానుభవములు కలిసియే యుండును.

శ్రు॥ బ్రహ్మవిద్బ్రహ్మైవభవతి-బ్రహ్మ విదాప్నోతిపరమ్
అద్వైతే బోధితే తత్వే — వాసనా నప్రవర్తతే॥

బ్రహ్మము నెఱింగినవాఁడు, బ్రహ్మమే యగుచున్నాడు. పరమును బొందుచున్నాడు. అద్వైతరూప తత్వముఁ దెలియఁ బడుచుండగా - వాసనారూప యజ్ఞానము నశించు చున్నది. యిట్లు శ్రుతి స్మృతుల వలన - బ్రహ్మమును తెలియుటయే తత్స్వరూపానుభవము కావున

శ్లో॥ బోధే ప్యనుభవోయస్య - నకంచన జాయతే
తంకథంబోధయేచ్ఛాస్త్రిం-లోష్ఠంనరసమాకృతిం॥

ప్రత్యక్షముగాఁ బదార్థమును జూచుచున్నను, స్ఫురించుటలేదనునట్లు, స్థూల, సూక్ష్మాది సకల విషయములకు సాక్షియై తాను వేఱుగానున్నట్లు (అవగతమైనను (బోధపడినను) ఎవఁడనుభవము లేదని వాదించునో, యట్టి మృణ్మయాకారనరునకు శాస్త్రమెట్లు బోధించును ? బోధింపఁజాలదని యర్థము.

పూర్వపక్షి - మీ యుపదేశము, అనుభవావరోధమయి యున్నది. స్వప్రకాశమునందు [ అవిద్య ] చీకటి పుట్టుట తత్కార్యములగు విక్షేపావరణములును తేజస్తిమిరములవలె వ్యాహతముఁగావా ?

సిద్ధాంతి - కావు. అవిద్యా శబ్దార్థము శబ్దమునందే, యసత్యమని స్పష్టమగును. అసత్యము, కల్పితమం దనుభవము లేదనుట, వృశ్చిక సందష్టుఁడును, జోరుఁడును, నిషిద్ధక్రియ లొనర్చువారును, బహిరమున బాధలేనట్లు నటించి, కపటాడంబర విలాసయుక్తవక్త్రిలైనను, అంతరమున నెట్లు బాధాతిరిక్తులై, కంపితులై, యుందురో, యటువలెఁ గుతర్కాదుల నన్నిటిని ననుభవము గ్రసించునుగదా !

శ్లో॥ స్వప్రకాశేకుతోఽవిద్యా - తాంవినాకథమావృతిః
ఇత్యాది తర్కజాలాని - స్వానుభూతిర్గ్రిసత్యసౌ॥

స్వప్రకాశమునం దవిద్య యెట్లుజనించును అవిద్య లేనిచో, నావరణ మెట్లుకలుగును ? ఇత్యాది కుతర్కోక్తులను, స్వానుభవము, కబళించునుగదా ? ( కుతర్కమనగా యదార్థము నెఱింగియుండి, తెలియనట్లు నటించి, యుపన్యాసకుని బతితునిఁ జేయుటకై వేయుప్రశ్న ] యిట్లు పూర్వపక్ష సిద్ధాంతములచే, సిద్ధాంతీకరింపఁబడిన సుధారాశియను — బ్రహ్మమునందు గుణసామ్యమగు ప్రకృతియను త్రికూటాచలాహ్వయాచలము సంసారమను అశ్వద్ధవృక్ష సహితమయి, వివర్తోపాదాన కారణముగాఁ గలిగెనని రహస్యార్థము, ( వస్తువు మారక – మఱియొక విధముగాఁ గనుబడుట వివర్తము – రజ్జు, సర్పము ) వచనము — అని మఱియును – మాతులుంగ, లవంగ, లుంగ – చూత – కేతకీ, భల్లాత, కామ్రాతక, సరళ, పనస, బదరీ, వకుళ, వంజుళ, వట, కుటజ, కుంద, కురవక, కురంటక, కోవిదార, ఖర్జూర, నారికేళ, సింధువార, చందన, పిచుమంద, మందార, జంబూ, జంబీర, మాధవీ, మధూక, తాల, తక్కోల. తమాల, హింతాల, రసాల, ప్రియాళు, బిల్వ; యామలక, క్రముక, కదంబ, కరవీర: కదళీ, కపిత్థ. కాంచన, కందరాళ; శిరీష, శింశుప, అశోక, పలాశ, నాగ, పున్నాగ, చంపక, శతపత్రి, మరువక, మల్లికామతల్లికా ప్రముఖ నిరంతర వసంత సమయ సౌభాగ్యసంపదంకురిత, పల్లవిత, కోరకిత, కుసుమిత,

ఫలిత, లలిత, విటప, విటపి, వీరున్నివహాలంకృతంబున్ను, మణివాలుకానేక విమలపులిన తరంగిణీ సంగత విచిత్ర, విద్రుమలతా మహోద్యాన శుకపిక నికరనిశిత సమంచిత చంచూపుట నిర్దళితశాఖశాఖాంతర పరిపక్వ ఫలరంధ్ర ప్రవర్ధిత రసప్రవాహ బహుళంబును — గనకమయ సలిలకాసార కాంచనకుముద కల్హారకమల పరిమళ మిళిత కబళాహార సంతతాంగీకార భారపరిశ్రాంతకాంతా సమాలింగిత కుమార మత్తమధుకర విటసముదయ సమీపసంచార సముదంచిత, శకుంత, కలహంస, కారండవ, జలకుక్కుట, చక్రవాక, బక, బలాక, కోయష్టిక, ముఖర, జలవిహంగ విసర వివిధ కోలాహల బధిరీభూత భూనభోంతరాళంబును, దుహినకర, కాంత, మరకత, కమలరాగవజ్ర, వైడూర్య నీలగోమేధిక, పుష్యరాగ, మనోహర, కనక, కలధౌత మణిమయానేక శిఖరతటదరీ విహారమాణ విద్యాధర, విబుధ, సిద్ధ, చారణ, గరుడ, గంధర్వ, కిన్నర, కింపురుష, మిథున సంతత సరససల్లాప సంగీత ప్రసంగ మంగళాయతనంబును — గంధ గజ, గవయ, గండభేరుండ, ఖడ్గ, కంఠీరవ, శరభ, శార్దూల, శశ, చమర, శల్య, భల్ల, సారంగ, సాలావృక, వరాహ, మహిష, మర్కట, మహోరగ, మార్జాలాదినిఖిల మృగనాథసమూహ సమర సన్నాహ సంరంభ సంచకిత శరణాగత శమన కింకరంబునైయొప్పు నప్పర్వత సమీపంబునందు.

## బాహ్యార్థము.

మాతులుంగ - మాదీఫల
లవంగ - దేవకుసుమ
లుంగ - పుల్లమాదీఫల
చూత - తియ్య మామిడి
కేతకి - మొగలి
భల్లాతకి - నల్లజీడి
అమ్రాత - అంబాళ
నరళ - దుర్గంధ
బదరీ - రేగు
మందార - జిల్లేడు
జంబీర - నిమ్మ
మాధవి - పువ్వుల గురివెంద
మధూక - ఇప్ప
తాల - తాళ ( తాటి )
తక్కోల - తక్కోలము
తమాల - చీకటిచెట్టు
హింతాల - గిరకతాడి
రసాల - తియ్యమామిడి
సాల - వేగి
శ్రీతాళు - మొరట
క్రముక - ఎఱ్ఱలొద్దుగ

వకుళ - పగడ
వంజుళ - అశోకము
కుటజ - కొడిశ
కుంద - మొల్ల
కురవక - ఎఱ్ఱగోరింట
కురంట - పచ్చగోరంట
కోవిదార - ఎఱ్ఱకాంచన
సింధువార - వావిలి
పిచుమంద - వేప
కదంబ - కడప [ నీప ]
కరవీర - గన్నేరు
కాంచన - నంపంగి
కందరాళ - కలజువ్వి
శిరీష - దిరిశెన
శింశుప - ఇరుగుడు
పలాశ - మోదుగు
నాగ - కేసరి
పున్నాగ - పొన్న
చంపక - నంపంగి
శతపత్ర - తామర
మరువక - మరువము
మల్లికా - మల్లితీగ
వీరున్ని వహము - దట్టముగాఁ దీగలచే నల్లిన పొదలు

( శేషించిన భాగమునకు బాహ్యార్థము సులభము )

రహ॥— వసంతసమయ - సౌభాగ్యసంపద, అనగా - స్థూలసృష్టి (పంచీ
కరణ సమయమునందు] - సంసారారణ్యములో, రాగాదిపల్లవము
లును, విషయ పుష్పంబులును, మొదలుగాగల పాదపంబులచే
శోభాయుక్తమయి, మోహమును గలిగించుచున్నదని.యర్థము.

శ్లో॥ బీజంసంసృతి భూమిజస్యతుతమోదేహాత్మధీరంకురో,
రాగఃపల్లవమంబు కర్మతువపుస్కం ధోఽసవశ్శాఖికాః
అగ్రాణీంద్రియ సంహతిశ్చవిషయాః పుష్పాణిదుఃఖంఫలం
నానాకర్మ సముద్భవం బహువిధంభోక్తాత్రజీవఃఖఃగః

( అడవిని సంసారముగాఁబోల్చి చెప్పుచున్నారు )

సంసృతి పాదపమునకు నజ్ఞానమే బీజమును — దేహమే యాత్మయను నిశ్చయమే యంకురమను - (విరోచనమతము) రాగమను లేజిగురును కర్మమనుదోహాజ (జల) మును - స్థూలోపాధి యేస్కంధము. అనగా బ్రేళ్లకును, శాఖలకును, మధ్యభాగము - ఇంద్రియములను చివరకొమ్మలును - శబ్దాది విషయములను పుష్పములును అనేక జన్మకృతకర్మ వాసనాజనిత ప్రారబ్ధానుభవ దుఃఖ ఫలంబును — తత్ఫల భోక్తయగు జీవ విహంగము గలిగి యున్నది — యట్టివృక్షంబులును — మణివాలు కానేక విమలపులిన — రాబోవు దుఃఖంబులును మఱుఁగుఁబ ఱచి సద్యోఫలంబులు గలిగించు నాభాసనుఖంబులను - తత్సౌఖ్యములను, దుఃఖంబులుగా గ్రహించి -భక్తిధ్యాన ప్రవాహ తీరస్థజ్ఞాన ఫలరంధ్ర స్రావకమగు - ఆనంద

? సాస్వాదక, శుక, పికాది, ద్విజసంయుతంబులగు వనంబులును -

శ్లో॥ సంభుధ్యానవసంతసంగినిహృదారామేఽఘజీర్ణచ్ఛదాః
ప్రస్తాభక్తిలతాచ్ఛటావిలసితాపుణ్యాఃప్రవాళశ్రితాః
దీప్యంతేగుణకోరకాజపవచః పుష్పాశ్చసద్వాసనాః
జ్ఞానానందసుధా మరందలహరీ సంవిత్ఫలాభ్యున్నతిః

తా॥— ఈశ్వర ధ్యానమను వసంతా గమమునందు. నా యొక్క హృదయ గతములగు పాపములను పండుటాకులు రాలినవి. భక్తిలతయను గుబురులనుండి, లతలు పుట్టి. ప్రాకినవి పుణ్యములను జివురులంటుకొని యున్నవి సద్గుణములగు మొగ్గలు దీపించు చున్నవి. మంత్రి వాక్యలను. సద్వాసనలతోఁ బుష్పములు వికసించినవి. యాత్మానాత్మ విచారణ జనిత సంతోషామృతపుష్పరస స్రవ యుక్త బ్రహ్మజ్ఞానమను ఫలము ఫలించినది, - కనకమయ సలిలకాసార కాంచన విటప సముదయంబును - కనకమయ మనగా - హిరణ్మయమండలము - తద్గతహృత్పద్మనివాసితమగు తృష్ణసంబంధీయ మధుపములును -

శ్లో॥ క్షణమాయాతి పాతాళం - క్షణంయాతి నభస్థలం
క్షణం భ్రమతిదిఃకుంజె - తృష్ణాహృత్పద్మషట్పదీ

హృదయ పద్మమునందు వసించు తృష్ణాభ్రమర మూర్ధ్వాధోదిగంతములయందు సంచరించును [ అసంతు

ష్టిచే వ్యభిచరించును ] సమీప సంచార — నభోంతరాళంబును, కలహంస యవగా — క్షీరనీర విభాగక పక్షిరాజు — పరమ హంస.

శ్లో॥ క్షీరంబ్రహ్మజగచ్చనీరముభయంతద్యోగమభ్యాగతం
దుర్భేదంత్వి తరేతరం చిరతరం సమ్యగ్విభక్తీకృతమ్
యేనాశేష విశేషదోషలహారీం ఆశేదుషీం శేముషీం
సోఽయంశీలవతాంపునాత్విపరమోహంసోద్విజాత్యగ్రణీః

సచ్చిదానంద రూపాత్మక బ్రహ్మమను క్షీరంబును — మాయాకల్పిత నామరూపాత్మక జగన్నీరంబును — సమ్మేళనమయి, ధీరూపంబున బరిణమించి, యనాదిగానున్న యట్టి దుర్భేద్యమగునట్టియు, సకల దోష జలరూప ప్రవాహినియు నగు నింద్యమైనబుద్ధిని, సత్వశీలుండును, ద్విజశ్రేష్ఠుండును, బరమ హంసయు నగు శంకరుండు, జగద్బ్రహ్మములను విభజించి యున్నాడు. అట్టిహంసలును—

శరభ, శార్దూల, చమరీమృగములన — నప్పర్వత సమీపంబునందుఁగల కామాదులనెడి క్రూరమృగంబులు —

శ్లో॥ క్రోధవ్యాఘ్రమృగః ప్రలోభశరభస్సమ్మోహపంచాననః
కామాచ్ఛేమదజంబుకః పరితుదన్ మాత్సర్యకోకస్తథా
ఏతైర్లింగ శరీరకానన మృగై శ్చేతో మృగాపీడ్యతే
మచ్చేతోహారిణ త్వమాశు శరణం శ్రీమత్పుళిందంవ్రజ ॥

లింగ శరీరారణ్య మందుండు, క్రోధమను పెద్దపులియును — లోభమను శరభమును [ సింహ సంహారక

మగు మృగము ] మోహమను పంచాననము [ సివంగి ] కామ మను భల్లూకము ( ఎలుఁగు గొడ్డు ) మదమను జంబుకము [ నక్క ] మత్సరమను కోక — తోడేలు లేక [ అడవి కుక్క ] లుఁ గలసి చిత్తమను హ రి ణ ము ను భాధించు చున్నవి. కావున నో రామచంద్రా ! వ్యాధ కుఁడనై మచ్చేతో హరిణమును గాపాడుము. అట్టి భయ ప్రదమగు సంసారారణ్యము.

కం॥ భిల్లీ భల్లు లు లాయక
భల్లూక ఫణిఖడ్గగవయి - వలిముఖ చమరీ
ఝల్లీహరి శరభక కిటి
మల్లాద్భుత కాకఘూక — మయమగు నడవిన్

బాహ్య- బోయ, భల్లుక, మర్కటాదులచే నిండినయడవి

రహ॥ — భిల్లీ — నిర్దయత్వము - లులాయక - బద్ధకము - భల్లూక....
అజ్ఞానము — ( జ్ఞానానంద విరోధి ) ఫణి — శౌర్యము – వలీము
ఖము .... తృష్ణ -

శ్రు॥ చిరంతిష్ఠతి నైకత్ర - తృష్ణాచపల మర్కటీ ॥

తృష్ణయను చపల స్వభావ మర్కటమునకు నిలుకడలేదు. ఝల్లీ — ఊలపురువు —— అనగాఁ గామ కుని తీవ్ర సంకల్పము — ఘూక —— గ్రుడ్లగూబ — పగ లు దృష్టిలేక నిశయందు సంచరించునది. యనగా నాత్మ దృష్టి లేక —— ప్రపంచ దృష్టిఁగలిగియుండుట

శ్రు॥ ఉలూకస్యయథాభాను - రంధకారః ప్రతీయతే
స్వప్రకాశే పరానందే- తమోమూఢ స్యజాయతే॥

గ్రుడ్లగూబ లెట్లు పగటియం దంధత్వమునొందునో, యట్లేమూఢునకు స్వప్రకాశదృష్టియం దంధుఁడగును, అట్టి సూక్ష్మశరీరారణ్యమందు —

శా॥ అన్యాలోకన భీకరంబులుజితా- శానేకపానీకముల్
వన్యేభంబులుగొన్ని మత్తతనులై-వ్రజ్యావిహారాగతో
దన్యత్వంబున భూరి భూధరదరీ - ద్వారంబులందుండి సా
జన్యక్రీడల నీరుగాలి వడికా - సారావ గాహార్థమై,

బాహ్య॥ - చూడ్కులకు భయంకరములును - జిత +
ఆశా + అనేకప + [ అనీకముల్ ] దిగ్దంతావళులనుమీఁజియుండు కొన్ని యడవి యేనుఁగుగుంపులు, మదించిన శరీరములుగలవై ప్రయాణవిహారముచేఁ గలిగిన బడలికచే, నుదన్యత్వంబు — నీరుఁద్రాఁగుట కిచ్ఛచేఁ బర్వత గుహాలనుండి వెడలెనని తాత్పర్యము.

రహ॥ - అన్యాలోకన భీకరంబులు సమాధియం దాత్మాకారవృత్తులు వినా యితరముఁ దోచనందున దానిని - అస్పర్శయోగమని యోగులు భయముఁజెందిరి.

శ్లో॥ అస్పర్శయోగో వైనామ - దుర్దర్శస్సర్వయోగిభిః
యోగినోబిభ్యతిహ్యస్మా దభయే భయదర్శినః

అభయమగు సమాధియందు యోగులు (ద్వైతులు) భయమును గల్పించుకొని దుర్నిరీక్షణమని చెప్పు

చున్నారు. అనగాఁ దటస్థలక్షణుఁడగు — కూటస్థ— సదాశివ, ఈశ్వర, హిరణ్మయ, బ్రహ్మ, విష్ణు, రుద్రి, ప్రాజ్ఞ. పారమార్థిక జీవాదులకు స్థానములగు, సహస్రార ఆజ్ఞ, (అవ్యక్త) బ్రిహ్మబిల, మూలాధారాది గుహలనుండి పరాగ్దృష్టులకు భయంకరములై దిగ్దేవతలగు నిందాద్రిదులను జయించు నవియై, కూటస్థాది చైతన్యరూప గజములు జన్మ, కర్మాది, సుఖాభాసములగు విలాసేచ్ఛలచే -క్షుత్పిపాసాది, షడూర్మల స్థానమగు మనోరూప కాసారమును, గూర్చి వెడలెనని తాత్పర్యము. [ షడూర్మల నగా: నాకలి, దప్పులు — శోక మోహాములు - జరామరణములు -

ఆ॥ వె॥ అంధకార మెల్ల ♦ నద్రిగుహాంతర
వీధులందుఁ బగలు ♦ వెఱచి డాఁగి
యెడరు వేచి సంధ్య ♦ నినుఁడు వృద్ధత నున్న
వెడలె ననఁగ గుహలు ♦ వెడలెఁగరులు

బాహ్య॥ — అహస్సు ( పగటి ) యందు - తమస్సుస్వావరణవ్యర్థమని పర్వత గుహలయందొదిగి, సంధ్యారాగమునందు దివాకరుఁడు తేజోని స్తీర్ణుండై వెలవెలబోవు సమయము పఱకుఁ గాచుకొనియుండి చీకటులు గ్రమ్మినటుల గజములు వెడలెనని తాత్పర్యము —

రహ॥ — పగలనగా - శ్రు॥ విద్యాదివా ప్రకాశత్వా దవిద్యారాత్రిరుచ్యతే.

జ్ఞానము ప్రకాశరూపమగుటచేఁ బగలనియు - నప్రకాశ స్వభావమగుటచే నవిద్య- రాత్రి యనియుఁ జెప్పఁబడును. కావున జ్ఞానరూప పగటియందు, అవిద్యయడఁగె ననఁగా శరీరేంద్రియ గోళకముల యందడఁగి జీవుని వృత్తి బహిర్ముఖమైనయపుడు. నమయముఁ జూచి యావరించిన యట్లు. అజ్ఞానవృత్తులు బైలు వెడలెనని రహస్యార్థము

కం॥ తలఁగవు కొండలకైనను
మలఁగవు సింగములకైన - మార్కొను కడిమిం
గలగవు పిడుఁగుల కైనను
నిలబల సంపన్నవృత్తి - నేనుఁగు గున్నల్

బాహ్య॥— బల సంపన్నముతోఁగూడి, కోమలమగు నా యేనుఁగులు, కొండ లడ్డమైనను, తొలఁగి తప్పించుకొని యొసిలిపోవు—సింహములను గూడ నెదిరించు మాడ్కి మార్గములనుండి మరలవు—పిడుఁగులు పడినను జడియవని తాత్పర్యము —

రహ॥ — కొండలవంటి కష్టములు నంప్రాప్తించినను, ధైర్యమును విడువక కామాదులను జయించుటకు సింగములవంటి వట్టుదలఁగలవియై — పిడుగుఁవంటి యాపదలను భరించు - అవిద్యావృతపారమార్థిక జీవులని తాత్పర్యము —

శు్రు॥ సుషుప్తి వజ్జాగ్రితియోన పశ్యతి
ద్వయంతు పశ్యన్నపిచాఽ ద్వయత్వతః
తథాచకుర్వ న్నపియశ్చ అక్రియః
స ఆత్మవిన్నాన్య ఇతీహ నిశ్చయః

అక్ష్వయ స్వరూపుఁడగుటచే, జాగ్రితయందు ద్వైతమును జూచుచున్నను సుషుప్తియందువలె ద్వైతమును భావించఁడో, యటువలెనే, కర్మ జేయుచున్నను అక్రియుఁడో, (కర్మనాచరించని వాఁడో) వానినే యాత్మజ్ఞానియని నిశ్చయించవలెను. గానియితరుఁడుగాదు వాఁడే పారమార్థిక జీవుఁడని భావము.

సీ॥ పులులు మొత్తంబులు ♦ పొదరిండ్లలోదూఱు
  ఘోర భల్లూకము ♦ ల్గుహలు సొచ్చు
భూదారములు నేల ♦ బొఱియలలో డాఁగు
  హరిదంతములకేఁగు ♦ హరణ చయము
మదుపులఁ జొఱఁబాఱు ♦ మహిష సంఘంబులు
  గండ శైలంబులఁ ♦ గపులు ప్రాకు
వల్మీకములు సొచ్చు ♦ వనభుజంగంబులు
  నీల కంఠంబులు ♦ నింగి కెగయు
వెఱచి చమరీ మృగంబులు ♦ విసరువాల
  చామరంబుల విహరణ ♦ శ్రమమువాయ
భయద పరిహేల విహరించు ♦ భద్రకరుల
  గాలివాఱిన మాత్రాన ♦ జాలిఁబొంది.

టీకా॥— స్వభావాలంకారము —

భయంకరములుగా విహరించు, నేనుఁగుల వాఁడ పొడమి నంతమాత్రాన జాలిఁబొందినవై, పులులు పొదరిండ్లలోను — భల్లూకములు గుహల లోను —

భూదారములు [ అడవి పందులు ] సారంగములయందును
హరిణములు [ లేళ్లు ] దిగంతముల యందును — నెను
పోతులు మడువు [జలాశయము] లందును — మర్కట
ములు పర్వతాగ్రములయందును — బాములు పుట్టలందును
నెమళ్లు అంతరిక్షముల పైపును — పరుగు లిడుచుండెను —
మఱియు సవరపు మృగములు తమవాలములను, వింజా
మరలచే వీచుచుండెను —

రహ॥ — కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర, యీర్ష్య, అసూయాదులు వాటి వాటి యధిదేవతల యందడఁగియుండెనని తాత్పర్యము,

కం॥ మదగజదానామోదము
గదలని తమకములఁ ద్రావి - కడుపులునిండం
బొదలుచుఁ దుమ్మెదకొదమల
కదుపులు ఝుంఝుమ్మటంచు గానము సేసెన్

భావ॥ - ఏనుఁగులయొక్క మదము ( గండస్థలములందు స్రవించు మద్యము) ను - కడుపులనిండఁ బానముజేసి మధుపములు ఝుంకారముఁ జేసినవని తాత్పర్యము.

రహ॥ — ఆజ్ఞాచక్రమునందు నాదానుసంధానానందంబునఁ పారర్థిక జీవమధుపము లానందించుచున్నవి.

శ్లో॥ ఆజ్ఞాచక్రే భ్రుకుటిస్థానే ద్విదళాంతే
హంక్షం బీజం జ్ఞానమయంతం శివశక్తిం

నాదబ్రహ్మానంద మనంతం గురుమూర్తిం
దత్తాత్రేయం శ్రీపదపద్మం ప్రణతోస్మి

తా॥ (హంసఃంఅను బీజములుగల యాజ్ఞయందు నాద
ము ప్రారంభ మగును )

కం॥ తేఁటిరొకటి యొరుప్రియకును
మాటికి మాటికిని నాగ — మదజలగంధం
బేటికని తన్నుఁ బొందెడి
బోటికి నందిచ్చు నిండు — బోటిఁదనమునన్

బాహ్య॥ -ఒక తుమ్మెద వేఱొక ప్రియురాలికి యీమద
జల గంధలేశము నీకేలనని జాణతనమునఁ దన్నుఁ
బొందెడి బోటికిఁ దానుగ్రహించినది యిచ్చెనని
తాత్పర్యము —

రహ॥ — మనస్సు సమాధి యందుండు ఆనందమును పుఱఁగి జగదా
కార వృత్తులను వదలి సంప్రజ్ఞాత సమాధియందలి యానంద
ముఁ బొందెనని తాత్పర్యము —

కం॥ అంగీకృతరంగన్మా
తంగీమదగంధమగుచుఁ - దద్దయు వేడ్కన్
సంగీత విశేషంబుల
భృంగీగణమొప్పె మ్రోసి - పెట్టెడి మాడ్కిన్

బాహ్య॥ - సంచలించు చున్న తుమ్మెదల గుంపు మాతం
గుల ( గజముల ) యొక్క మదగంధమును శరీర
ములయందలముకొని, నిశ్చేష్టత్వమును - గలుగఁ

జేయునట్టి, గానవిశేషములచేనొప్పెనని తాత్ప
ర్యము.

రహ॥ — హృత్పద్మములయందుండు సంకల్పములను, తుమ్మెదల గుంపులు “ తృష్ణా హృత్పద్మషట్పదీ ” ( తృష్ణ – హృత్పద్మములయందలి తుమ్మెద ) మాతంగీ యనగాఁ బరాప్రకృతి సంబంధమైన నిర్వికల్పానందముచే, నిశ్చేష్టముగాఁ బ్రణవధ్యానముఁ జేసెనని తాత్పర్యము.

కం॥ వల్లభలు పాటిసును పడ
వల్లభమని మునిరి రేని — వారణదానం
బొల్లక మధుకర వల్లభు
లుల్లంబులఁ బొందిరెల్ల — యుల్లాసంబుల్

బాహ్య॥ - పరుగులిడి వచ్చు ప్రియురాండ్రను — మధుపములు ప్రేమచేఁ జుట్టుకొని గజగంధమును గైకొనక బలు విధములగు ఆనందములను పొందినవి.

రహ॥ — జీవు, లవిద్యోపాధులతోఁగలసి పృథక్కుగానుండు గజగంధమును ( విషయానందమును ) గైకొనక సహజానందమును తాదాత్మ్యనందమును బొందిరని తాత్పర్యము,

మ॥ కలభంబుల్ సెరలాడుఁ బల్వలములా —
ఘ్రాణించి మట్టాడుచున్
ఫలభూజంబులు రాయుచుం జివురుఁజొం —
పంబుల్ వడిన్ మేయుచున్
బులులం గాఱెనుపోతులన్ మృగములం —
బోనీక శిక్షించుచున్

కొలఁకుల్ సొచ్చి కలంచుచున్ గిరులపై -
గొబ్బిళ్లు గోరాడుచున్

తాత్పర్యా॥ - ఏనుఁగు గున్నలు, విహరించుచుఁజిన్న చిన్న గుంటలయందుండు నీటిని గ్రహించుచు ఫలవృక్షములను రాపాడుచు లేఁజిగురులను మేయుచు వ్యాఘ్రాది మృగములను శిక్షించుచుఁ గొలఁకుల నీరములఁగలంచుచుఁ బర్వతములయందువినోదముగాఁ గ్రీడించు చుండెననితా - గొబ్బిళ్లు - క్రీడా విశేషంబులు

రహ॥ — జీవులు, జీవన్ముక్తి విహారములచే, సానందించుచు, మధ్య మధ్య జలభ్రాంతిచే, నెండమావులను. జలములని, మోసపోవుచు వివేకముచే సంసార పాదపంబులను నిర్లక్షించుచు విషయాది జొంపముల (జివుళ్ల) ను భక్షించుచుఁ గామాది క్రూరజంతువుల నుద్రేక మడంచుచుండిరని తా॥

క॥ తొండంబుల మదజల వృత
గండంబులఁ గుంభములను - ఘట్టన సేయుం
గొండలు దల్లడిల్లి పడు
జెండుపడున్ దిశలు సూచి - బెగడున్ జగముల్

తాత్పర్యా॥ - తొండములచే గండస్థలంబుల ఘట్టన సేయు నపుడు తద్ధ్వనులకుఁ గొండలు బ్రిద్దలై పడుట దిశలు ప్రతిధ్వను లిచ్చుటలు వీక్షించి లోకములు భయముఁ జెందెనని తాత్పర్యము [అతిశయోక్తి)

రహ॥ — అజ్ఞాచక్రమను గండస్థలమునందు మదజల — మదించిన చలము — పట్టుదల యనగాఁ గర్తృకాద్యహంభావమును, (తొండము] ఉచ్ఛ్వాస (ప్రాణాయామము] చే ఘట్టన నిరోధముసేయుచుండునపుడు [ జగములు ] శరీరము గగురుపాటుఁ బొందెనని భావము· అహంభావముచే జీవుఁడింద్రియ వ్యాపారములకు నాజ్ఞనిచ్చుస్థాన మాజ్ఞాచక్రము —

కం॥ ఎక్కడఁ జూచిన లెక్కకు
నెక్కువరైయుడ విసడచు — నిభయూధములో
నొక్కకరినాథుఁడెడ తెగి
చిక్కెనొక కరేణుకోటి — సేవింపంగన్

భావ్యా॥ అడవిలో నెచ్చోటఁ జూచినను, మిక్కుటమై సంచరించు గజ సమూహములో నొక్క గజ నాథుఁడు ప్రియ బృందముతో మార్గముఁ దప్పి పోయెనని తాత్పర్యము —

రహ॥ సమష్టిమాయా ప్రతిబింబిత — ఈశ్వర — కూటస్థ హిరణ్మయాదులనుండి, వ్యష్టిరూప, అవిద్యా ప్రతిబింబిత — జీవస్వరూపమును బొంది యష్టవిధ (అపరా) ప్రకృతి సమూహముతో — సంసారారణ్యములో జిక్కెనని తాత్పర్యము.

సమష్టి — మూలప్రకృతియందుఁ బ్రతిబింబితుఁడు — సదాశివుఁడు

శ్రు॥ సదేవ ఇదమగ్ర ఆసీత్

మాయ — (గుణసామ్యావస్థయందుఁ బ్రతిబింబితుఁడు

ఈశ్వరుఁడు — మహత్తత్త్వమునందుఁ బ్రతిబింబితుడు — హిరణ్మయుఁడు.

వ్యష్టి

అవిద్యా ప్రతిబింబితుఁడు — జీవుఁడు.

| సమష్టి (అధిదైవము) | | వ్యష్టి (అధ్యాత్మము) |
| --- | --- | --- |
| 1 పృథివి | - | శారీరమయ్యః (శరీరమయుఁడు) |
| 2 ఆపః | - | రైతసః — రేతస్సంబంధి |
| 3 అగ్ని | - | వాఙ్మయపురుషః |
| 4 వాయుః | - | ప్రాణ మయపురుషుఁడు |
| 5 ఆదిత్యః | - | చాక్షుషః పురుషః |
| 6 దిశః | - | శ్రోత్రః [శ్రోత్రసంబంధుఁడు] |
| 7 చంద్రః | — | మానసః |
| 8 విద్యుత్ | — | తైజసః — తేజోమయుడు |
| 9 స్తనయిత్నుః (గర్జనము) | - | సౌవరః — స్వరమందైవవాఁడు |
| 10 అకాశః | — | హృద్యాకాశః [దహరము |
| 11 ధర్మః | — | ధార్మికః |
| 12 సత్యం | — | సాత్యః |
| 13 మానుషం | - | మనుష్యం |
| జాతి | — | వ్యక్తిః |
| 14 భూతములు | — | జీవులు |
| 15 సామాన్యము | - | విశేషము |

సమష్టినుంచి వ్యష్టిరూపమును బొందుటే — యాత్మవలన నెడబాటునొంది సంసారారణ్యములోఁ జిక్కుట లేక — తప్పిపోవుట యని తాత్పర్యము —

వ॥ ఇట్లు వెనుక, ముందట, నుభయపార్శ్వంబులఁ దృష్టార్దితంబులై యరుగుదెంచు నేనుంగు గము లంగానకఁ దెఱఁవుఁదప్పి తొలంగుఁడు పడి యీశ్వరాయత్తంబైన చిత్తంబు సంవిత్తంబుఁగాకుండుటం జేసి, దానును, దన కరేణు సముదయంబును నొక్క తెరువై పోవుచు.

భావ్య॥ — ఇప్పగిదిఁదప్పిఁగొని వచ్చునే నుంగు గుంపులను గానకఁదెరవుఁదప్పి యీశ్వర ప్రేరితమున విస్మృత చిత్తమై యుండుటఁజేసి యాశ్రిత కరేణు సముదయంబుతోఁ బోవుచు (ముందు కన్వయము)

రహ॥ — జీవుఁడు, స్వస్థానంఁబుదప్పిః యన్నమయాది కోశంబులతో, జ్ఞాన, విజ్ఞాన, ప్రజ్ఞానాద్యావరణోపాధులతోడఁ, బరిభ్రమణ శీలుండై —

సీ॥ పల్వలంబులు లేత ♦ పచ్చిక మచ్చికఁ
జెలుల కందిచ్చున ♦ చ్చికము లేక
చివురు జొంపములఁ గ్రొ ♦ వ్వెలయు పూఁగొమ్మలఁ
బ్రాణవల్లభలకు ♦ బాలువెట్టు
ఘనదాన శీతల ♦ కర్ణతాళంబుల

దయితల చెమటార్చుఁ ♦ దనువులరసి
మృదువుగాఁగొమ్ముల ♦ మెల్లనగళములు
నివురుచుఁ బ్రేమతో ♦ నెలవుఁ గఱవు
పిఱుఁదు చక్కట్ల దగ్గఱి ♦ ప్రేమతోడ
డాసిమూర్కొని దివికిఁ దొం ♦ డంబుసాఁచు
వెద వివేకించుఁ గ్రీడించు ♦ విశ్రమించు
మత్తమాతంగ మల్లంబు ♦ మహిమతోడ

బాహ్యా॥ - మాతంగమల్లము ( బలిష్ఠమైన యా గజము) నీటిపల్లముల యందలి, బాలతృణములను, దన ప్రియురాండ్ర కందిచ్చుచుఁ, జిగురు టాకులగుంపులతోఁ గూడిన పూగొమ్మలను దన ప్రాణవల్లభలకుఁ బంచిపెట్టుచుఁగగ్గ (తాళవృంతంబు ) విసన కఱ్ఱలచే దయితల చెమటలార్చుచు, దంతములచే, గళములను స్పృశించుచుఁ బిఱుఁదుల మూర్కొనుచు, ఋతు సమయము నిరీక్షించుచుఁ విశ్రమించు చుండెనని తాత్పర్యము,

రహ॥ - జీవుఁడు తన ప్రియురాలనఁగా, మనస్సునకు సంతోషము గలుగునట్లు, విషయంబుల నెఱవేర్చుచు వృత్తులను దంతములచే నవిద్యా నానందింపఁ జేయుచు, నవిద్యకు నానందంబుఁ గలుగఁ జేయుచుండెనని తాత్పర్యము.

సీ॥ తనకుంభముల పూర్ణ ♦ తకు డిగ్గియువతుల
కుచములు పయ్యెద ♦ కొంగు లీఁగఁ
దనయాన గంభీర ♦ తకుఁజాల కబ్బలల
యానంబులందెల ♦ వండగోనఁగఁ
దనకరశ్రీఁగని ♦ తలఁకి బాలల చిఱు
దొడలు మేఖల దీప్తిఁ ♦ దోడు పిలువఁ
దనదంతరుచి కోడి ♦ తరుణుల నగవులు
ముఖచంద్ర దీప్తుల ♦ ముసుఁగు దిగువఁ
తే॥ దనదు లావణ్య రూపంబుఁ ♦ దలఁచి చూడ
నంజనాభ్రము కపిలాది ♦ హరిది భేంద్ర
దయితలందఱుఁ దనవెంటఁ ♦ దగిలి నడువఁ
గుంభి విభుఁడొప్పె నొప్పుల ♦ కుప్పవోలె

బాహ్య॥ - స్వభావోక్తి — తన గండస్థలంబులకు — స్త్రీల వక్షోరుహములు - త్రపాయుతములై, సిగ్గు పడి పయ్యెదలోఁదాఁగొనియెను - తననడలకబల లనడకలోడి, నూపురము [ అందెల ] లు, నాశ్రయించినవి - తన తొండముయొక్క శోభకు బాలి కల చిఱుతొడల్లోడి కటిసూత్రయుతములై యుండెను తన దంతరుచికి సాటిరాక, యువతుల పరిహాస చంద్రికలు ( ముసుఁగుఁబడు ) నోష్ఠములచేఁ బరి వేష్టింప బడిన - యనగాఁ బెదవులచేఁ గప్పబడినవి - తన సౌందర్య శోభను వీక్షించుటకు నేతెంచిన,

దిగ్దంతావళులు, తన వెనువెంట నడచుచున్న కాంతలతో, నొప్పిదమై యుండెనని తాత్పర్యము.

రహా॥ - జీవుఁడు, పంచకోశయుక్తుఁడై, సప్త ధాతువులతోడను - బహిరంత రేంద్రియములతోడను — దశవిధ ప్రాణంబులతోడను - శబ్దాది విషయంబులతోడను - శరీరత్ర యాన్వితుఁడై, యవిద్యాకన్యకా పరిణయార్థమై, యలంకృతుఁడైన పెండ్లికుమారుని మాడ్కిఁ బ్రకటితుఁడయ్యెనని తాత్పర్యము,

వ॥ — మఱియు, నానా,గహన విహారణ మహిమతో, మదగజేంద్రంబు మార్గంబుఁదప్పి పిపాసా పరాయత్తంబున మత్తగజేంద్రంబుల, మొత్తంబునుందానునుంజని చని —

బాహ్య॥ — గజేంద్రుండు, గహన, విహారణ సామర్థ్యంబుతోఁబిపాసఁ [ నీరుఁ దాి్రవునిచ్ఛచే ] గరేణువులతోఁ జనుచుండి —

రహా॥ - జీవుఁడనేక జన్మంబులు వడియుటకు సమర్థుడై సంకల్పించి, నివృత్తినుండి తప్పి, ప్రవృత్తి మార్గంబునఁ బ్రవేసించెనని తాత్పర్యము.

శ్రు॥ సఐక్షత బహుశ్యాం ప్రజాయే యేతి, సతపోతప్యత ఆ పరమాత్మ యనేక విధములుగా జనించెదనని సంకల్పించెను.

మ॥ అటగాంచెం గరిణీ విభుండు నవపు * ల్లాంభోజక
ల్హారముఁ
నటదిందీవర వారముంగ మరమీా * న,
గ్రాహదుర్వారముఁ
వటహింతాల రసాల సాల సుమనో * వల్లీకుటీ
తీరముం
జటులోద్ధూత మరాళ చక్రబక సం * చారంబుఁగా
సారమున్

బాహ్య॥ గజేంద్రుఁడు, తెల్లదామర హారముఁగలిగి చం
చలించు మధుపములతోఁ గూడి, కూర్మ, నక్రము
లచే, భయంకరమై, చుట్టును మఱ్ఱి, గలకతాడి,
తియ్యమామిడి చెట్లతో నలంకృతంబై, మఱియుల
తాపొదరిండ్లయుక్తమై, యుడ్డీనగత యుతహంస
లును — చక్రవాక, బక, సంచార పూరితంబైన
కాసారంబుఁ గాంచెనని తాత్పర్యము.

రహ॥ అంతఃకరణ కరిణీ విభుండగు, ముఖ్యాహంకార
విషయుఁడగు, పారమార్థిక జీవుఁడు, నవపుల్లాం
భోజ, యనాద్య విద్యా వాసనలచేఁ బరిమళించు
హృత్పద్మములచే వికసితమైనట్టి, నటదిందీవరవార
మున్ పద్మముల యందలి తుమ్మెదలు "శ్రు॥
క్షణ మాయాతి పాతాళం - క్షణంయాతిన భస్థలం
క్షణంభ్రమతిదిఃకుంజే తృష్ణాహృత్పద్మషట్పదీ"

హృత్పద్మమునందలి తృష్ణయను తుమ్మెద: యొ
క్కొక్క క్షణమునకు పాతాళము — అంతరిక్షము
నకును — దిగంతములకును — దిరుగు చుండును
ఆట్టి సంకల్ప భావపరిగళిత తృష్ణయను యిందీవర
ములు [ తుమ్మెదలు ] గలిగినట్టియు, లోభ,
మోహ, గామాద్య నివారిత జలచరయుక్తమై,
సుమనో వల్లీకుటీ తీరముః — శుద్ధసాత్వికమను
లతా నిర్మిత కుటీర తీరమును — జటులోద్ధాతమ
రాళ చక్రిబక సంచారంబు — భయజనకమగు,
మోహామ రాళంబును — నసూయ, దర్పాది,
చక్రవాక, బక, విహంగ, తరంగ, విలోలితయు
నగు మనః కాసారమును జూచెనని రహస్యార్థము

వ॥ ఇట్లనన్య పురుష సంచారంబై, నిష్కళంకంబైన,
యప్పంక జాకరంబుఁ బొడఁగని

శాస్త్రి॥ పృథక్పురుష సంచారహీనంబై, కళంక రహితం
బైన యక్కమలాకరంబు వీక్షించి —

రహ॥ ఏకాంతంబై, నిస్సంకల్పమై, విశుద్ధంబై యున్న
యామానస సరోవరం బవలోకించి —

సీ॥ తోయజగంధంబు ♦ దోఁగిన చల్లని
మెల్లని గాడ్పుల ♦ మేనుల లరఁ
గమలనా ళాహార ♦ విమల వాక్కుల హంసఁ
రవములు సెపుల, పం ♦ డువులు సేయ

ఫుల్లదిందీవరాం ♦ భోరుహామోదంబు
ఘ్రాణ రంధ్రంబుల ♦ గారవింప
నిర్మల కల్లోల ♦ నిర్గతా సారంబు
వదన గహ్వరముల ♦. వాడుఁదేర్పఁ
తే॥ దిగ్జగ దభినవ సౌభాగ్య ♦ దీప్తమైన
విభవ మీక్షణములకును ♦ విందుసేయ
నరిగి పంచేంద్రియవ్యాప ♦ హారములను
మఱచి మత్తేభయూథంబు ♦ మడుఁగు సొచ్చె॥

భావ॥ — వీచికలచే నార్ద్రితమైన పుష్పాదినుండి వచ్చు మందమారుతముచే మేనులు సంతరింపఁ - గమల నాళాశనులై మంజులముగాఁబల్కు హంసల నిస్వానముచే వీనులు విందుఁగొన, సితపద్మములయందలి సువాసనలచే నాసికా వివరంబు లుచ్ఛ్వాసములచేఁ బూర్ణీభవించ, నిర్మల కల్లోల (మడుఁగ) జనిత జలముచే జిహ్వాలకుపశమనముఁ గలుగుచుండ జగంబులకు నూతన శోభచే వీక్షణా లంకృతంబై, యొప్పు నగ్గజవ్రజంబు పర వశమునసరస్సులోఁ బ్రవేసించె — నని తాత్పర్యము

రహ॥ — పూర్వకృత సద్వాసనలచే, స్థూల, సూక్ష్మ, కారణ శరీరత్రయ మలరారఁ - గుటీచక, బహూదకఁ హంస, పరమహంస, సన్యాసులలో శ్రేష్ఠులగు పరమ హంసలయొక్క బ్రహ్మ విచారణచే

శ్రవణా నందంబుఁగలుఁగ, శుద్ధ సాత్వికాదివృత్తుల [ శ్వాసలు ] చే నాసికా వివరంబులు పూర్ణీభ వింపఁ సత్సంకల్ప కల్లోల [ పరిణామ ] జలముచే జిహ్వాచాపల్యము . శాంతింప, నవస్థాత్రయముచే నొప్పు, ఇంద్రియ వ్యాపారముల నధిదేవతా యత్త ములు జేసి మనఃకాసారముఁ జొచ్చెనని తాత్పర్యము

కం॥ తొండంబులఁ * బూరించుచు
గండంబులఁ జల్లుకొనుచు * గళగళ రవముల్
మెండుకొన వలుద కడుపులు
నిండఁగ వేదండకోటి * నీటింద్రావెఁగ

బాహ్య॥ - వేదండంబులు తమ తమ తొండంబులచే నీటినిఁ బూరించి గండస్థలములయందుఁ జల్లుకొని ఘీంకరించుచుఁ గడుపుల నిండఁ దజ్జలంబులఁ బానముఁ జేసెనని తాత్పర్యము—

రహ॥ - జీవుఁ డవిద్యావశుఁడై యున్నను, గామముచే నా కర్షింపఁ బడకుండ నుండువఱకు, నాత్మాను సంధా నపరుఁడై, స్వరూప సాధనలయందుండు నెట్లనగా? " తొండంబులచేఁ బూరింపుచు " శ్రు॥ బ్రహ్మై వాహ మస్మీతి, యావృత్తిః పూరకో వాయు రుచ్యతే " నేను బ్రహ్మము నైతిననువృత్తి [ జ్ఞానము ] పూరకమని చెప్పఁబడును. అట్టివృ త్తిచే వాయువును, ఆజ్ఞయందు నిలుపుచు దశవిధ

నాదాను సంధానము ( గళగళ రవముల్ ) సేయు
చుఁ గడుపులు నిండన్ — వాయువును గుంభించి
" శ్రు॥ తద్వృత్తి నైశ్చల్యం కుంభకం ప్రాణసం
యమః॥ " నేను బ్రహ్మము నైతినను, వృత్తిచేఁ
బూరించి యా వృత్తియొక్క నిశ్చలత్వముచే గుం
భించి మనఃకాసారమం దాత్మాకార వృత్తులతో
నుండెనని తాత్పర్యము —

వ॥ అప్పుడు.

మ॥ ఇభలోకేంద్రుఁడు హస్తరంధ్రములనీ * రెక్కించి పూరించి చం
డభ మార్గంబున కెత్తినిక్కవడిను * ద్గాడించి పింజింపనా
రభటిన్ నీరములోనఁ బెల్లెగసిన * క్రిగ్రాహపాఠీనముల్
నభమందాడెడు మీన కర్కటముల * న్బట్టెన్ సురల్ మ్రాన్పడన్

బాహ్యా॥ ఆద్విరద యూధము తొండములచే నీరమును
బూరించి చండభ —, తీక్ష్ణమైన సూర్యకాంతి
గల, యంతరిక్ష మార్గమున నీటినిఁ బైకిఁ జిమ్మి
యా నీరమ్ములఁ గలంచుచు మరల మరలఁ జిమ్ము
చుండఁ దత్సరస్సునందలి మీనమర్కటాదులు,
వియద్గంగయందలి జల చరములను బట్టుచుండగా

దేవతులు నిశ్చేష్టితులైరని భావము(అతిశయోక్తి)

రహ॥ ఇట్లు జీవుఁడు, మనఃకాసారమందలి సంకల్పము లను కషాయ ( పరిపక్వ ) స్థితినిఁగలంచు చుండ నీశ్వరుని యందలి సూక్ష్మవృత్తులతో నైక్యమ య్యెనని తాత్పర్యము॥ కషాయము — అగ్నితప్త ఘన పదార్థము వివరణ — జలాకాశ మందలి జీవ వృత్తులు స్పష్టమగును. మేఘాకాశము —ఈశ్వరుని యందలి వృత్తులు, లక్కయందుఁ బొదువఁ బడిన సువర్ణ రేణువుల వలె సూక్ష్మముగా నుండును — సూర్యకిరణముల వలన జలము తపింపఁబడి యావి రియై మేఘరూపముగాఁ బరిణమించు నగా మేఘ మునం దనుమాన ప్రమాణముగా జలమున్నది. జలముండినచోఁ బ్రతిబింబ మున్నది. యా ప్రతి బింబమే యీశ్వరుఁడు కావున స్పష్టముగా నుండు బుద్ధి ప్రతిబింబిత జీవవృత్తులే యభ్యాస వశంబున నీశ్వర వృత్తులుగా మాఱును, జీవేశ్వరైక్యముః.

శ్లో॥ మేఘాంశరూప ముదకం * తుషారాకార సంస్థితం
తత్రస్వ ప్రతిబింబోయం * నీరత్వాదను మీయతే॥

మేఘముయొక్క యంశరూపముదకము య్యది తుషారాకారమైయున్నది. నీరత్వముగా నుండుట

వలన నచ్చుటఁ బ్రతిబింబమను మాన ప్రమాణ
ముచే నెఱుంగఁ బడుచున్నది,

1 జలాకాశము — జీవుఁడు [ వృత్తులు స్పష్టము ]

2 ఘటాకాశము } ప్రత్యగాత్మ
కుండలోని కాళీజాగా } కూటస్థుఁడు

3 మేఘాకాశము — ఈశ్వరుఁడు (అంతర్యామి)

4 మహాకాశము - పరమాత్మ వ్యాపక చైతన్యము

వ॥ మఱియు నగ్గజేంద్రుఁడు నిరర్గళ విహారంబున

బాహ్య॥ సులభము -

రహ॥ - ఆ జీవుఁడు, ప్రతిబంధ రహితంబైన జ్ఞానంబున

ప్రతిబంధ వివరణ.

1 భూత ప్రతిబంధము - వెనుకటి దానినిఁగూర్చి
తలంచుట ( శ్రవణాదులచే నశించును )

2 వర్తమాన ప్రతిబంధము - కామాదులు ( శమా
దులచే నశించును )

3 భావి ప్రతిబంధము - జడభరతుఁడు ( రాగముఁ
ద్రేమము ) నిదిధ్యాసచే నశించును )

సీ॥ కరణీ కరోజ్ఝిత ♦ కంకణచ్ఛటఁ దోఁగి
సెలయేటి నీలాద్రి ♦ చెలువుఁ దెగడు
హస్తినీ హస్తవి ♦ న్యస్త పద్మంబుల
వేయి గన్నులవాని ♦ వెరవు సూపుఁ
గల భీసముత్కీర్ణ ♦ కల్హార రజమునఁ

గనకాచ లేంద్రంబు ♦ ఘనతఁదాల్చు
గుంజరీ పరిచిత ♦ కుముద కాండంబుల
ఫణిరాజ మండన - ప్రభవహించు
మదక రేణు ముక్త ♦ మౌక్తిక శుక్తుల
మెఱుఁగు మొగిలుతోడ ♦ మేలమ్మాడు
నెదురు లేని గరిమ ♦ నిభరాజ మల్లంబు
వనజగేహ కేళి ♦ వ్రాలునపుడు

తాత్ప॥ — అవారణ శ్రేష్ఠము సరస్సులో విహరించుచున పుడు. వేదండములు తొండములచేఁ బైకిఁజిమ్ము చున్న (కంకణచ్ఛట — నీటి బిందువుల వరుస, శరీరమునందుఁ దోఁగి - (అంటుగలసి) నీల పర్వతమును, బరిహసించు చున్నట్లును, ద్విరదం బులఁ బట్టిన కమలములచే వేయి కన్నులవాని [ఇంద్రుని] మాడ్కిని — యెఱ్ఱకలువల పుప్పొ డి వికాసముచేఁ గనకాచలంబు వలెను - దామర తూండ్లచే ఫణిరాజు వడువునను - మరియుఁ గరి రాజుచే విడువఁబడిన ముత్యపుఁజిప్పలు మేఘము లతోఁ గలియుచుండ నిట్లప్రతిహతముగా విహ రించెనని తాత్పర్యము.

రహ॥ - గజము, నీలాద్రి ప్రభృతి రూపంబులు బొంది నట్లు జీవుఁడు, మూలాధారాది చక్రములందు వాయువును, బంధించి నపుడాయా దేవతావర్ణము లను బొంది [కరేణు విముక్త మౌక్తిక పంక్తులు] తుదకుఁ బరయం దైక్యమయ్యెనని తాత్పర్యము.

| | చక్రనామములు | అధిదేవతలు | వర్ణములు | వర్ణబీజములు |
|---|---|---|---|---|
| 1 | మూలాధారము | గణపతి | పీత—పసుపు | వ, శ, ష, స |
| 2 | స్వాధిష్ఠానము | బ్రహ్మ | రక్త వర్ణము | బ, భ, మ, య, ర, ల |
| 3 | మణిపూరము | విష్ణువు | నీలవర్ణము | డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ |
| 4 | అనాహతము | శివుడు | శ్వేతవర్ణము | క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ |
| 5 | విశుద్ధము | మాయాశక్తి (అవ్యక్తము) | నలుపు వర్ణము | స్వరములు [అచ్చులు] 16 అఆలు |
| 6 | ఆజ్ఞ | పారమార్థిక జీవుడు | ఎరుపు వర్ణము (కుంకుమ) | హం — క్షం |
| | సహస్రారము | శాంతకల | శుద్ధశ్వేతము ద్విజరాజు | ఈశ్వరుడు |

వ॥ మఱియు నాసరోవరలక్ష్మి మదగంజేద్రి వివిధ విహార వ్యాకులిత నూతనలక్ష్మివిభవమై, యనంగ విద్యా నిరూఢ పల్లవ ప్రబంధ పరికంపిత శరీరాలంకారయగు కుసుమ కోమలిఁ బోలె వ్యాకీర్ణచికురమత్తమధుకరని కరయు. విగతరస వదన కమలయు, నిజస్థాన చలిత కుచరథాంగయుగళయు, లంపటిత జఘనపులిన తలయునై యుండెనంత—

లంపటిత — [ శ్రమపడిన ]

భావ॥ — మఱియు నా సరోవరము గజ విహారముచేఁ గలఁకఁబాఱి నూత్నశోభాయుతమై, మదనవిద్యా ప్రవీణులైన పల్లవకోటిచేఁ [ చిగురులను సరసులచే ] బరికంపిత శరీరాలంకారవతియగు, యువతిం బోలినదియు, విరియంబోసిన భృంగములను, కేశములు గలదియుఁ, జలించుచున్న చక్రవాకములను కుచయుగళయు, శ్రమయుక్తమైన పులిన [ యిసుక తిన్నె ] స్థలంబునుబోలు జఘనస్థలముఁ గలిగినదియునై యుండెనని భావము.

రహ॥ - మఱియు నా మానస సరస్సు, జీవన్ముక్త విహారముచే. సద్వాసనా శోభితమై, [యనంగ] యుపాధిరహిత యాత్మజ్ఞాన, రసిక భుజంగులగు బ్రహ్మవిదాదులచే శుద్ధమై శబ్దరూపర సాదివిగతమై, కించజ్ఞత్వ, సర్వజ్ఞత్వాది గుణలక్షణములుఁగల

జీవేశ్వరులను స్తనద్వయ యుతయై యుండెనని తాత్పర్యము [ బ్రహ్మవిదులు — బ్రిహ్మానిత్ - నరఃవరీయః వరిష్ఠః )

సీ॥ భుగ భుగాయితభూరి ♦ బుద్బుదచ్ఛటలతో
గదలుచో దివికి భం ♦ గంబు లెగయ
భువన భయంకర ♦ ఫూత్కార రవమున
ఘోర నక్రగ్రాహ ♦ కోటిబెగడ
వాల విక్షేప, దు ♦ ర్వార ఝుంఝానిల
వశమున ఘుమ ఘుమా ♦ వర్త మడరఁ
గల్లోలజాల సం ♦ ఘట్టనంబులఁ దటీ
తరుల మూలంబులై ♦ ధరణిఁగూల
సరసిలోనుండి పొడగని ♦ సంభ్రమించి
యొదరి కుప్పించి లంఘించి ♦ హుంకరించి
భానుఁ గబళించి పట్టు స్వ ♦ ర్భాను పగిది
నొక్కమక రేంద్రుఁడి భరాజు ♦ నొడిసిపట్టె

భావ్య॥ - భుగ భుగాయిత ధ్వని జనిత బుద్బుద సము దాయముతో నంతరిక్షమునకుఁ దరంగంబు లెగయు కరణిఁ జనించుచుండ లోకభయంకరములగు నుచ్ఛ్వాసములచే మకరాది లగ్నస్థ గ్రహ కోటి భయము నొందుచుండఁ వాల విక్షేపముచే ఘుమ ఘుమ యని సుడులు పడుచుండు దరంగ సంఘట్ట నచేఁ, దీరస్థ వృక్షములు సమూలముగాఁ గూలు

చుండ, సరస్సులోని గజమును జూచి యాటోపం
బునఁ గుప్పించి పైకుటికి, హుంకార ధ్వనితో
రాహుగ్రస్త సూర్యగ్రహణమువలె నొక్క మక
రేంద్రము గజేంద్రునిఁ బట్టెనని తాత్పర్యము —

రహ॥ [ జీవుఁడు కామగ్రస్తుఁడగుట ] ఇంతవఱకు మనో
సరస్సు శుద్ధ వృత్తియుక్తమైనట్లు ప్రియుక్తమైనది.
యట్టిశుద్ధ సాత్విక మనస్సు నందుఁ గామమెట్లు
జనించునను సంశయముదయింప వచ్చును,
కాని, యెపుడు జీవ చైతన్యము విషయ సాన్నిధ్య
మగునో, యపుడే తద్విషయ గ్రహణేచ్ఛ జనిం
చును, తోడనే బీజమంకురమై, పల్లవ, పత్ర,
పుష్ప, శాఖాదులతో నశ్వద్థము వృద్ధియైనటులిచ్ఛ
యే కామముగాఁ బరిణమిల్లును. "శు॥ చిత్తో
రూపమిదం బ్రహ్మ క్షేత్రజ్ఞ ఇతి కథ్యతే —
వాసనాః కల్పయంతోఽపి — యాత్యహంకార
తాంపునః - అహంకారో వినిర్ణేత — కళంకీబుద్ధిరు
చ్యతే బుద్ధి సంకల్పితాకారా - ప్రియాతి మనసా
స్పదం — మనోఘన వికల్పంతు గచ్ఛతీంద్రియ
తాంశనై - ఏవంజీ వోహివా సనారజ్జు కల్పితః

తా॥ చిత్స్వరూపియైన పరమాత్మ క్షేత్రజ్ఞుఁడని చెప్పఁ
బడుచున్నాడు. వాసనా కల్పితుఁడై నియామక
త్వంబున నహంకార రూపమును బొందుచున్నాడు

పిమ్మటఁ గళంకయుక్తబుద్ధి, సంకల్పరూపమనస్సును ఇంద్రియతత్వమును, గ్రమ క్రమంబునఁ బరిణ మించి వాసనా సంకల్పరూప రజ్జువులచే జీవుఁడు, బంధింపఁ బడుచున్నాడు. అనగా విషయ సంకల్ప ములు కూడదని॥ భావము " శ్రు॥ యస్య స్త్రీ తస్య భోగేచ్ఛా, నిస్త్రీ కస్యక్వ భోగభూః — స్త్రీయం త్యక్త్వాజ్జగత్త్యక్తం జగత్యక్త్వాత్సుఖీభవేత్ " ఎవ నికి స్త్రీ సన్నికర్షమో వానికే భోగేచ్ఛ పొడమును స్త్రీ సంపర్కము లేనిచో * భోగేచ్ఛ యెచ్చట ? నుండదని తాత్పర్యము - స్త్రీని విడుచుట వలన జగత్తును విడిచినట్లగును జగత్తును విడిచిన సుఖి యగును — కావున, గజము నిమిత్త మాత్రి ముగానుండి జలపానముచేఁ దృప్తినొందక నింద్రియార్థమను పుష్పగ్రిహణాది విషయ సంక ల్పముచే గలతనొందెనని భావము, ఇట్లు ఋష్య శృంగ, సౌబల, విశ్వామిత్రి, పరిభృతులు దృష్టాంతములు —

భుగ భుగాయిత భూరి బుద్బుదములనగా, భయంకరములైన దుస్సంకల్పములు, వానినే మనోరాజ్యములోఁ దీవ్రసంకల్పములని చెప్పుదురు " శ్లో॥ అశాస్త్రీ యమపిద్వైతం తీవ్రం మందమితి ద్విధా - కామః క్రోధాధికం తీవ్రంమనోరాజ్యం

తద్భేతరత్ " ద్వైతమనగా నశాస్త్రీయమైన సంకల్పము. తీవ్రమందములనిద్వివిధముగాఁ జెప్పబడెను. కామ క్రోధాదులు తీవ్రమనియుఁ దద్రహిత సంకల్పము మనోరాజ్యము [ జాగ్రత్స్వప్నము ] బాధించ నిదిగాఁ జెప్పబడినది. యట్టి తీవ్రసంకల్ప బుద్బుదము " " మన్మథ సంబంధ కామ దోషాదికము, బడబానలము వంటి యుగ్ర తేజోవంతమైనది. మఱియు, దుస్సంకల్పవి కల్ప పూత్కారము ( ఉచ్ఛ్వాస నిశ్వాసము ) లితర సంకల్పముల నడఁగ ద్రొక్కుచుండ, వాల విక్షేపముగా నన్నమయాది కోశములకుఁ బుచ్ఛములు ( తోకలు ) ఆధారమని పరిగణింప బడిన వి, యట్టియాధారమగు పుచ్ఛమును బహువిధములుగా జలింపఁజేసి. యనగాఁ గాముకుని లక్షణములు, బుద్ధిచలించుట, మాటలు తడబడుట, గగుర్పాటుఁ జంచలదృష్టి మున్నగు సన్నిపాతగుణముల వంటి గుణములు — విక్షేప మనబడును, అట్టి విక్షేపమగు మోహావర్తము లను సుడి గుండములు గలుగుచుండ దుస్సంకల్ప కల్లోలము [ పెద్దకెరటముచే ] ధైర్యద్రుమము సమూలముగాఁ బతనమగుచుండఁ బొంచి, జీవుఁడు♦ పరాఙ్ముఖుఁడైనపుడు సమయముఁజూచి కుప్పించి, లంఘించి,

రాహుగ్రస్త సూర్యగ్రహణమువలె జీవ గజముసు
గామ రూప నక్రము పట్టెనని తాత్పర్యము —

శ్లో॥ దేహేంద్రియాని సర్వ విషయేషుపరికల్ప్యరాగం
బధ్నాతి తేనపురుషం పశువద్గుణేన
కామాభిలాష వివిధో రగదంశి తస్య ”

తా॥ విషయములందు రాగమును గల్పించి, పశువును
ద్రాటిచే బంధించి నటులుబంధించుచున్నది ఏది ?
కామము. కామాభిలాషలను వివిధములగునురగము
[ పాములచే ] గరువఁబడి బాధింపఁ బడితివి.

సీ॥ గంగిరెద్దును దగు ♦ శృంగార మొనరించి
జిగిత్రాళ్ల నాసిక ♦ బిగియఁగట్టి
యింటింటఁ ద్రిప్పెడి ♦ యెద్దుభంగిని సదా
పురుషుండు స్త్రీ వెంటఁ ♦ దిరుగుచుండు
విషయాను రాగదు ♦ ర్విలసిత యురుపాశ
బద్ధుఁడై యువతుల ♦ బారిఁజిక్కి
యాటలాడుమటన్న ♦ నాడుచుఁ గామాది
రజ్జుప్రోతముల ని ♦ రంకుశముగ.

తే॥ నురులలోఁ బీక్షబిగియంగ ♦ నరశవంబు
గతిని వహియించి శిరము సం ♦ తతము వణఁక
బంధమును వీడదెంత ని ♦ ర్భాగ్యదశయొ
యేమి చెప్పుదు నిర్ధరఁ ♦ గామ మహిమ॥

వ॥ ఇట్లు జీవుఁడు గ్రహింపఁబడి

కం॥ వడిఁదప్పించి * కరీంద్రుఁడు
నిడుద కరంబెత్తివేయ * నీరాటంబుం
బొడవడఁగినట్లు * జలములఁ
బడికడువడిఁబట్టెఁ బూర్వ * పదయుగళంబున్

బాహ్య॥ – గజము మకరము యొక్క వేగమును దప్పించుకొని తొండముచేఁ గొట్టఁగా నక్రము పొడవడఁగి ( మరణించి ) నట్లు నీటియందుఁ గూలి మఱల, నుద్రేకించి ముందరి పాదంబులఁ బట్టెనని తాత్పర్యము —

రహ॥ నిడుదకరంబనగా " శ్లో॥ ద్వాక్రమౌ చిత్తనాశస్య యోగోజ్ఞానంచ రాఘవ – యోగోహి చిత్తరోధశ్యాత్ – జ్ఞానంసమ్యగవేక్షణం " ఓ శ్రీరామచంద్రా ! చిత్త నాశనమునకు యోగ, జ్ఞానములను రెండు మార్గములు కలవుఁ యోగమునవలన చిత్త నిరోధమును, జ్ఞానము వలన సమ్యగ్వివేకంబును గలుగును. వానిలో " జ్ఞానాదేవహి కైవల్యం " జ్ఞానము వల్లనే మోక్షమను వాక్యము చొప్పున జ్ఞానము శ్రేష్ఠము, అదియే నిడుదకరము, దానిచే ననగా, ( వస్తువిచారకేన, కామోహతః ) వస్తు విచారణచేఁ గామము నశించునను యుక్తి చొప్పున నాత్మానాత్మ వివేకముచేఁ, గామోద్రేకము నడంచఁగా గామము శాంతిబొందఁనటు లగు

పడినను. అనగా మార్జాల వ్యాఘ్రాదులు జంతు
వును బట్టుటకుఁ బ్రయత్నించినపుడు. క్రోడీఁ
( సూక్ష్మ ) భావమును బొంది జంతుగ్రహణ
సమయమునఁ దనుత్వము ( విస్తృతము ) నొందిన
నట్లు కామము, జప, తప, యోగ, విచారణ వేళ
లయందు జయింపఁ బడినదను ధైర్యముకలిగిఁనను

శ్లో॥ తతోన్యథా కించనయద్వి పక్షతః
పృథగ్ద్రశ స్తత్కృత రూపనామభిః
నకర్హిచిత్క్వాపిచదుస్థితామతి
ర్లభేత వాతాహత నౌరివాస్పదమ్॥

తా॥ దృక్స్వరూపము ఆత్మనుండి కించిత్తయినను
విపక్షమైన, దృశ్యరూప మాయాకార్యములగు
నామ రూపములతోడ నేకీభవించిన యెడల, నెప్ప
టికిని నెవని చేతను దుస్థితమైన యీ చిత్తము
వాయువుచేఁ గొట్టఁబడిన నావవలె స్వస్థానమును
జెందనేరదు.

శ్లో॥ ఇంద్రియాణాం హిచరతాంయన్మ నోను విధీయతే
తదస్యహరతిప్రజ్ఞాం వాయుర్నావమి వాంభసి॥

చరించు చున్న యింద్రియములలో, నేయిం
ద్రియమును, మనంబనుసరించునో, యా యింద్రి
యము సముద్రమున వాయువుచేఁ గొట్టఁబడిన
నావవలెఁ ( బ్రజ్ఞను నాకర్షించును. )

మ॥ అనిశంబున్ బరమాత్ముఁ జూడనియతుం
డాకార వైకారికా
జనవాంఛా విషయంబులన్ దవిలి, దు * స్సంసార
సంచారము
ల్గాని ముందున్ దలయెత్తలేక ప్రతిమా * లున్
గన్నవార్నెల్లఁగా
వునదుస్సంగ విరోధి కావలయు, జీ * వుఁడాత్మ
సత్సంగియై

శ్లో॥ లక్ష్యాచ్యుతం చేద్యది చిత్త మీషా
ద్బహిర్ముఖం సన్నిపతే త్తత స్తతః
ప్రమాదతః ప్రచ్యుత కేళికందుక
స్సోపానపంక్తౌపతితోయథా తథా॥

చిత్తములక్ష్యము ( బ్రహ్మము ) నుండి, కించి
త్తైననుఁ బహిర్ముఖమైన యెడల, నాటబంతి ప్రమా
దవశమున సౌధాగ్రమునందలి ప్రథమ సోపాన
ముపైఁ బతనమైన, నచ్చోట నిలువకఁ గ్రింద
మెట్టువరకు, గళితమై యెట్లు భూపతనమగునో
యట్లు చిత్తము ప్రపంచాభి ముఖమైన యెడల
భ్రష్టత్వము నొందును— కావున లక్ష్యమును విడువ
గూడదని భావము

చ॥ పదములఁబట్టి వందలకుఁ * బాటొక యింతయు లేక
శూరతన్

మదగజ వల్లభుండు ధృతి * మంతుఁడు, దంతయు
గ్రొంతఘట్టనం
జెదరఁగ జిమ్మెనమ్మకరి * చిప్పలు, పాదులుదప్ప
నొప్పఁగన్
వదలి జలగ్రహంబు కరి * వాలము మూలముఁ
జీరెఁ గోఱులన్

బాహ్య॥ - ఇట్లు ( మకరిచే ) పాదములం గ్రహింపఁబడి, గజము వెనుదీయక. ధైర్యముచే దంతములతో నమ్మకరి చిప్పలు ( శరీరముగా నేర్పడిన పొలసులు ) మొదలంటఁ గొట్టగా, మొసలి బిగువుఁ దప్పించుకొని ఘనాటము ( గజము ) యొక్క పుచ్ఛమును బలుచోట్ల నఖములతోఁ జీరెనని తాత్పర్యము.

రహ॥ జీవుఁడు కామముచేఁ బట్టువడి మైమఱపు లేక శూరుఁడయి యనగా -

చ॥ అరదము దేహమింద్రియము, * లశ్వము లాత్మఁడు సూతుడిమ్మహో । తుర గచయంబు ధైర్యమను తోరపు బగ్గములందృఢంబుగా * నురువడిఁ బోవ కుండ వెఱ*వొప్పఁగ బట్టినవాఁడు, స్వర్గవుం। దెరువునఁ బోవునమ్మహిత -ధీరుఁడు సుమ్ము మహాత్మఁడెమ్మెడన్ అట్టి ధైర్యదంతయుగము ( భక్తి జ్ఞానములు ) చేఁ గామునును " సంకల్ప ఏవా

ఖిల కామమూలం " సమస్త కామములకును సంకల్పమే మూలము. కామ మూలములగు దుస్సంకల్ప చిప్పలను వాసనా క్షయమగునటుల " కదా వామనోమే సమూలం వినశ్యాత్ " నా మనస్సు సమూలము [ వాసనా క్షయము ] గా నెప్పుడు నశించునో, యట్లు వాసనా క్షయమగు నటులుఁ గామము, నణఁగఁదొ్రక్కఁగా నశ్యామము. "ఆవృణోతితథామాయా ప్రాజ్ఞంవాపిపరాఙ్ముఖం" సంసారాభిముఖుని, సరస్సనందలి నా. చు వ లె మాయయావరించును. అట్లు కామ, మేమరుపాటు లేక నింద్రుఁడు తనపినతల్లి దితినిష్టఁదప్పి తలవిరియం బోసి కొని, పశ్చిమ శిరస్సుగాఁ బరుండి నిద్రించు నపుడు. గర్భములోఁ బ్రవేసించి పిండమును దునియలు చేసినట్లు జీవుఁనిఁ బుచ్ఛమనగా నానంద మయ కోశమునకు " బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా " అట్టి బ్రహ్మవిచారణను, కామము [ నఖములు] దుస్సంకల్పములచే జీవుని బాధించెనని తాత్పర్యము.

కం॥ కరిఁదిగుచు మకరి సరసికిఁ
గరిదరికిని మకరిఁ దిగుచు * గరికరి బెరయన్
గరికి మకరి మకరికిఁ గరి
భరమనుచు నతల కుతల * భటులదరిపడన్

బాహ్యా॥ — సరస్సులోనికి గజమును, దీరమునకు మకరిని నన్యోన్యాకర్షకములై జయము భరమని; తలంచుచుం దద్వయమును పాతాళ భూలోక భటులు (యుద్ధవీరులు) భయపడునట్లుం బోరుచున్నవి.

రహ॥ జీవుఁడు తీరమున కనఁగా సంసార సాగరమున కావలియొడ్డు

శ్లో॥ తీర్త్వామోహార్ణవం హత్వా * కామక్రోధాది రాక్షసాన్
యోగీశాంత సమాయుక్తో * ఆత్మారామో విరాజితే॥

తా॥ శాంత సమాయుక్తుఁడును, నాత్మారాముఁడు నగు యోగి, మోహ వారధిని దాటి కామాది దైత్యులనుగూల్చి యానందమును బొందుచున్నాడు — కావున నట్టి యానంద రూప తీరమునకు జీవుఁడున

శ్లో॥ క్లేశాది పంచక తరంగయుతం భ్రమాఢ్యం
దారాత్మజాదిధన బంధు ఝషాభియుక్తమ్
ఔర్వానలాభ నిజరోషమనంగ జాలమ్
సంసార సాగరము తీత్యహరింవ్రజామి ॥"

తా॥ పంచక్లేశములు ౧ అవిద్యా క్లేశము దుఃఖరూపమైనయాత్మ(శరీరము)యందు సుఖరూనమగు నాత్మబుద్ధి ౨ అస్మితా క్లేశము— శరీరవ్యతిరిక్తమగు ఆత్మ లేదను మూఢజ్ఞానము 3 రాగ క్లేశము — రాగము గల్గి వీడకుండుట ౪ ద్వేష క్లేశము— ఫల విఫల

సమయమునఁ బుట్టు వృత్తి ౫ే అభినవ క్లేశము — సంసార మసత్యమని విడువ లేకుండుట — యిట్లు పంచక్లేశయుక్తమును, భ్రమయను నావర్తము నుడిగలిగినదియు, దారాపుత్ర ధనాదిక మీనయుక్తమును, రోషమను బడబానలము, విషయ వాంఛాసమూహము గలిగిన సంసార సముద్రమును (తరించి విష్ణువును పొందుచున్నాను,) అట్టి సంసృతి పారావారము (సరస్సు) లోనికిఁ గామమును దైవాసుర సంపత్తులలోని వీరభటులుఁ భయము జెందునట్లు యుద్ధముఁజేయుచుండిరని తాత్పర్యము.

వ॥ ఇట్లు కరిమకరంబులు రెండును నొండొండ సముద్దండ దంతంబులై తలపడి నిఖిలలోకాలోకన భీకరంబులై యన్యోన్య విజయ శ్రీవశీకరంబులై సంక్షోభిత కమలాకరంబులై హరి హరి యును, గిరి గిరియు నుందాఁకి పిఱుతివియక పెనంగు తెఱంగున నీరాటంబయిన పోరాటంబునంబట్టుచు వెలికి లోనికిందిగుచుచుఁ గొలంకు గలంకంబొందఁ గడువడి నిట్టట్టుఁబడి తడఁబడి బుడ బుడాను కారంబులై భుగులు భుగుల్లను చప్పుళ్లతో నురువులు గట్టుచు జలంబు లుప్పరం బెగయం జప్పరించుచుఁ దప్పక వదవ గహ్వరంబుల నప్పళించుచు నిశిత నితాంత దురంత దంత కుంతంబుల నింతింతలు తునియ

లయి, నప్పళంబునంబునుక చిప్పలు గుదుళ్ళదప్పి. రక్తంబులుగ్రమ్మ దేఱ హుమ్మని యొక్కమ్మడిం జిమ్ముచు నిత్రరేతర సమాకర్షణంబులం గదలక పదంబుల మొదలిపట్టు వదలక కుదురై వర్తించుచుఁ బరిభ్రమణ వేగంబున జలంబులం దిరుగుచు మకరకమఠ కర్కటగండకమండూకాది సలిలనిలయంబుల ప్రాణంబులు క్షీణంబులుగా నొండొంటిం దాకు రభసంబున నిక్కలువడ మ్రిక్కందొ్రిక్కుచు మెండుచెడి చెండుపడి నాచుగుల్ల సిప్పతండంబులఁ బరస్పర తాడనంబులకు నడ్డంబుగా నొడ్డుచు నోలమాస గొనక గెలుపుఁ దలంపులు బెట్టిదంబులై రెట్టింప నహోరాత్రంబులుంబోలె. గ్రిమ క్రమ విజృంభ మాణంబులై బహుకాల కలహ విహారంబులై నిర్గత నిద్రాహారంబులై యవక్రి పరాక్రమఘోరంబులై పోరుచున్న సమయంబున

బాహ్య॥ – ఈ వచనమునకుఁ బై పద్యములలో వర్ణించిన కలహోద్రేక భయంకర విషయంబులనే, స్పష్టముగా విశదీకరించెను.

రహ॥ – కామము, తజ్జనకు నిత్యవైరి యగుటచేఁ దన్నిరోధ సాధనోపాయములే యుద్ధము, యెట్లన -

శ్లో॥ ధూమేనా వ్రియతే వహ్ని * ర్యథాఽదర్శో మలేనచ
యథోల్బేనా వృతోగర్భ * స్తథా తే నేదమావృతమ్

ఆవృతంజ్ఞాన మేతేన * జ్ఞానినో నిత్యవైరిణా
కామరూపేణ కౌంతేయ * దుష్పూరేణానలేనచ॥

తా॥ ఈ కామము ధూమముచే నగ్నివలెను' మలము (కళాయి) చే, దర్పణమువలెను, మావిచే బిండమువలెను, కామమను నజ్ఞానము. ఆత్మజ్ఞానము నావరించుచున్నది - యిచ్చటఁ జిన్నరహస్యము కలదు అగ్నిని జ్వాలింపజేసి యూదినంత మాత్రమున ధూమము నిరావరణమయి, యగ్ని ప్రజ్వలించినట్లు మంత్రోపదేశముఁ జేసినంత మాత్రమున నజ్ఞానము నశించు. నిది యారూఢుని లక్షణము. అభ్యాసుని లక్షణమెట్లన దర్పణమందలి మలినము (కళాయి) కత్తితోఁ గోకినంగాని యూడదు, ఊడుటకంటె గష్టము ప్రారబ్ధ బలిష్ఠము, ఇంక నారంభకుని లక్షణమెట్టిదనగా నుల్బణమను మావిని నైపుణ్యముచేఁ దొలఁగించని యెడల శిశువునకుఁ బ్రాణభంగమగును. తొలఁగించుట కష్టతరముగావున మంత్రోపదేశముఁ జేసిననుఁ బ్రారబ్ధబలిష్ఠముచే జ్ఞానముఁ గలుగక పోవచ్చును. గావునఁ దత్వజ్ఞునకు నిత్యవైరియగు నీ కామము చతుర్థోపాయము (దండోపాయము) చేతనే నశించును.

శ్లో॥ హస్తం హస్తేనసంపీడ్య* దంతాన్దంతైర్విచూర్ణ్యచ
అంగాన్యంగైసమాక్రమ్య*జయేదాదౌస్వకంమనః

తా॥ హస్తసంపీడనము (గుద్దులు) దంతములచేఁ గఱచుట - కుస్త్రీపట్లు మల్లయుద్ధముఁ జేయుట - మున్నగు దండోపాయములచే ధ్యానమునకుఁ బూర్వమే స్వకీయమైన మనస్సును జయించవలెను.

శ్లో॥ "కామజానామి తేమూలంసంకల్పాత్త్వంహిజాయసే"

తా॥ కామమా! నీ పుట్టుక నే నెఱుంగుదును. సంకల్పమున, గదా పుట్టుచున్నావు. అనుశ్రుతి చొప్పున సంకల్ప రూప మనస్సు నిగ్రహించినయెడలఁ గామము నిగ్రహింపఁబడును ఇట్లు జీవుఁడు కామముతో యుద్ధము జేసెనని తాత్పర్యము.

కం॥ జవమును జలమును బలమును
వివిధములుగఁ బోరుకరటి * వీరతకు భువిన్
దివిమకర మీన కర్కట
నివహములొక్కటన మిత్ర * నిలయముఁబొందెన్

బాహ్య॥ - కరటి (యేనుగు) యొక్క వేగిరపాటును పట్టుదల సత్వము (దేహబలము) మొదలగు వీర స్వభావమనగా, నుద్రేకమునకు సరస్సునందలిమీన కులీర, సముదయములు, దివి - వియద్గంగ యందలి జలచరములలో మైత్రినిఁ బొందినవి [ఉత్ప్రేక్షాలంకారము. (కులీర - యెండ్రికాయ)

రహ॥— జీవుని, తీవ్ర, ముముక్షత్వసంకల్పమును నాదాను సంబంధములగు - పశ్యంతి - మధ్యమ - వైఖరీ వాక్కులను పరానాదముతో నైక్యముఁ జేసెనని తాత్పర్యము.

1 పరానాదము - సహస్రారము
2 పశ్యంతి - మూలాధారము - అక్షరసంజ్ఞ
3 మధ్యమ - మణిపూరము వచ్చీరానిమాటలు
4 వైఖరీ - అనాహతము- స్పష్టముగాబలుకుట
5 విశుద్ధము - స్వరయుక్తమగు వివిధ పదములను ముఖద్వారమున సంభాషించుట

శ్లో॥ నాస్తినాదాత్పరోమంత్రం నదేవస్స్వాత్మనఃపరమ్
నానుసంధేఃపరాపూజానహితృప్తేః, పరంసుఖమ్॥

తా॥ ప్రణవముకంటె మంత్రమును ఆత్మకంటె దైవమును - ఆత్మానుసంధానము కంటె దేవతా పూజయును లేవు॥

కావున యోగి, యింద్రియ ద్వారంబులనుమూసి వాయువును, అంతర్ముఖముఁజేసి సుషుమ్న ద్వారమునుఁ బరానాదమునందు సమ్మేళనము సేయును [దీనిని నాదాను సంధానమందురు) ఇట్లు జేప్పుడు నాదము, ననుసంధించి పరలోఁ గలిపెనని భావము

శా॥అటోపంబునఁజిమ్ముఁఊమ్మగలవజ్రా*భీలదంతంబులం
దాటించున్ మెడఁగట్టి బిట్టుహరిదో*ర్దండాభశుండాహతిన్
నీటన్ మాటికిమాటికిందిగువఁగా*నీరాటనున్నిట్టిపో
రాటనోన్నటమిపాటు,జూపుటకర*ణ్యాటంబువాచాటమై

బాహ్యా॥ నీరాటము [మొసలి] స్వస్థానమగునీటిలోఁబోరు

టచే బలముఁ గలిగి గజమును మాటి మాటికి నాకర్షించు చుండఁగా (అరణ్యాటంబు) గజము ప్రకృతిని మకరమునకు నోటమపాటు - భయాందోళనము. గల్గునట్లు వాచాటమై-ఘీంకారముఁ జేయుచున్నదై, దోర్దండాభ - కాంతిగలిగిన తొండమను బాహుదండముచే జలచర గ్రీవమును జుట్టిపట్టి వజ్రాయుధమువలె భయంకరములగు దంతములచే మకరియొక్క గుండె, చిప్పలు, నూఁడునట్లు, ల్లంఘించెనని తాత్పర్యము (గట్టిబిట్టు - మంచి వేగముఁ,)

రహ॥ - కామమునకు స్వస్థానమగు సంకల్పమునందు - జీవుని యుద్ధముఁ జేయుటచే బలముఁగలిగి జీవుని సంకల్పమునికి నీడ్చుచుండ. జీవుఁడు కామమునకు భయము వాటినట్లు స్వరూప జ్ఞానము [తొండముచే] గామమును. ప్రాణాంమముచే నాకర్షించి, బంధించి విజ్ఞాన దంతములచే గామమయొక్క రాగద్వేషాది తెక్కల, నున్మూలించెనని యాశయమవివరణ - వాంఛాజనిత తుష్టి తత్కార్యావసాన పర్యంతయుండును.

శ్లో॥ వాంఛాక్షణేతుయా తుష్టి*స్తత్రివాంఛైవ కారణ.
తుష్టిస్త్వతుష్టిపర్యంతా త్తస్మాద్వాంఛాంపరిత్యజ

తా॥ వాంఛాక్షణమునఁగల్గు విషయానుభవసంతుష్టికి, వాంఛయే కారణము. అసంతుష్టియో, యసంతుష్టి పర్యంతమనగా విషయానుభవ పర్యంతమే

యుండును, అందువలన వాంఛను విడువుము. విష యానుభవానంతరముఁ బునర్దశాధిక ప్రియత్న ముతో వచ్చెదనని కామము, నిర్ధ్యముంచిపోవును. అనఁగా గాముకుని విషయాభిలాష నిరంతరాభి వృద్ధిఁ గలిగియుండును. – అట్టి విషయాభిలాషను విచారణచే నిర్బంధించెనని భావము

వ॥ అప్పుడు –

ఆ॥ వె॥ మకరితోడఁబోరు ♩ మాతంగ విభుని నొ
క్కరునిడించి పోవఁ ♩ గాళ్లురాక
కోరి చూచుచుండెఁ ♩ గుంజరీ యూథంబు
మగలు దగులుగారె ♩ మగువలకును.

భావ్య॥ – కరణీయూథము గజేంద్రు నొక్కరుని వీడ్పోని పోలేక తమ యజమానియొక్క సంకటపాటుఁ జూచుచు నిశ్చేష్టితమై యుండెను మగువలు మ గలను విడిచి యుండలేరుఁ బంధకములు కదా !

రహ॥ – కామవిముక్తికై పోరాడు· జీవుని విడువ లేక సద్వాసనలు చూచు చుండెనని తాత్పర్యము.

( వివరణ ) జీవుఁడు పూర్వవాసనా ప్రారబ్ధముల ననుసరించి దుష్కృతముల నాచరించు చున్నను, నీ పాపకృత్యము నాకెల్ల తప్పునను విచారణ ( పశ్చాత్తాపము గల్గును ) అయినను దప్పించుకొన సమర్థుఁడు కాడు, తజ్జిజ్ఞాసయే సద్వాసన యగును

అట్టి సద్వాసనలు వర్తమాన పుణ్యకర్మలయొక్క ఫలాధారములని తెలియ వలెను, పాపకృత్యములు నింద్యములని యెఱింగినను, సద్యః కృతసంధ్యావందనాదికము, వర్తమాన ప్రతిబంధకమగు కామాదులను. నివారించ సమర్థముకాదు గాని, పశ్చాత్తాపజనిత సద్వాసనలు భవిష్యత్తునకు సుకృత కారణములై జననమునకుఁ బూర్వమే సువర్ణరాపిడి పొడిలక్కయందుఁ బొదువఁబడియున్నట్లు బుద్ధియందంతర్భవించియుండును. " బుద్ధిః కర్మాను సారిణీ" పూర్వకర్మ ఫలవాసనా రూపమై బుద్ధి పుట్టును.

శ్లో॥ శుభాశుభాభ్యాంమార్గాభ్యాంవహంతీ వాసనాసరిత్
పౌరుషేణ ప్రయత్నేన యోజనీ యాశుభేపథి
అశుభాచ్చాలితంయాతి శుభం తస్మాదపీతరత్
ద్రాగభ్యాస వశాద్యాతి యదా తే వాసనోదయమ్
తదాభ్యాసస్యసాఫల్య విద్ధిత్వ మరి మర్దన॥

తా॥ హే శత్రుసంతాపా! వాసనా ప్రవాహము శుభాశుభ కర్మ ప్రణాళిక కాలువలయందుఁ బ్రవహించుచుండును - స్వప్రయత్నముచే జిత్తమును: నశుభములనుండి మరలించి శుభమునైపుఁ ద్రిప్పుము అట్లభ్యాసముఁజేయ నెపుడు సద్వాసన (పశ్చాత్తాప దుఃఖవిచారణ) గల్గునో యదియే యభ్యాసమునకు సఫలము - అట్టి సద్వాసన లుత్తరజన్మమున

కుపయోగ మగును - లోకములో " వాఁడు జ్ఞాన బోధ సేయుచున్నాఁడు గాని యాచరణ లేదు" అను నింద్య వాక్యముల రహస్యమిదియే; కావున నిట్టి సద్వాసనలు విడువఁ జాలక జీవకృత సుకృత, దుష్కృతములను జూచుచున్నవని యాశయము.

వ॥ అంత.

ఆ॥ వె॥ జీవనంబు తనకు శ్రీ జీవనంబై యుంట
నలవుఁ జలమునంత శ్రీ కంతకెక్కి-
మకరమొప్పె డస్సె శ్రీ మత్తేభ మల్లంబు
బహుళపక్షసీత శ్రీ భానుపగిది.

బాహ్య॥ - జీవనం బనగా జలముఁ జలచరంబునకు స్వస్థానమగుటచే, నలవు - యుద్ధపరిశ్రమము, చలము - పట్టుదల క్రమంబున వృద్ధియై యుండెను. మత్తేభము కృష్ణపక్ష చంద్రునివలెం బల క్షీణమై యుండెను.

రహ॥ - జీవనంబు - చిన్మయ సంకల్పము కామమునకు జన్మస్థానమగుటచే " కామజానామి తేమూలం సంకల్పాత్త్వం హిజాయసే " కామమా ! నీ మూలము, నే నెఱుంగుదును. సంకల్పమునఁగదా పుట్టుచున్నావు. అనుస్మృతి వాక్యముచొప్పున, సంకల్పమే తన వృద్ధికిఁ గారణ మగుటచే నంతకంతకు జీవుని విషయ జలధియందు మునుంగఁజేయు పట్టు

దలతోఁగామము ప్రాతఃకాల సూర్యునివలె నభివృద్ధియై యుండెను. స్వరూపానందము కృష్ణపక్ష సీతకిరణుని మాడ్కి క్షీణించు చుండెను. (వివరణ) విషయము స్మరణముచే విషముకంటె బలవత్తరమైనది.

శ్లో॥ విషస్య విషయాణాంచ * దూరమంతరమేతయోః
ఉపభుక్తం విషంహంతి * విషయాస్మరణాదపి॥

తా॥ విషయ విషములకు మిక్కిలి భేదము కలదు అనగా విషముకంటె విషయమే హానిచేయునది. విషముఁ ద్రాగినంగాని చంపదు. విషయమో, తలంచినంత మాత్రముననే చంపుచున్నది. (తెలివిఁ దప్పునట్లుఁ జేయుచున్నది.) కావున స్త్రీ యాదికముల స్మరించఁ గూడదు.

శ్లో॥ స్త్రీయాదికంవిషయంచిత్తం-నస్మర్తవ్యంమనీషిభిః
తచ్చింతయాభవేత్సంగో*తతోమృత్యుర్భవిష్యతి॥

తా॥ స్త్రీ మొదలగు విషయములను చిత్తమునందు స్మరించనైనఁగూడదు. తచ్చింతనముచే, సంగము (ఆశక్తి) దానివలన మృత్యువును సంభవించును గావున విషయములకు నంతర మీయక నంతరాయములనే గల్పించుకొను చుండవలయునని యాశయము. సంపర్కదోషమునఁ బురూరవ, నహుష, విప్రనారాయణ, యజామిళాదులు పెక్కు

మంది భ్రష్టులై నటులు దృష్టాంతములు కలవు. జనకుని సభయందు" విదగ్ధశాఖల్యుడు దేవతలను గూర్చి యాజ్ఞవల్క్యుని బ్రశ్నించఁగా నంత్యము నందు జీవునిఁ జేర్కొని తదంతర్గతుఁడగు కామమయ పురుషునిగా, వచించి యా కామమయ పురుషునికి - నాయతనము - జ్యోతి - దేవతను అడుగఁగా "కామ యేవయస్యాయతనం హృదయంలోకోమనో జ్యోతి, స్త్రీ యేవ దేవతా" కామమే - ఆయతనం - హృదయము-లోకము- చూపు - మనస్సుజ్యోతి - ప్రకాసింపఁ జేయునది స్త్రీయే దేవత యనగా నాధారమని చెప్పెను. కావున స్త్రీని జయించినచో సమస్తకామములు జయింపఁబడును. గాన తత్సంసర్గకూడదని భావము.

క॥ విచ్చలవిడి నింద్రియముల
నెచ్చటికైననుజనంగ * నిచ్చిన నిరయం
బచ్చుపటుచు గుదియించినఁ
దెచ్చుసుగతికి స * తీమణిమణీ॥

గీ॥ విడువరాదు దుర్మతులకు * నొడలు మునియ
దానుముదియదు ప్రాణాంత * మైనరోగ
మనఘ తృష్ణవర్జితకాముఁ * డైయతండు
దానిఁబోద్రోచి సౌఖ్యసాం * ద్రత్వమొందు॥

కం॥ ఇంతకు మూలము తృష్ణా
తంతు లతయె * దానికి నడరం
గాంతాజనంబు తొలుబ్రా
కింతయె ఱేఁగి విడుపు * టిచ్చువిముక్తిన్

వ॥ ఉఱుకుం గుంభయుగంబుపై హరిక్రియన్ - హుమ్మంచుఁ బాదంబులన్ నెఱయంగంఠము వెన్నుఁదన్ను నెగయున్ - హేలాగతిన్ వాలమున్ జఱుచున్ నుగ్గుగ దాఁకుముంచు మునుఁగున్ శల్యంబులున్ దంతముల్ విఱుఁగన్ వ్రేయుచుఁ బొంచి పొంచి కదియున్ - వేదండ యూథోత్తమున్

బాహ్య॥ - గ్రాహము స్వస్థానములో నున్నపుడు - శక్తి కొలందిని విలసిల్లినట్లు, మొసలి స్వస్థానమగు జలములయందుండి యుద్ధవిలాసముఁ జూపుచున్నది. యెట్లన గజేంద్రునియొక్క కుంభస్థలంబుపై సింహమువలె నుఱుకును, బాదంబులచుట్టు నెఱయన్ - వ్యాపించి పట్టి పై కెగసి కంఠమును, వీపును, దన్నుచుఁ గడులాఘునముగా వాలమును భిండీకృతము సేయుచు నీటిలోనికి ముంచుచుఁ బైకి లేవకుండుటకై తాఁగూడమునుఁగుచు. దాఁకొనుచు. శల్యములను. దంతములను విఱుఁగగొట్టుచు బాధించు చుండెనని తాత్పర్యము.

రహ॥- కుంభయుగం బనగా నిరుప్రక్కల నున్నతమై, నడుమబల్లముగా

నందు ద్విపశిరః పురోభాగము తత్సదృశమైనది. యాజ్ఞాచక్ర ము, భ్రూయుగస్థానమందుండునది. యనగా సంకల్పయుక్తుం డైన జీవుఁడు అహంకృతుఁడై యింద్రియములకు నాజ్ఞనొసంగుస్థానము. కావున నాజ్ఞాచక్రము

శ్లో॥ ఆజ్ఞాచక్రే భృకుటిస్థానే ద్విదళాంతే
హంక్షంబీజం జ్ఞానమయుంతం శివశక్తిం
నాదబ్రహ్మానంద మనంతంగురు మూర్తిం
దత్తాత్రేయం శ్రీపద పద్మం ప్రణతోస్మి॥

తా॥ హం - క్షం - అను వర్ణబీజసంయుక్తమును — భృకుటీస్థానమును - జ్ఞానరూప శక్తివంతమును — నాద బ్రహ్మానంద గురుఁడగు దత్తాత్రేయ పాదజలజములకుఁ బ్రణమిల్లుచున్నాను. కావున సహస్రారమార్గమును తీవ్రమగు విషయసంకల్పముచే,నుఱుకుచు ననగా, సత్సంకల్పమును నశింపఁజేయుచుఁ గంఠము - విశుద్ధచక్రమును, వెన్ను - వీణాదండమును (షడాధారము.) చెఱచి భక్తిజ్ఞానములను దంతములను, విఱుఁగఁగొట్టి, సద్వృత్తులను శల్యంబులను నశింపఁజేసి, మనోసరస్సునందుముంచి, ప్రత్యఙ్ముఖంబుఁగాకుండఁదాఁ గూడ మున్గుచునిట్లు సర్వాంగములును, వికలాంగములుగఁజేసి జీవుని బాధించెనని తాత్పర్యము

మ॥ పొడగానంబడకుండ డాఁగు వెలికిం - బోవంగఁ
డానడ్డమై, పొడచూపుంజరణంబులం బెనగొనున్ —

బోరాకఁ రారాక బె- గ్గడిలం గూలఁగఁ దాఁచు లేచు
తఱి నుద్ఘాటించు లంఘించు బ-ల్వ్రేడిఁజీరుందలఁ
గున్ మలంగు నోడియుఁ - వేధించుఁ గ్రోధించు
చున్.

బాహ్యా॥ మొసలి క్రోధముచే, గజమునకుఁ దనయాశ
వాలుఁ దెలియకుండ నదృశ్యమై, గజము తీరము
నకుఁ జేరుటకు సిద్ధమైయుండ నడ్డమై తన జాడఁ
జూపి, పాదములను, జుట్టి కదలనీయక భయంకర
ముగాఁ బడిపోవునట్లుఁ దన్నుచు లేచుతఱి నేతము
వలె నుద్ఘాటించుచుఁ — ఊర్ధ్వాధోభాగములకు
ముంచుచుఁ దేల్చుచు, బలిమిచే జీరి తోలఁగుచు,
మఱలుచు, సర్ధుకొని పట్టుచు బాధించు చుండెనని
తాత్పర్యము.

రహ॥ - కామము - ఇంద్రజిత్తువలెఁ బొడగానంబడక,
దాఁకొను సమయమున జీవుఁడు బంధవిముక్తికొ
ఱకు " భవసుఖే దోషోనుసంధీయతాం ఆత్మేచ్ఛా
వ్యవసీయతాం నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతాం "
జన్మసుఖ మందలి దోషమును జ్ఞప్తికిఁ దెచ్చుకొని
యాత్మానుసంధానము నభ్యసించి తత్క్షణమేగృహ
మును విడిచి వెడల వలయును. అను విధివాక్య
ముచొప్పున జీవుఁడు పై కేగునపుడడ్డమై కామాభి
లాషయందుఁ జిత్తమును ప్రేరేపించును " ఏకం

సాఖ్యంచ యోగంచ ” సాంఖ్య యోగముల యొక్క గమ్యస్థాన మొక్కటియే, కావునఁ దద్రూప పాదములను బెనవేసి పట్టి “ యత్రికుంఠి భవేద్బుద్ధిః సమోహ ఇతికధ్యతే ” యెచ్చట బుద్ధి (కదలక) కుంఠీభవించునో, యదియె మోహము, అట్టి మోహము నందుముంచి.

“కృతంమయాధికంపుణ్యమ్ * యజ్ఞదానాదినిశ్చితం
స్వర్గంగత్వాసుఖంభోక్షే*ఇతిసంకల్పవాన్ భవేత్ ”

తా॥ నాచే బుణ్యమధికముగాఁ జేయఁబడినది స్వర్గమునకేగి సుఖము ననుభవించెద నను తలంపులు గలుగునటు లూర్ధ్వాధోలోకములఁ ద్రిప్పు, నొకపరి నంధతామిశ్రమునకుఁ ద్రోయుచుఁ గామము జీవుని బాధించు చుండెనని తాత్పర్యము.

వ॥ ఇట్లు విస్మిత నక్ర చక్రంబయి నిర్వక్ర విక్రమంబున నల్ప హృదయజ్ఞానదీపంబు నతిక్రమించు మహామాయాంధకారంబు నుం బోలె నంతకంతకు నుత్సాహ కలహసన్నాహబహు విధ జలావగాహంబయిన గ్రాహంబు మహాసాహసంబు నంబోరె మఱియు.

బాహ్యా॥ - ఈ రీతిని, యచ్చెరువందుచున్న నక్రబృందముఁగల దైయపరిహతమైన బలముచే నల్పజ్ఞుని జ్ఞానదీపము నాచ్ఛాదించు మహామాయాంధకార

మువడువునఁ గ్రమ క్రమంబున జయోత్సాహముఁ గలిగి యుద్ధసామాగ్రి ( బలము ) నిమిత్తమై యోజించి పెక్కు విధములమునుఁగుచున్న నక్రము సాహసించి పోరెను.

రహ॥ - ఈ రీతినిఁ గామము విస్మిత ( ఆశ్చర్య ) మయి, వీక్షించు చున్న యజ్ఞాన భూమికాది వ్యూహము కలదై. దుర్విషయ సంకల్పబలముచే గించిజ్జుని జ్ఞానంబు నావరించు మహామోహాంధకారంబు నుంబోలెఁ గామము పోరెనని తాత్పర్యము.

అజ్ఞాన భూమికలు. — 1 బీజజాగ్రము 2 జాగ్రము 3 మహాజాగ్రము 4 జాగ్రత్స్వప్నము 5 స్వప్నము 6 స్వప్నజాగ్రము 7 సుషుప్తి

శా॥ పాదద్వంద్వము నేలమోపి పవనుం*బంధించి పంచేంద్రియో
న్మాదంబుల్ బరిమార్చి బుద్ధిలతకు * న్మాలాకుహాత్రించి, ని
ష్ఖేదబ్రహ్మ పదావలంబనగతిం - గ్రీడించు యోగీంద్రు, మ
ర్యాదన్ నక్రి, మతిక్రమించెఁగరిపా * దాక్రాంతినిర్వక్రియై

బాహ్య॥ - ఈ యోగ సంభృత ప్రార్థన గజేంద్రకృతముఁగాదు. మఱేమనగా, మొసలి పూర్వభవమున నొక గాంధర్వుఁడు, దేవలుఁడను వాని శాపవశంబున నిట్లు కరి రూపము ధరించినను "పూర్వాభ్యా

సేనతేనై వహ్రియతేహ్యవ శోపిసః" అవశుండై పూర్వాభ్యాసము ( వాసన ) చే నాకర్షింపఁబడు చున్నాడు. కదా ! యను గీతావచనము చొప్పున జ్ఞానముఁ గలిగి మకరి యోగావలంబకుండై యుండె నెటులనగా ;- మొసలి ముందు పాదములచే నిలువంబడి నియమిత ప్రాణియై, జ్ఞానేంద్రియ పంచకోన్మాదంబు నశింప ( ప్రత్యాహారము ) జేసి, బుద్ధిలతను సమాధియను పందిలికిఁ బ్రాకుటకుఁ బ్రాకుడు కొయ్యకు హత్తించి ( తగిల్చి ) లేక బుద్ధిని స్థిరముగా నిల్పి "దుఃఖ సంయోగ వియోగం సంజ్ఞితం" దుఃఖముతో సంయోగ రహితయోగ మనగా బ్రహ్మ సుఖము, తదవలంబనముఁ బొందుటచే నానందించు యోగీంద్రుని విధమున, శింశుమారము, వారణపతి పాదములను బట్టుటయందు నిరవధికమై యుండెనని తాత్పర్యము ( శింశుమారము - మొసలి )

రహా॥ - మొసలినిఁ గామముగాఁ బోల్చినపుడు మొసలి యోగావలంబన మొనర్చుట విరుద్ధముకదా ? యను సంశయముఁ గలుగవచ్చును. గాని, పూర్వవాసనయనగా "అనాది కామోయమ హంస్వభావః" యీ యహంస్వభావ మనాదియగు కామమగును. అహంకారము, ముఖ్యమనియు, గౌణ

మనియుఁ, దుచ్ఛమనియుఁ ద్రివిధమందు ముఖ్యమహంబ్రహ్మాస్మియనియు, గౌణమహంజీవఃయనియుఁ దుచ్ఛమహం దేహః యనియు శ్రుతియుక్తము "సఐక్షత బహుస్యాం ప్రజాయే యేతి" అనేక రూపములై పుట్టుదునని యాపరమాత్మ సంకల్పించె నట్టి ప్రథమ సంకల్పాహంకార మనాదికామమగును అహంబ్రహ్మాస్మియను పూర్వవాసనయే కామమునకు స్వస్థానము. బ్రహ్మమునుగూర్చి యోగావలంబనముఁ జేసెనని భావమెటులనగా "పాదద్వంద్వము నేల మోపి" యిదియొక యాసనము. మఱియొక విధము. శ్రీ, యుపాసనా పరులు, బాల, త్రిపురసుందరీ, రాజరాజేశ్వరీ, యను దేవతా మంత్రసిద్ధి, యనంతరముఁ బాదుకాంతమని తురీయము. ప్రకృతి పురుషులొకే స్వరూపమని జపించుట "పాదుకాంతము" దానినే పాదద్వంద్వమనియు దేవాలయములలో భక్తుల శిరస్సులపై నుంచు పాదుకలు (శఠగోపమని) వచింతురు. కావుననట్టి పాదద్వంద్వము, (శివశక్తి సమ్మేళన) బ్రహ్మను సంధానార్థమైన యాసనముచే నిలువంబడి పవనుని బంధించి.

శ్రు॥ పవనోబధ్యతేయేన * మనస్తే నైవబధ్యతే
మనశ్చ బధ్యతేయేన * పవనస్తేనవ బధ్యతే

తా॥ వాయు, వెవనిచే నిరోధింపఁబడునో, మనస్సు వానిచేతనే యవరోధమగును, ఎవనిచే మనోనిర్బంధమగునో, వానిచేతనే వాయువు నిర్బంధింపఁబడును. అను శ్రుతి చొప్పున నట్లు మనో నిగ్రహముఁజేసి. " పంచేంద్రియోన్మాదంబుంబరిమార్చి " శ్రు॥ ఇంద్రియాణి హయాన్యాహు విషయాం స్తేషుగోచరాః" విషయముల వెంబడి పరిధావన మొనర్చు యింద్రియ హయములను మఱలించి, బుద్ధిలతకుఁ మాఱాకు, హత్తించి " విద్యాత్మ వృత్తిశ్చరమేతి భణ్యతే " ఆత్మయొక్క యావరణ భంగముఁజేయు చరమవృత్తి, జ్ఞానమను ప్రాకుడురాట (కంచె) కు, బుద్ధి లతను, హత్తించి – అంటఁగలిపి, ( వృత్తి బ్రహ్మాకారముఁజేసి ) మఱియొక విధముగా నర్థము, "మా" యను వర్ణబీజమును "రా" యను వర్ణబీజమునకుఁ జేర్చి, అనగా రామమంత్రజపితయై 'తారకంబుమనశ్శుద్ధికిఁ గారకంబు' మంత్రమహిమ యెట్లన శ్లో॥ ధర్మమార్గం చరితేన – జ్ఞానమార్గం చనామతః – తథాధ్యానేన వైరాగ్యం ఐశ్వర్యం తస్యపూజనాత్॥

రామ కథనము వలన ధర్మమార్గమును, నామము వలన జ్ఞానమును ధ్యానము వలన వైరాగ్యమును పూజనము వలన నైశ్వర్యమును గలుగును * (ఇం

శ్లోక పక్షము) "రామేతి వర్ణద్వయమాదరేణ సదాస్మరన్ - ముక్తిముపైతిజంతుః కలౌయుగే కల్మషమానుషాణా మన్యత్రిధర్మేఖలునాధికారః" రామ మంత్రము నిరంతరము మన్ననతో జపించిన యెడలఁ బురుషుఁడు ముక్తిఁబొందుచున్నాఁడు. కలుషచిత్తులకుఁ గలియుగమందింతకుమించిన యధికారము లేదు.

శ్లో॥ నామ్నాం సహస్రం దివ్యానాం * స్మరణేయత్ఫలం లభేత్
తత్ఫలం లభతేనూనం * రామోచ్చారణమాత్రతః

తా॥ విష్ణు నామసహస్రముఁ బారాయణము జేసిన మహాఫలము, రామ నామ స్మరణ మొకపరిఁ జేయుట వలనఁ గలుఁగును.

శ్రు॥ ముముక్షూణాం విరక్తానాం * తథాచాశ్రమవాసినాం
ప్రణవత్వా త్సవిజ్ఞేయో * యతీనాంచ విశేషతః
రామమంత్రార్థ విజ్ఞానీ * జీవన్ముక్తో నసంశయః॥

ముముక్షువులకును, వైరాగ్యవంతులకును, గృహస్థాది యాశ్రమస్థులకును, యతీశ్వరులకును, రామమంత్రము ప్రణవము కంటె విశేషమని తెలిసి జపించవలెను. రామ మంత్రార్థము నెలియువాఁడు, జీవన్ముక్తుఁడగును.

శ్లో॥ శివపంచాక్షరీశైవే * మంత్రజాతే ప్రశస్యతే
నారాయణాష్టాక్షరీతు * వైష్ణవేష్వలి శిష్యతే॥
రా'కారో వైష్ణవే గ్రాహ్యః*మకారో శైవసంగ్రహః
రామేత్యక్షరయుగ్మంతు * శైవవైష్ణవ సారవత్॥

తా॥ శైవులకు "నమఃశివాయ" మరియు, వైష్ణవులకు "ఓం నమోనారాయణాయ" యను మంత్రములు ప్రశస్తతరములై యున్నవి. పంచాక్షరీలోని "మ" వర్ణమును, నారాయణాష్టాక్షరీలోని "రేఫ" రా యను బీజమునుగలసి, రామ మంత్రమైనది. యనగా శైవ వైష్ణవ మంత్రముల లోని సారమును గ్రహింపఁ బడినదని తాత్పర్యము ఇఁక రామమంత్రమహిమనుగూర్చి యట్లుండనిండు పద్యార్థమును గ్రహింతము, మాఱాకుహత్తించి" అను పదమునకు వేఱొక పక్షము "మరోర్భావః మారు" మన్మథ సంబంధమనగా సంకల్పమును" "ఆకుహత్తించి" "అ" యనగా బ్రహము "ఆ" యనగా బ్రహ్మాకారముఁ సంకల్పమును బ్రహ్మాపరము జేసి (యింకొక పక్షము) "రాచేతి లక్ష్మీ వచనో మశ్చాపీశ్వరవాచకః లక్ష్మీ పతింగతిం రామం ప్రవదంతి మనీషిణః" "రా" యను బీజము, శక్తి (లక్ష్మీ) బీజమనియుఁ "మ" యను బీజము, శివ బీజమనియు రామ మంత్రము శివ

శక్తి సమ్మేళన మనియు నట్లు సమ్మేళనము గాని చో మంత్రమే కాదనియుఁ, గావున, రామ మంత్ర ము శివశక్తి సమ్మేళన మనియు నట్టి రాముఁడే యీశ్వరుఁడనియు నతండే సర్వజీవులకు గతి యని యుఁ బండితులు వక్కాణించు చున్నారు. (ఇంకొ కపక్షము ) రా ( ః ) శబ్దము అనగా బ్రీణవ మును, " మ " యనగా, " మా స్మమాలంచవా రణే " నివారణార్థము. ఓం కార మనగాఁ బ్రణ వమును, గోరక. బ్రీణవార్థమునుఁ ( బ్రహ్మము ( నే గోరుము, (మఱియొక విధము) రాః, ధనమును " మా " నివారించి యనగా ధనమును గోరక .

శ్లో॥ అర్థమనర్థం భావయనిత్యం * నాస్తితతస్సుఖలేశస్సత్యమ్

ధనము, అనర్థ హేతువనియు నందువల్ల సుఖము లేశమైనను లేదనియు మఱియొక విధము - రా - యనగా - రాగమును - మా - నివారణార్థము - అనగా - రాగమును గోరక, విరాగియై యుండి

శ్లో॥ జ్ఞాతం తవప్రసాదేన సర్వమే తదశేషతః -
నవైరాగ్యత్ఫలంభాగ్యం నసంసారాత్పరోరిపుః॥

ఓ మునిచంద్రమా ! మీ యనుగ్రహము వఁ న వేదాంతశాస్త్రము సవిశేషముగా బోధపడినది యెట్లన ? వైరాగ్యమువంటి భాగ్యము లేదనియు

సంసారమువంటి శత్రువు లేదనియు నిట్లు హా త్తించి "నిక్షేపదబ్రహ్మ పదావలంబన గతిః" "తంవి ద్యా దుఃఖ సంయోగ వియోగం యోగసంజ్ఞితం"

సంసార దుఃఖ సంయోగరహితమగు యోగమే బ్రహ్మ సుఖము, అట్టి బ్రహ్మ పదావలంబనచే నానందించు యోగీంద్రుని మాఁడ్కిఁ గాముము, జీవపాదములగు ఆనంద పాదము, తురీయ పాదము (సుషుప్తి తురీయావస్థల) నిరాతంకముగా నాక్రమించి నిర్భయముగా నుండెనని తాత్పర్యము.

ఆ॥ వె॥ వనగజంబు నెగచు * వనచారిఁ బొడఁగని
వనగజంబకాన * వజ్రిగజము
వెల్ల నైసురేంద్రు * వేచి సుధాంధులు
పట్టఁ బట్టనీక * బయలుఁ ప్రాఁకె

బాహ్య - గజమును బాధించు చున్న మొసలినిఁ జూచి ఐరావతముగూడ నీటి (పా ల స ము ద్ర ము) లోనఁబుట్టిన దగుటచే నీటిలోనున్న మొడల బాధించునని భయమునొంది వెల వెలఁబోయి తెల్లనై దేవతులను దప్పించుకొని (యింద్రుని కొఱకు వేచి) నిరీక్షించి దిగంతమునకు నెగబ్రాకెను -
(స్వభావాలంకారము)

హ॥ – జీవుని బాధించు చున్న కామమును జూచి ఇంద్రుని గజము - సూర్యాంతర్గతర్జ్యోతి —

అమూర్త స్వరూపము కూటస్థుఁడు తానుగూడ శుద్ధ సంకల్ప వాసనా నందమయుఁ డగుటచే సంకల్ప జల జనిత కామము తననుగూడ బాదించునేమోయని భయపడి శుద్ధసాత్వికవర్ణమై ఫల ప్రయచ్ఛ దేవతుల కందక, నంతరిక్షమునకు "ఆకాశవ త్సర్వ శరీర ఆత్మానదృశ్యతే వాయువదంతరాత్మా" సర్వశరీర ములయందు నాకాశము వలె నంతరాత్మయదృశ్యమైయున్నది. కావున, బయలనగాఁ బరమాత్మ కడకు నారోహితమయ్యె [ప్రాకె] నని తాత్పర్యము [ఇంద్రుఁడు — సూర్యుఁడు]

ఉ॥ ఊహ గలంగి జీవనపు * టోలమునంబడి పోరుచున్ మహా
మోహలతా నిబద్ధపద * మున్ విడిపించు కొనంగ లేకసం
దేహముఁ బొందు దేహి క్రియ * దీనదశన్ గజ ముండె భీషణ
గ్రాహ దురంత దంతపరి * ఘట్టిత పాదఖురాగ్ర శల్యమై

భావ్యా॥ - గజముయొక్క స్థితిని సంసృతి [సంసారము] చే బీడింపఁ బడిన, గృహస్థునివలెఁ బోల్చి చెప్పు చున్నాఁ డెట్లనగాఁ, బెక్కు సంకల్పములచే, చిత్త చాంచల్యముఁగలిగి కుటుంబ రక్షణార్థమయి పెక్కు ప్రయత్నములు సేయుచు మోహములనుండి విడి వడ సమర్థుండుగాక, సంశయాత్ముఁడగు గృహస్థుని వడువున, మొసలి యొక్క విశాల కరాళదంత ములచే దృఢముగాఁ బట్టువడి శల్యావశిష్టమగు

డెక్కలతోఁ గూడిన పాదములు కలదియై ఖిన్నత చే గజముండెనని తాత్పర్యము. (కరాళ - భయం కరమగు )

రహా॥ - జీవుఁడవిద్యా కార్యమగు కామ పరవశుఁడై యూహలు ( గొంతెమ్మ కోర్కెలు ) చేఁ గలత నొంది జీవనపుటోలము * జనన మరణ ప్రవాహ మునంబడి, యనగా, " కృతంమయాధికం పుణ్యాం యజ్ఞదానాది నిశ్చితం- స్వర్గంగత్వాసుఖం భోక్ష్యే ఇతిసంకల్పవాన్ భవేత్ " యజ్ఞదానాదికములచే గల్గు పుణ్యము నాచరించితిని, స్వర్గసుఖము ననుభ వించెదనని సంకల్పించు చున్నాడు. ఇటు, లు పాధి గతుఁడైన జీవుఁడసంఖ్యాకము లైన జన్మ ము లొందుచున్నాడు (శ్రు॥ నానాయోని సహస్రాణి దృష్ట్వాచైవ తతోమయా - ఆహారావివిధాభుక్తాః పీతాశ్చవివిధా స్తనాః॥" వేలకొలఁది జన్మములెత్తి తిని, వివిధములగు స్తన్యపానములనుజేసి, యాహా రములను గ్రహించితిని, యిట్టి జనన మరణ ప్రవా హామునంబడి, పొరుచుండియు, ( దుఃఖించుచుం డియు ) " మహామోహాలతానిబద్ధ పథము న్విడి పించుకొనంగ లేక " "మోహాంధకార భయకూప నిపాతి తస్య" మోహాము - స్వపరజ్ఞాన విహీనాంధ కార కూపము. " శ్లో॥ అగాధేత్రి సంసార పంకేని

మగ్నం - కళత్రాదిభారేణ, ఖిన్నంనితాంతం - మహామోహపాశౌఘబద్ధం చిరాన్మాం సముద్ధర్తు మంబత్వ మేకైవశక్తా॥" అగాధమైన సంసార పంకమునందుఁగూరుకుపోయి కళత్రాది సంరక్షణ భారముచే, ఖిన్నుఁడనై మోహపాశములచే బద్ధుఁ డనగు నన్ను రక్షించుటకు నీవే తగుదువు తల్లీ !

శ్లో॥ అహంకారసుతంవిత్త * భ్రాతరం మోహమందిరం
ఆశాంపత్నీంత్యజేద్యా వ* త్తావన్ముక్తోనసంశయః॥

తా॥ అహంకారమే పుత్రుఁడు, ధనమే సోదరుఁడు. మోహమే మందిరము, ఆశయే పత్నిగా గల యీ యంతస్సంసారము నెంతవఱకు విడువఁడో, యంత దనుక ముక్తినొందఁడు. అనగా నెప్పుడు విడుచునో యపుడే ముక్తికలుగును, సంశయము లేదు.

శ్లో॥ యదాతే మోహకలిలం * బుద్ధిర్వ్యతి తరిష్యతి
తదాగంతాసి నిర్వేదం * శ్రోతవ్యస్య శ్రుతస్యచ.

తా॥ ఎపుడు నీ ( అర్జునుని ) బుద్ధి మోహకాలుష్యముఁ బొందక యుండునో, యపుడే వైరాగ్యమునొంది యిదివఱకు విన్నదానికి నిట్టుపైన వినవలసినదా నికిని ఫలమును బొందుదువిట్లు పెక్కులు శ్రుతి స్మృతీతిహాసములు మోహమే సంసృతి హేతువ గునని. నిర్దిష్టితమైయున్నవి. కావున నట్టి మోహ లతాబద్ధుఁడై సందేహస్పదుఁడైన గృహస్థ

వలె, భయంకరమగు కామము యొక్క దుస్సం
కల్ప వికల్పములగు దంతములచే జీవునియొక్క
వైరాగ్యాది పాదముల, శల్యావశిష్టమగునట్లు,
కామముచే జీవుఁడు గ్రహింపఁబడి యుండెనని
తాత్పర్యము.

వ॥ ఇవ్విధంబున.

కం॥ అలయక సొలయక వేసట
నొలయక కరి మకరితోడ ♦ నుద్దండతరా
త్రులు సంధ్యలు దివసంబులు
సలిపెంబోరొక్క వేయి ♦ సంవత్సరముల్

బాహ్య॥ అలసట — విముఖతఁ జెందక, శ్రమనొందక
నీరీతి గంజేంద్రుఁడు, మొసలితోడ రాత్రింబవళ్లు,
వేయి సంవత్సరములు పోరాటము సలిపెను.

రహ॥ జీవుఁడు కామముతోడ వేయి సంవత్సరము లనగా అనేక జన్మల
యందు విముఖతఁ జెందక పోరాడెనని భావము.

॥ పృథుశక్తిఁ గజము జలగ్రాహముతోఁ * బెక్కేం
డ్లు పోరాడి, సం
శిథిలంబై తనలావు వైరిబలముం * జింతించి
మిథ్యామనో
రథమింకేటికి దీని గెల్వసరిపో * రంజాల
రాదంచు, స
వ్యథమై యిట్లనుఁ బూర్వపుణ్యఫలది * వ్యజ్ఞాన
సంపత్తితోఁ

బాహ్య॥ ద్విరదము నీరాటముతోఁ బెక్కు హాయనంబులు, సమర మొనరించి, క్షీణించిన బలముఁ గలదియై స్వపరబలాబలములఁ దలపోసి, గెల్చుట వ్యర్థమనో రాజ్యమని పూర్వపుణ్య భాగ్యముచే బాధను సరకుఁ జేయక తనలో నిట్లు చింతించెను,

రహ॥ జీవుఁడు, కామముతో నధిక కాలము [అనేక జన్మలు] పోరి జితుఁడై, సాధించుట యసాధ్యమని యెంచి. కామము మోహబీజ సంజనితంబని, నిస్పృహుండై, పూర్వసద్వాసనా జనిత పుణ్యవశమున నిట్లు చింతించెను.

విను మోహబీజ సంజనితంబు కామంబు

శా॥ ఏరూపంబునదీని గెల్తునిటమీ* దేవేల్పుఁజింతింతు, నె
వ్వారింజీరుదు నెవ్వరడ్డమిఁక, ని* వ్వారిప్రచారో
త్తమున్
వారింపందగు వారలెవ్వరఖిల * వ్యాపార పారా
యణుల్
లేరేమొ్రక్కెద దిక్కుమాలిన మొఱా * లింపం
బ్రపుణ్యాత్మకుల్

బాహ్య॥ - ఇమ్మకరము నెట్లు నిగ్రహించుట - యింక నే దైవమునుఁ బ్రార్థింతు, నెవరింగూర్చి ఘోషింతును, సమస్తవ్యవహారన్యాయాన్యాయాంతములను వీక్షించువారు లేరా ? మొ్రక్కెదనని పూర్వజ్ఞాన వాసనాబలముచే నిట్లు తలపోసెను,

రహ॥ ఇక్రమము నే రూపము ( మార్గము ) చే ననగాఁ గర్మ భక్తి, జ్ఞాన, మార్గములలో దేనిచే గెలిచెద ననగా

గీ॥ రాజులైననుఁ బుడమి రా ♦ రాజులైన
యోగులైనను, దివి మహా ♦ భోగులైన
నిష్టులైనను, న్యాయ ప్రి ♦ విష్టులైన
స్త్రీల పాదంబులకును, దా ♦ సీలుగారె॥

తా॥ కావునఁ గామోద్రేకమువలన యోగములు: బల. వియోగమగుటచేఁ గామమును గెలువఁ జాలరని భావము - ఇటమీద నేవేలుపును జింతింతు "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛే ద్ధనమిచ్ఛే ద్ధుతాశనాత్ - ఐశ్వర్యమీశ్వరాదిచ్ఛేత్ - మోక్షమిచ్ఛే జనార్దనాత్" ఆరోగ్యము - ధనము -ఐశ్వర్యము మోక్షమును గోరువారలు, సూర్య, అగ్ని - యీశ్వర - జనార్దనులను, యథాక్రమంబున, గోరవలయును.

శ్లో॥ క్షిప్రంహిమానుషేలోకే * సిద్ధిర్భవతి కర్మజా
అంతవత్తుఫలంతేషాం * తద్భవత్యల్పమేధసాం
దేవాం దేవయజోయాంతి * మద్భక్తాయాంతి
మామపి

తా॥ మనుష్య లోకమందలి ఫలసిద్ధులు తూర్ణముగా సిద్ధించునుగాని, ఫలముగూడ కొలది కాలమే యుండును. కావున, నేవేల్పును జింతింతుననగా

ఫలాపేక్షరహితుఁడనై, మోక్షము [కామవిముక్తి] కొఱకు నీశ్వరుని భక్తితో నారాధింతునని యాశయము, సర్వవ్యాపక శీలుఁడగు శ్రీమహావిష్ణువు లేడాయని జీవుఁడు ప్రార్థించు చున్నాడు.

శా॥ నానానేక పయూథముల్ వనములో * నం బెద్దకాలంబు, స
న్మానింపన్ దశలక్ష కోటి కరణీ * నాథుండనై యుండి,
ధ్వానాంభః పరిపూర్ణ చందన లతాం * తచ్ఛాలందు
క్షీనీరాశని వేలవచ్చితిభయం*బెట్లోక దేయీశ్వ

బాహ్య॥ మఱియుఁ బశ్చాత్తాప హృదయుఁడై ఁ యిట్లు చింతించెను. అసంఖ్యాకములగు దంతి ప్రభువునై యూథపములచే బహూకరింపఁ మదీయ మదజల సించనముచే. బూర్ణముగా ఁ మైన చందనద్రుమ సంయుక్త లతాఛాయలఁ డక, పిపాసచే, నీ జలాశయంబున కేల యరుచితిని, భయంబయ్యె నేమి కానున్నదో, కదా దైవమా! యని చింతాక్రాంతయై యుండెను.
( బహూకరించు - గౌరవము సేయు )

రహ॥ "ప్రత్యగ్వస్తుని నిస్తరంగ సహజానందావబోధాబుధౌ" తరంగరహిత స్వరూపానంద జలధియ

దనగాఁ బ్రత్యగాత్మ స్వరూపులగు, జీవన్ముక్త - విదేహముక్తబ్రహ్మవిద్వరః, వశిష్ఠాదిసమూహముల చే, సేవింపఁబడి, జీవకోటుల కధిష్ఠాన చైతన్యుఁడనై యుండి, చందన సదృశసద్వాసనాయుక్తబ్రహ్మాకార వృత్తులతోఁ గూడిన సమాధియందుండక ననగా.

శ్లో॥ ఏకో దేవః సర్వభూతేషు గూఢః
సర్వవ్యాపీ సర్వభూతాంతరాత్మా
కర్మాధ్యక్షః సర్వభూతైకవాసో
సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ ॥

| | |
|---|---|
| దేవు లెందరు ? | - ఏకః - ఒక్కఁడే |
| కనఁబడఁడేమి ? | - సర్వభూతేషుగూఢః - భూతములందుగూఢముగా నున్నాఁడు. |
| రహస్యముగా నున్న యెడల దేవుఁడెట్లగను? | - సర్వవ్యాపీ - సర్వవ్యాపకుఁడు. |
| వ్యాపకుఁడైతే, దృగ్గోచరుఁడు కాఁడేమి ? | - సర్వభూతాంతరాత్మ * అంతరాత్మయై యున్నాఁడు ( యెవని ముఖము వానికి గోచరించనటు లంతరాత్మయగు తన స్వరూప మెట్లుగోచరించును |

కర్మ ప్రేరకుఁడా ? - కాదు. కర్మాధ్యక్షః -
అధ్యక్షుఁడనగా - ఫలదాత
ఏయే భూతములందు - సర్వభూతైకవాసః - సర్వ
న్నవాఁడు ? భూతముల యందాత్మరూప
మున, నహంవృత్తిచే ను
న్నాఁడు, వాసుదేవుఁడు.

అయితే సుఖ దుఃఖ - కాదు - సాక్షీ - చేతా -
వంతుడా ? తటస్థుఁడు; చేతనుఁడు
సాధారణుఁడా ? కాదు; కేవలుఁడు - ముఖ్యమైనవాఁడు.
గుణవంతుఁడా? - కాదు, నిర్గుణశ్చ - నిర్గుణుఁడు.

కావున నిట్టి సహజానందస్వరూప మందుండక, మృగ తృష్ణను జలంబని భ్రమయు హరిణము చాడ్పున, దుస్సంకల్ప వశోపాధిచే, నిమ్నోసరో వరమున కేల యేతెంచితిని ? యెన్నిజన్మముల నెత్తనలసి యున్నదో కదా ! దైవమా ! యని చింతించెను. (వివరణ) మనో సరస్సనగా - సంసారము, తత్సుఖము లాభాసములు " నిత్యంకింథావసిచల విషయా ననుభవితుం - సుఖలేశా భాసానురుతరదుఃఖాః ఓ చిత్తమా ! సుఖ లేశముల యొక్క ప్రతిబింబములును, దుఃఖ ప్రదములును చలన శీలములునగు, విషయముల ననుభవించుట కేలపరుఁగు లిడుచున్నావు !

శ్లో॥ భోగామేఘ వితానస్థో * విద్యుల్లేఖేవ చంచలా
ఆయురప్యగ్ని సంతప్త * లోహస్త జలబిందువత్

తా॥ భోగములు, మేఘముల నెడుం చాందినీయందలం కరింపంబడిన, విద్యుల్లత మెరుపుతీవ వలె నతి చంచలములు, ఆయు వన్ననో, దగ్ధాయః పిండస్థ జల బిందువు వంటిది. చిరస్థాయి కాదని భావము. కావున నిట్టి దుఃఖ భాజనమగు సరస్సున కేలయరు గుదెంచితినని జీవుండు, నిశ్చేష్టుండై యేమియుం దోంచక మొఱ లిడుచుండెనని తాత్పర్యము

ఉ॥ ఎవ్వనిచే జనించు జగ * మెవ్వనిలోపలనుండు లీనమై
యెవ్వనియందు డిందుం బర * మేశ్వరుం డెవ్వండు, సర్వము దానయైనవాం
డెవ్వండు, వానినాత్మభవు * నీశ్వరునే శరణంబు వేడెదన్

తా॥ సకల భువనసృష్టిలయ నియామకత్వంబులును, ఉపాదాన కారణత్వమును. అది మధ్యాంత రహిత త్వమును, సర్వనామ రూపత్వ మెవ్వనిచే ధరింపం బడుచున్నదో. యట్టి యీశ్వరుని శరణుంజొచ్చు చున్నాను.

రహ॥ "ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపలనుండు లీనమయి".
శ్రు॥ యతోవా ఇమాని భూతాని జాయంతే, యేనజాతాని జీవంతి

యత్ప్రయంత్యభి నంవిశంతీతి - ఈ భూతము లెవని వలన నుత్పత్తియై వృద్ధిఁబొంది, తరంగములవలె నెవనియందు లీన మగుచున్నవో.

శ్లో॥ జన్మాద్యస్య యతోऽన్వయాది తరతశ్చార్థేష్వభిజ్ఞ స్వరాట్ ॥

తా॥ ఆభాసితములగు సర్వపదార్థములయం దన్వయవ్యతిరేకములచే నే స్వయంప్రకాశమానుఁడు. ప్రత్యభిజ్ఞుఁ (తెలియఁబడ్డ వాఁ) డగు చున్నాఁడో, యన్వయమనగా నన్నమయాది కోశములయందును. "సూత్రేమణిగణా ఇవ" అనునటు లంతర్యామియై యుండుట, వ్యతిరేకమనగాఁ బృథగ్విధమునై యుండు కోశాదులం దవచ్ఛేదముగా నుండుట - యాభాస వాదమనగాఁ బ్రతిబింబవాదము. అవచ్ఛేదవాదమనగా వ్యవహారోపయోగము లేనిస్థితి-స్థంభము - ఆయి మున్నగునవి. మూలకారణుఁ డనగా "మూలప్రకృత్యామే వాసౌనిర్గుణః ప్రతిబింబితః" మూలప్రకృతియందే నిర్గుణుఁడగు పరమాత్మ ప్రతిబింబించెనో యట్టి యీశ్వరుని శరణు జొచ్చెదనని తాత్పర్యము.

కం॥ ఒక పరిజగములు వెలినిడి
యొకపరి లోపలికిఁ, గొనుచు ♦ నుభయముఁదానై
సకలార్థ సాక్షియగు, న
య్యకలంకుని నాత్మమూలు ♦ నర్థిఁ దలంతున్॥

తా॥ సృష్టి కాలమం దింద్రజాలికునివలె భువనములు-దర్పణ ప్రతిబింబితములైనటులు వెలికిఁజూపి ప్రళయకాలమందుఁ దనయందు లయపఱ్చుకొనుచుఁ దరంగ విజృంభణోప సంహారములుఁ (పెరుఁగుట విరుఁగుట ) లు, సముద్రమే యైనటు, లుభయము దానై, సకలవిషయములకు సాక్షియై, శుద్ధసత్వస్వరూపుఁడు, నాత్మకు నధిష్ఠానమునగు పరమాత్మ్మని ధ్యానించెదను.

రహ॥ ఒక పరిజగముల వెలినిడి; " ముఖాభాసకోదర్పణే దృశ్యమానో ఖత్వాత్ప్రిధక్త్వేన నైవాస్తివస్తు ణతా దర్పణ ప్రతిబింబము. తన ముఖముకంటె వేరు వస్తువు కానటుల యథాదర్పణాభావ, "ఆభాస హానౌముఖం విద్యతే కల్పనా హీనమేకం " దర్పణము లేకపోవుచుండఁగా నాభాసము – ముఖ ప్రతిబింబిత మెటుల నభావమో, భావా భావము, లుభయముఁదానే. యగునో, లేక, " ఊర్ణనాభిర్యథాతం తూక్ స్పృజతే సంహరత్యపి – జాగ్రత్స్వప్నేతథా జీవోగచ్ఛత్యా గచ్ఛతేపునః॥ " సాలిపురువు తంతువులను సృజించి మఱలఁ దనలోనికి నుపసంహరించు చున్నదో, యట్లే పారమార్థిక జీవుఁడు జాగ్రత్స్వప్నములను సృష్టించి, యుపసంహరించు చున్నాడయిననుఁ దానొక్కరుఁడే

యగునో, సర్వసాక్షి "మనసః సాక్షీబుద్ధేః సాక్షీ - ప్రాణస్యదృష్టాతమసోద్రష్టా" అను శ్రుతి చెప్పిన నూర్యునివలెసర్వసాక్షి యగుచున్నాడో మరియు "విశ్వం దర్పణదృశ్యమానవగరీతుల్యం నిజాంతర్గతం - పశ్యన్ ఆత్మ నిమాయయా బహి రివోద్భూతం యథానిద్రియా - యస్సాక్షీకురుతే ప్రబోధ సమయే - ఆత్మానమే వాద్వయం - తస్మై శ్రీ గురుమూర్తయే నమఇదం శ్రీ దక్షిణా మూర్తయే" దర్పణ ప్రతిబింబ తుల్యము (ఆభాస) గాఁ దనలోనుండు విశ్వమును స్వప్నమునందు, మాయాస్వరూపమగు నిద్రాశక్తిచే సత్యమైన నగ రమువలెఁ బ్రత్యక్షముగా దృశ్యమై, ప్రబోధ (మెలకువ) గలిగిన తోడనే స్వప్నమునకు సా క్షియై, యద్వయాత్మగాఁ దానొక్కఁడే శేషింపఁ బడుచున్న గురుమూర్తి ((శ్రీ) శంకర స్వరూపదక్షి ణామూర్తికొఱకు నమస్కారము) కావున నట్టి సాక్షినిఁ గొల్తునని యభిప్రాయము.

కం॥ లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁదుది, న లోకంబగు, పెం
జీఁకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుఁగునతని నే సేవింతున్

తా॥ ప్రళయాంతమందు స్థితమగువాని వర్ణించు చున్నా

డెటులన భువనములుఁ దత్పరిపాలనంబును, దద్గత జంతువులును నశించిన పిదపఁ బెంజీఁకటి కావలనే కాకియై పరికాశించు, నిషేధావశిష్టుఁడగు వికారరహితుని సేవించెదను.

రహ॥ లోకములనగా సూక్ష్మభూత పంచీకరణములోని గోళకములు బ్రహ్మాండ (స్థూల) పంచీకరణము "బ్రహ్మణోరవ్యక్తం. అవ్యక్తాత్ మహః మహతః పంచతన్మాత్రాణి – పంచతన్మాత్రేభ్యో – పంచ భూతాని పంచభూతేభ్యో మహాభువనాని" బ్రహ్మ మువలన నవ్యక్తము [ప్రకృతి లేక మాయ] అవ్యక్తము వలన మహత్తత్వము దానివలనఁ బంచ తన్మాత్ర [శబ్దాది విషయములు] లు, వాటివలన బ్రహ్మాండములును సృజింపఁ బడినవి, దీనిని యను లోమమందురు. [క్రిందికి దిగుట] సూక్ష్మ పంచీకరణము, సత్వరజస్తమోగుణములచేఁ బంచ భూతములను విభజించి పంచీకరించఁగా.

సత్వ – సమష్టివలన నంతఃకరణ చతుష్టయము – [మనోబుద్ధి చిత్తాహంకారములు]

సత్వవ్యష్టివలన – జ్ఞానేంద్రియ పంచకము – (త్వక్చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణములు) రజోసమష్టివలన – ప్రాణపంచకము (ప్రాణోపాన – సమాన ఉదాన – వ్యానవాయువులు) రజోవ్యష్టివలన –

కర్మేంద్రియములు-(వాక్పాణి పాదపాయూపస్థలు) తమోగుణయుక్త పంచభూతములును. అర్ధభాగములు చేసి యొక యర్ధభాగముఁ జతుర్భాగములు జేసి - మిగతా యర్ధభాగములలో ౹ + ౹ చొప్పున గలిపిన యెడలగోళకము లేర్పడునుగోళకములనగా నింద్రియ స్థానములు - కావున లోకంబులనగా - గోళకములు - లోకేశులనగా నింద్రియములు - లోకస్థులనగా - నింద్రియాధి దేవతులు - తెగిన తుది నశించినపిమ్మటఁ గ్రమలయము (విలోమము) గా "శ్రు॥ యచ్ఛేద్వాఙ్మన సీ ప్రాజ్ఞ - స్తద్యచ్ఛేద్ జ్ఞాన ఆత్మనిఁ జ్ఞానమాత్మని మహతినియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాన్త ఆత్మని" వాగింద్రియమునుమనస్సునందును - మనస్సును - బుద్ధియందును - బుద్ధిని మహత్తత్వము (మహాబిందువు లేక సూర్యునందు) మహా త్తత్వము - అవ్యక్తమునందును - అనగా బెంజీఁకటియందును - బెంజీఁకటి కావలనేకాకారముగా నుండువానినిఁ గొలిచెదనని తాత్పర్యము - విలోమ మనగా నధోభాగమునుండి యూర్ధ్వ భాగము.

కం॥ నర్తకుని భంగిఁ బెక్కగు
మూర్తులతో నెవ్వఁడాడు ♦ మునులు, దివిజులున్
గీర్తింప నేర రెవ్వని
వర్తన మొరు లెఱుఁగ రట్టి ♦ వానినుతింతున్

బాహ్య॥ నాట్యశీలునిగతిఁ బెక్కు వేషము [ రూపము ] లతో నెవ్వఁడు విహరించునో, మునులు దేవతు లెవనిని. గొనియాడుట కసమర్థులో యెవనియొక్క రహస్య మితరు లెఱుఁగఁ జాలరో, అట్టి వాని నుతి యించెదనని తాత్పర్యము.

రహ॥ అనేకములగు నుపాధులయం దంతర్యామియై నటు నిభంగి,ఁజలించునో,యనగా''యఃపృథివ్యాంతిష్ఠ్ఞ్ పృథివ్యామంతరో యం పృథివీన వేదయస్యపృథివీ శరీరంయః పృథివీమంతరోయ మయత్యేష - తఆ త్మాన్తర్యామ్యమృతః" యేది భూమియందున్నదై భూమికంటె నభ్యంతరమో - భూమి దేనినిఁ దెలి సికొనలేదో, భూమి యెవనికి (ఉపాధి) శరీరమో, యేది భూమి లోపల నున్నదై నియమించు చున్నదో, యది నాశనములేని నీయొక్క యంత ర్యామి స్వరూపమై యున్నది. దివిజులు, మునులు గీర్తింప నేరరెవ్వని " అతీతః పంథానం తవచమ హిమాఙ్మనసయో - రతద్వ్యావృత్త్యాయం చకిత మభిధత్తే శ్రుతిరపి॥ " హే శంకరా ! నీ యొక్క మహిమము మార్గము నతిక్రమించి యున్నది యనగా వాఙ్మనస్సుల కగోచరమైనది - శ్రుతికూ డ భయపడి వణఁకుచు నతద్వ్యావృత్తి - యత త్వమసియనగాఁ దత్, త్వం, అసి, యనుభేదము

లేనిదై, యంతా బ్రహ్మమేయని చెప్పినది కావున నగమ్య గోచరుఁడగు వాని నుతింతునని భావము

ఆ॥ వె॥ ముక్తసంగులైన * మునులు, దిదృక్షులు
సర్వభూత హితులు * సాధుచిత్తు
లసదృశవ్రతాఢ్యు * లై కొల్తు రెవ్వని
దివ్యపదమువాఁడు * దిక్కు నాకు ॥

బాహ్య॥ సర్వసంగ పరిత్యాగులును, బ్రహ్మదర్శనేక్షణ వాంచితులైనవారును. సర్వభూత దయాపరులును, సాధు హృదయులును, కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతశీలురును. నెవని పదకంజములను భజింతురో యట్టివాఁడు నాకు దిక్కని తాత్పర్యము,

రహ॥ సంగ మనగా "భావాభావ పదార్థానాం - హర్షామర్ష వికారదా మలినా వాసనాహ్యేషాసాసంగ ఇతి కథ్యతే॥" ప్రాప్తాప్రాప్తముల యందుఁ గలుగు హర్షామర్ష (సుఖదుఃఖ) ములయందు మగ్నమయి వికారమును బొందు చిత్తముయొక్క మలిన వాసనయే సంగమట్టి సంగమును విడిచిన వారును, దిదృక్షులు, తీవ్రమైన, యాత్మదర్శనేచ్ఛాసక్తులు - భూతహితులు - "సేవనం సర్వభూతానాం" యను విధివాక్యము చొప్పున, భూతదయాపరులును, నసదృశ వ్రతాఢ్యులును, కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతములు (కష్టసాధ్యములగు వ్రతముల నాచ

ఱించువారు నెవనినిఁ గొలుతురో యాతఁడే నాకా
ధారమని తాత్పర్యము.

సీ॥ భవము దోషంబు, రూ ♦ పంబు, గర్మంబునా
హ్వాయములు, గుణములె ♦ వ్వనికి లేక
జగములఁ గలిగించు ♦ సమయించు కొఱకునై
నిజమాయ నెవ్వఁడి ♦ చ్ఛియును దాల్చు
నాపరేశునకు, న ♦ నంతశక్తికి బహ్మ
కిద్ధరూపికి రూప ♦ హీనునకును
జిత్రచారునికి, సా ♦ క్షికి నాత్మరుచికినిఁ
బరమాత్మునకుఁ బర ♦ బ్రహ్మమునకు

ఆ॥ మాటలను నెఱుకల * మనములఁ జేరంగ
గాని శుచికిసత్త్వ * గమ్యుఁడగుచు
నిపుణుఁడైనవాని * నిష్కర్మతకు మెచ్చు
వానికే నొనర్తు * వందనములు

బాహ్య॥ పరమేశ్వరుఁడు, తనకు జన్మ కర్మనామరూపగు
ణాదులు లేకున్నను, జగములయొక్క సృష్టిస్థితి
లయాదుల కొఱకు స్వకీయ, మాయాసంబంధముచే
నన్నియుఁగల వానివలె ననంత శక్తి గలిగియుం
డెనో, యట్టి (వ్యాపక) స్వరూపునకు సిద్ధ - ప్రసి
ద్ధునకు నాశ్చర్య ప్రివర్తకునకు - వాక్కులకును
మనస్సునకును, - దెలియుట కసాధ్యమగు వానికి
సత్యముచేతఁ బొందఁ దగినవానికిని, నేర్పరియైన

వానికి, నైష్కర్మ్యతకు మెచ్చువానికి వందనము లొనర్చుచున్నానని తాత్పర్యము నైష్కర్మ్యత - కర్తృత్వరాహిత్యత )

రహ॥ భవము - జన్మ, మనగా షడ్వికారములు. అస్తి - జాయతే - వర్ధతే - పరిణమయతే - నశ్యతే - వినశ్యతే అను వికారములు - దోషము - పాపము "నపుణ్యంన పాపంన సౌఖ్యంన దుఃఖంన మంత్రో నతీర్థోన వేదానయజ్ఞాః-అహంభోజనం నైవ భోజ్యం న భోక్తా చిదానందరూపశ్శివోహంశివోహం ॥" పాప పుణ్య, సుఖ, దుఃఖ, మంత్రి, తీర్థ, వేద యజ్ఞ, భోజన, భోజ్య, భోక్తృ ( త్రిపుటి ) నేను, గాను చిదానంద రూపుఁడను శివుఁడను రూపాదులు "నాహం రూపం నామనాహంనకర్మ" నామ రూప కర్మములు నాకు లేవు. అయినను జగత్సృష్టి సంహారముల కొఱకు నన్నియును మాయచేఁదాల్చి నట్టు లగుపడునో "మాయాకల్పిత దేశకాల కల నా - వైచిత్ర్య చిత్రీకృతం - మాయావీన విజృంభయత్య పిమహాయోగీనయస్వేచ్ఛయా" తా॥ మాయా కల్పిత దేశ కాలాది భేదముచే నెఱుంగఁ బడి విచిత్రముగాఁ జిత్రీకరింప ( ఆకారముగా జేయ ) బడిన జగత్తును, మాయావి - ఇంద్రజాలి వనివలె యోగమాయచేఁ ద్రిప్పుచున్న వానికి

ననగా నాత్మయొక్క సాన్నిధ్యముచే బ్రకృతికి సత్తా కలిగినదని భావము " జగంతి నిత్యం పరితో భ్రమంతియత్సన్ని ధౌచుంబక లోహవద్ది " యని పరమాత్మ యొక్క సాన్నిధ్యముచే - సూదంటు ఱాతి సమీపముననున్న యినుమునకుఁ జలనముఁ గలిఁగినట్లు కలిఁగెనని భావము - అట్టి మాయావిశిష్టరూపికి - బంగారపు - కణికకంటె - భూషణమునకు నెక్కువ ప్రకాశత కలిగినట్లు ప్రపంచరూప ప్రసిద్ధునకుఁ జిత్రచారునకు, నంతర్యామికి సాక్షికి, నాత్మరుచికి, మనోరూప ప్రకాశకునకును వాగాదులకగోచరుఁడును - నిష్కర్మతకు మెచ్చువానికిని " బహిఃకృత్త్రిమ సంరంభోహృది సరంభ వర్జితః - అకర్తాంతర్బహిః కర్తాలోకే విహర రాఘవ " పైకిఁ గపటాడంబరమును - అంతరమున సంరంభ వర్జితుఁడై లోకమందు వర్తింపవలెను. అట్టివాఁడు. నిపుణుఁడు అట్టి నిపుణునిచేఁ జేయఁబడు కర్మ - నిష్కర్మయట్టి నిష్కర్మతకు మెచ్చునట్టి వానికి నమస్కరించెదనని భావము -

సీ॥ శాంతున కపవర్గ ♦ సౌఖ్యసంవేదికి,
నిర్వాణ భర్తకు ♦ నిర్విశేష
నకు, ఘోరునకు గూఢు ♦ నకు, గూఢవర్తికి
సౌమ్యున కధికవి ♦ జ్ఞానమయున

కఖిలేంద్రియ ద్రష్ట ♦ కధ్యక్షునకు బహు
క్షేత్రజ్ఞునకు దయా ♦ సింధుమతికి
మూల ప్రకృతి కాత్మ " మూలున కఖిలేంద్రి
యు, జ్ఞాపకునకు, దుః ♦ ఖాంత కృతికి

ఆ॥ నెఱిన సత్యమనెడి ♦ నీడతో వెలుఁగుచు
నుండు నెక్కటికి, మ ♦ హోత్తరునకు
నిఖిల కారణునకు ♦ నిష్కారణునకు, న
మస్కరింతు నన్ను ♦ మనుచు కొఱకు॥

బాహ్య॥ శాంతమూర్తియు, సహజానంద సంవేదియు, నిర్వాణ ( మోక్ష ) ప్రదాతయు, విశేష రహితుఁడును - ఘోరుఁడనగా - శివస్వరూపుఁడును, గూఢుఁడనగాఁ దహరాకాశమునందుండు వాఁడును - గుణశీలుఁడును, - సర్వజ్ఞుఁడును, నింద్రియా తీతుఁడును - సమస్త క్షేత్రములను దెలియువాఁడును - దయాసింధువును - మూల ప్రకృతి యనగా సృష్టి ప్రారంభోపాదాన కారణుఁడును - దనకుఁదానే మూలమైన వాఁడును - నింద్రియ కృతక్రియలకు ద్రష్టయును మాయా ( ప్రతిబింబ ) యుతుఁడైనను దానొక్కఁడేయై యుండు వాఁడును - సంసారోత్తారకుఁడును - బ్రపంచాధిష్ఠాన కారణుఁడును - బరిశీలించినచో నిష్కారణుఁడును నగువానికొఱకు నన్ను బ్రతికించుటకునై నమస్కరించు చున్నాను

రహ॥ శాంతున కనగా ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః అను అధ్యాత్మికాది శాంతి త్రయముచే నుపసంహరింపఁబడువాఁడు, - అధ్యాత్మిక దుఃఖము - తలపోటు, కడుపునొప్పి మున్నగునవి * యాధి భౌతిక దుఃఖము-వృశ్చిక, సర్ప దష్టాదులు, - అధి దైవిక దుఃఖము - పిడుగు, భూకంపము మున్నగు దుఃఖ త్రయరహితుఁడును - అపవర్గ సౌఖ్యసంవేది బంధ మోక్ష రహిత సహజానందాను భవవేదియును - మోక్ష ప్రదాతయు, నిర్విశేషుఁ డనగా నేతి నేతి వాక్యములచే నింద్రియ సహిత శరీరత్ర యనిషేధావశిష్టుఁడు, ఘోరుఁడు మంగళ (శివ,) స్వరూపుఁడును గూఢుఁడు "ఏకోదేవః సర్వభూతేషు గూఢః సర్వభూత హృదయ బిలములయందుగూఢముగా నుండువాఁడు, గుణధర్మి, - సత్వ రజస్తమోగుణములే ధర్మముగాఁ గలవాఁడు ( శబల బ్రహ్మము ) ఇంద్రియ ద్రష్ట - జ్ఞానేంద్రియాదులకుఁ దమ తమ విషయాది క్రియలందుఁ బ్రేరేపించి - భ్రూయుగ స్థానమందుండు ఆజ్ఞా చక్రమందు ద్రష్టృత్వము వహించువాఁడు -బహుక్షేత్రజ్ఞుఁడు "క్షేత్రజ్ఞంచాపి మాంవిద్ధి సర్వక్షేత్రేషుభారత" భాః - సూర్యుని యొక్క - రహస్యమైన యంతర జ్యోతియందు - త - తపించు వాఁడా - సహ్వోపా

ధులయందున్న - నన్ను క్షేత్రజ్ఞునిగాఁ దెలిసికొనుము. కావున నట్టి క్షేత్రజ్ఞుఁడును - దయాసింధువు - " ఈశ్వరానుగ్రహాదేవపుంసామద్వైత వాసనా" ఈశ్వరానుగ్రహము వలననే పురుషులకుఁ నద్వైత విచారణయందిచ్ఛ గలుగునట్టి దయాసింధునకు, నఖిలేంద్రియ జ్ఞాపకునకు, నిదిఘటము, నిదిపటమునను, నింద్రియార్థఁ విషయములను దెలియజేయు తెలివియే రూపము గలవాఁడు నెటినసత్యమనెడి నీడతో వెలిఁగెడు నెక్కటి" "శ్లో॥ శివం శైవం భావం శివమపిశివాకారమ శివం - నసత్యం శైవం తత్శివమ పిశివం శైవమనిశం - శివం శాంతం మత్వా శివపరమ తత్వం శివమితి - నజానేతత్తత్వం శివమితి నమోవేద్య శివతే తా॥" శివుని భావము శైవం ( పరమాత్మ భావము ప్రకృతియని యర్థము ) అయినను శివా కారము - అశివమనగా నమంగళము. అనగా బ్రకృతి బ్రహ్మసంబంధమైనను - సుఖరూపము కాదని యర్థమెపుడును శైవము శివమే యయినను సత్యము కానేరదు. " బ్రహ్మ సత్యం జగన్మిథ్యయనియాశయ మట్టి శివ స్వరూపమును - పరమ తత్వ స్వరూప మని తెలిసికొనఁ జాలనో యట్టి తెలియఁ దగిన శివుని కొఱకు నమస్కరించు చున్నాను. ( వివరణ ) ప్ర

కృతియే నీడ - అదియే శైవం - పరమాత్మయే శివుఁడు - అదియే సత్య మట్టి ప్రకృతితోఁ బ్రకాశించు పరమాత్మ యనగా నసత్యమనెడు నీడతోఁ బ్రకాశించు, నెక్కటి - ఏకమనగా నొక్కఁడుఁడై యుండువాని కొఱకు నమస్కరించు చున్నాను - మఱియుఁ గారణుఁడు "మమయోని ర్మహద్బ్రహ్మ తస్మింగర్భందధామ్యహం - సంభవస్సర్వభూతానాంతతో భవతి భారత" హే. అర్జునా ? నాకు యోనిః - గర్భాధాన స్థానము, మహద్బ్రహ్మ - గుణసామ్యావస్థయగు ప్రకృతి, దానియందు - గర్భం - యీ క్షణరూప సంకల్పమును ధరించు చున్నాను, దానివలన సర్వభూతములుఁ బుట్టుచున్నవి. కావునఁ గారణుఁడు, మఱియు నిష్కారణుఁడు "శ్లో॥ నకారణంకార్యమతీత్యనిర్మల-స్సదైవతృప్తోహమితీ హభావయ" నేను కార్య కారణముల నతిక్రమించి నిర్మలుఁడనై, సదా తృప్తిఁగలవాఁడనైయున్న వాఁడనని భావించుము - అట్టి నిష్కారణునకు నమస్కరింతునని జీవ ప్రార్థన.

కం॥ యోగాగ్ని దగ్ధ కర్ములు
యోగీశ్వరులే మహాత్మ ♦ నొండెఱుఁగక, స
ద్యోగ విభావితమనముల
బాగుగ వీక్షింతురట్టి ♦ పరము భజింతున్

భావ్యా॥ ధ్యానయోగాగ్నిచే దగ్ధకర్ములగు యోగీశ్వరులే మహాత్ముని నితరము నెఱుఁగక సచ్చిదానందాత్మాను సంధానులై వీక్షించు చున్నారో, యట్టి పరమాత్ముని భజింతును.

రహ॥ – యోగాగ్ని దగ్ధకర్ములు “ శ్లో॥ యస్యసర్వే సమారంభాః - కామ సంకల్ప వర్జితాః - జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః॥ ” యెవనియొక్క కర్మలు కామ సంకల్ప వర్జితములై ప్రారంభింపఁ బడునో, వానిని జ్ఞానాగ్నిచే దహింపఁబడిన కర్ములుఁగల వానిగాఁ, బండితులు వక్కాణింతురు - యోగీశ్వరులు శ్లో॥ ధ్యాతృధ్యానే పరిత్యజ్య క్రమాధ్యేయైక గోచరం నివాతదీప వచ్చిత్తం సమాధి రభిధీయతే ” నేను ధ్యానించు చున్నానను తెలివియును, ధ్యానమును జిత్తమెపుడుఁ గ్రమంబునఁ బరిత్యజించి, నివాత దీపముపలె, ధ్యేయైక గోచర మగునో, యాస్థితిని సమాధియని చెప్పుదురు –

శ్లో॥ వృత్తయస్తుతదా నీమజ్ఞాతా ప్యాత్మగోచరాః
స్మరణాదను మీయంతేవ్యుత్థి తస్య సముద్ధితాత్ ॥

తా॥ అట్టి స్థితియందు వృత్తులు గోచరింపకున్నను – సమాధినుండి లేచిన వానికి వృత్తులు స్మరింపఁబడు చున్నందున, యాత్మాకార వృత్తుల నుమాన ప్రమాణముచే గోచరించు చున్నవని యభిప్రాయము

శ్లో॥ అనాదా విహసంసారె సంచితాః కర్మ కోటయః
అనేన విలయంయాంతి * శుద్ధోధర్మో వివర్ధతే ॥

తా॥ అట్టి సమాధ్యభ్యాస యోగముచే ననాద్య విద్యా సంస్కార సంచిత కర్మకోటులు నశించి శుద్ధ

బ్రహ్మ ప్రవృత్తి వృద్ధిఁ బొందుచున్నది.

శ్లో॥ అమునా వాసనా జాలే నిశ్శేషం ప్రవిలాపితే
సమూలోన్మూలితేపుణ్య * పాపాఖ్యేకర్మసంచయే

అట్టి యభ్యాస యుక్తునిచే వాసనా జాలము నిశ్శే
షముగా విలయమును బొందుచుండగాఁ, పుణ్య
పాప కర్మ సంచయము సమూలముగా నున్మూలిం
పఁబడుచున్నది.

శ్లో॥ పరోక్షంబ్రహ్మవిజ్ఞానం * శాబ్దం దేశిక పూర్వకం
బుద్ధిపూర్వకృతంపాపం*కృత్స్నందహతివహ్నివత్॥

తా॥ ఇట్టి దేశిక ప్రబోధ పూర్వకమగు, పరోక్షజ్ఞానము
బుద్ధి పూర్వకముగాఁ జేసిన సమస్త పాపము నగ్ని
హోత్రమువలె దహించును కావున, నపరోక్షాను
భవముఁ గలిగిన యోగికిఁ గర్మలు నశించునని
వేఱే చెప్పనేల? నట్టి యోగీశ్వరు లితరము నెఱుఁ
గక నాత్మ యోగ విభావిత మనస్సుచే నెవనిని
వీక్షింతురో, యట్టి పరముని భజింతునని తాత్ప
ర్యము.

సీ॥ సర్వాగమామ్నాయ ♦ జలధికి నపవర్గ
మయునికి నుత్తమ ♦ మందిరునకు
సకల గుణారణి చ్ఛన్నబోధాగ్నికిఁ
దనయంత రాజిల్లు ♦ ధన్యమతికి
గుణలయోద్దీపిత ♦ గురుమాన సునకు, సం

వర్తిత కర్మని ♦ ర్వర్తితునకు
దిశలేని నాబోటి ♦ పశువుల పాపంబు
లడఁచువానికి సమ ♦ స్తాంతరాత్ముఁ
ఆ॥ డై, వెలుంగువాని ♦ కచ్ఛిన్నునకు భగ
వంతునఁకు దనూజ ♦ పశునివేశ
దారసక్తులయిన ♦ వారి కందఁగరాని
వాని కాచరింతు ♦ వందనములు

బాహ్య॥ సమస్త మంత్రశాస్త్ర జలధియును - మోక్ష మను ప్రసిద్ధ నామకుఁడును, వైకుంఠమే యుత్తమ మగు మందిరము గలిగినట్టియు - సత్వర జస్తమ గుణములను, యరణి (దారువు) చేఁ గప్పఁబడిన బోధాగ్ని కలవాడును - స్వప్రకాశమానుఁడును, గుణలయముచే స్వచ్ఛమై ప్రకాశించు పరాస్వరూ పుఁడును - బ్రళయమందు నశింపఁజేసి సృష్టికాల మందుఁ గర్మనిర్వర్తించు వాఁడును - దిక్కులేని నావంటి పశుప్రాయుల పాపంబు లడఁచు వాఁ డును - భూతాంత రాత్ముఁడై ప్రకాశించు వాఁ డును - నిరావరణుఁడును - దారా పుత్రాదుల యం దాసక్తులైనవారలకు విదూరుఁడు నగువా నికి వందనము లాచరింతునని తాత్పర్యము.

రహ॥ సర్వాగమా మ్నాయ జలధికి " విధాత్రీ ధర్మా ణాంత్వమసి - సకలా మ్నాయ జననీ" హే తల్లీ!

సకల మంత్ర శాస్త్రములకు జననియై యున్నా వనగా వేదములలో మధ్య భాగమైన మంత్రో పాసనా భాగము పరాప్రకృతియే యగుటచేఁ బర యనగాఁ బరమాత్మయే యగునుఁ ప్రకృతి పురు షుల కభేద మగుటచే నట్టి సహస్ర కోటి మంత్ర రూప జలధియగు వాఁడును – నపవర్గమనగా సృష్టి రహిత స్వరూపము– "శ్రు॥ ప్రపంచోయది విద్యేత నివర్తేత నసంశయః – మాయామాత్ర మిదం ద్వై త మద్వైతం పరమార్థతః" – (వర్గమనగా) సృష్టి – ప్రపంచము, నిజముగా సృష్టింపఁ బడిన యెడల నివర్తింపక తప్పదీ ప్రపంచ మనగా ద్వై తము మాయా మాత్రమేకాని పరమార్థము న న ద్వైతమే యగును – కావున నట్టి యపవర్గము యుండును – నుత్తమ మందిరునకు – పృథివ్యాది యవ్యక్త పర్యంతము ననాత్మయగుటచే నశ్వర మనియుఁ దత్పర మనశ్వరమనియుఁ జెప్పఁ బడు టచే నుపాధిరహిత స్థితియగు నుత్తమ (అవ్యక్తా తీత) మందిరము గలవాఁడును – సకల గుణారణి చ్ఛన్నబోధాగ్నికి – సత్వాది గుణారణిచేఁ గప్పఁ బడిన జ్ఞానాగ్నికలవాఁడును–అనగా "శ్రు॥ ఆత్మా నమరణింకృత్వా ప్రణవంచోత్తరారణిం – ధ్యాన నిర్మథ నాభ్యాసాత్పాశం దహతి పండితః" పండి

తుఁడు తన మనస్సను క్రింది యరణి -(అగ్ని జనక దారువును,) ప్రణవమును, పైయరణి ( దారుశ కలము ) చే మర్దించిన, జ్ఞానమను, వహ్ని జని తమై మోహ పాశమును దహింపఁజేయు చున్నాడు - కావున నట్టి బోధాగ్ని స్వరూపుఁడును - తనయం తరాజిల్లు ధన్యమతికి - స్వయం ప్రకాశ మానుఁ డును - " సోఽక్షరః పరమ స్వరాట్ " గుణము లు లయించినఁ బరిధూయిత ( ఎగరఁ గొట్టఁ బడిన ) ధూమాగ్నివలె నుద్దీపితుఁడును - ప్రళయ మునందు గర్మ నశింపఁ జేయువాఁడును - పశువుల వంటి జీవుల పాపంబు లడఁచు వాఁడును- యనవ చ్ఛిన్నుఁ డనగా - బుద్ధ్యాదులచే గప్పఁబడని వాఁ డును - దారా పుత్రాదులయందుఁ బ్రేమ గలుగు వారికందరాని వాడనఁగా "శ్లో॥ సంసార పాశదృఢ బంధ నిపీడి తస్య - మోహాంధ కారభయకూపని పాతితస్య - కామాభి లాషవివి ధోరగ దంశితస్య- దీనస్య మేదయాంకురు కరుణైకపాత్రి " హే కరు ణైక పాత్రా ! దృఢ బంధకమగు దారాపుత్రాది కమను సంసారముచే బద్ధుఁడ నైనట్టియు, మోహ మను నంధకార కూపంబునఁ గూలినట్టియు గామా భిలాషములను వివిధ సర్పములచేఁ గఱవఁ బడి నట్టియు, దీనుఁడనగు నను గరుణించుము (అనగా

సంసారాసక్తుల కందరాని వాఁడని (వ్యంగ్యము)
అట్టి వానికి వందనము లొనర్తును. మరియు

సీ॥ వరధర్మ కామార్థ ♦ వర్జిత కాము లై
విబుధు లెవ్వాని సే ♦ వించియిష్ట
గతి బొందుదురు చేరి ♦ కాంక్షించువారి క
వ్యయ దేహమిచ్చు నె ♦ వ్వాఁడు కరుణ
ముక్తాత్ము లెవ్వని ♦ మునుకొని చింతింతు
రానంద వార్ధిమ ♦ గ్నాంత రంగు
లేకాంతు లెవ్వని ♦ నేమియుఁ గోరక
భద్ర చరిత్రంబుఁ - బాడుచుందు

ఆ॥ రా, మహేశునాద్యు ♦ నవ్యక్తు నధ్యాత్మ
యోగ గమ్యుఃబూర్ణు ♦ నున్నతాత్ము
బ్రహ్మ మయిన వానిఁ బరము నతీంద్రియు
నీశుస్థూలు సూక్ష్ము ♦ నే భజింతు

బాహ్యా॥ విబుధు లెవ్వని సేవించి, ధర్మార్థ కామవర్జితు లై పురుషార్థమగు మోక్షమును బొందుదురో, యాశ్రితు లై యవ్యయ దేహముఁ గాంక్షించు వారికి జన్మ రాహిత్యము నెవఁడొసంగు చుండునో, సంసారవిముక్తాత్ము లెవని చింతింతురో, బ్రహ్మానంద జలధిని మగ్నులగు నేకాంత రంగసాధకు లితర మేమియును గోరక నెవని శుభప్రద చరిత్రముఁ బాడుచుందురో, యాద్యుఁడును నవ్యక్తుఁడును.

నధ్యాత్మ యోగమనగాఁ బ్రత్యగాత్మను దెలియుట యనుయోగముచేఁ బొందఁదగిన వాఁడును, బూర్ణుడును, శుద్ధ బ్రహ్మస్వరూపుఁడును, నతీంద్రియుఁడు స్థూల సూక్ష్మ రూపుఁడునగు వానిని భజింతును.

రహ॥ (త్రివర్గము) ధర్మార్థ కామములను గోరక (అనగా "అంత్యేషు రేమిరేధీరా - న తేమధ్యేషు రేమిరే - అంత ప్రాప్తిం సుఖం ప్రాహుః దుఃఖ మంతర మేతయోః ॥" ధీరులు - ధర్మార్థ కామ మోక్షములలో - మధ్యగానుండు, దుఃఖ వంతములగు నర్థకామముల కంటె నంత్యముల యందుండు, ధర్మ - మోక్షములు సుఖరూపముల గుటచే వాటియందే రమించిరి (కోరిరి) కావున నెవనిని సేవించి యిష్టగతి (మోక్షమును) బొందుదురో, యాశ్రితులైన ముముక్షువులకు నెవఁడ వ్యయ (జన్మరాహిత్య) - విదేహముక్తి నొసంగునో, సంసార బంధ విముక్తులెవనిని ధ్యానింతురో, యానందవార్ధిమగ్నైకాంతరంగ సాధకులు "శ్రు॥ ఏకాకినాసము పగమ్య వివిక్త దేశం-ప్రాణాది రూప మమృతం పరమార్థతత్వం - లఘ్వాశినాధృతిమతా పరి "భావితవ్యం-సంసార రోగహరమౌష ధమద్వితీయం" తా॥ ఏకాంతమున లఘ్వాశనులై, ప్రాణాదుల నమృత స్వరూపములుగా గ్రహించి

యనగా, సమష్టిగానుండు మహాభూతములయందలి యమృత స్వరూప బ్రహ్మమే - వ్యష్టిగానుండు ప్రాణాదులయం దమృత స్వరూపముగా నున్నదను భావనమే సంసార రోగహారమైన, యద్వితీయమగు నౌషధ మని గ్రహించవలెను - కావున నేకాంత వాసులై యానందవార్ధి మగ్నాంత రంగసాధకులై "శ్రు॥యత్రనాన్యత్పశ్యతినాన్యచ్ఛృణోతి,నాన్యద్విజానాతి సభూమా" యే స్థితియం దితరము వినఁడో యితరమునుజూడఁడోఁ యితరము నెఱుఁగఁడో, యదియే భూమా (బ్రహ్మ) నంద మట్టి యానందాంతరంగ సాధకులై, బ్రహ్మమును గీర్తింతురో, యట్టి మహేశు, నాద్యుఁడు - సృష్టికిఁ బూర్వమం దున్నవాఁడు, అవ్యక్తుఁడు- "శ్రు॥నామరూప భిర్న వ్యజ్యతే త్యవ్యక్తం - నామ రూపములచే వ్యక్తీకరింప దగినవాఁడు కాడు - కావున నవ్యక్తుని - నధ్యాత్మ యోగ గమ్యు - దహరాకాశమునందుండు ప్రత్యగాత్మ నెఱుంగుటయే, యధ్యాత్మ యోగ మట్టి యోగ గమ్యుఁడును, బూర్ణుఁడు " పూర్ణమదః పూర్ణమిదం - పూర్ణాత్పూర్ణము దచ్యతే - పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావశిష్యతే" అదః-నిర్గుణ బ్రహ్మము - ఇదంసగుణ బ్రహ్మము (జగత్తు) రెండును పూర్ణమే - గాని, సగుణ

బ్రహ్మము కంటె - నిర్గుణ బ్రహ్మ మతిశయించు చున్నది - సగుణ బ్రహ్మము ( ప్రపంచము ) నకు నిర్గుణ బ్రహ్మమును గారణముగా గ్రహించిన వాఁడు, పూర్ణుఁడై, శేషింపఁ బడుచున్నాడు. అట్టి పూర్ణుఁడు నింద్రియా తీతుఁడును స్థూల. సూక్ష్మ రూపుఁడగు వానిని భజింతునని తాత్ప ర్యముఁ

సీ॥ పావకుం డర్చుల ♦ భానుండు దీప్తుల
నెబ్భంగి నిగిడింతు ♦ రెట్లడంతు
రాక్రియ నాత్మక ♦ రావళిచేత బ్ర
హ్మాదుల వేల్పుల ♦ నఖిల జంతు
గణముల జగముల ♦ ఘననామ రూప భే
దములతో మెఱయించి ♦ తగనడంచు
నెవ్వఁడు మనము, బు ♦ ద్ధీంద్రి యంబులు దాన
యై గుణ సంప్ర వా ♦ హంబు నెఱపు

తే॥ స్త్రీ నపుంసక పురుషమూర్తి యును గాక
తిర్యగ మరనరాది మూర్తియును గాక
కర్మగుణ భేద సద సత్ప్ర ♦ కాశిగాక
వెనుక నన్నియుఁ దానగు ♦ విభుఁ దలంతు ॥

భావ్య॥ అగ్ని హోత్రుఁడు, జ్వాలలను - సూర్యుఁడు కిరణములను నెటు లుద్గత మగునట్లు విస్తరింపఁజేసి పిమ్మట నస్తమింపఁజేసినటు లెవఁడు, వ్యాపక

కళలచే బ్రిహ్మాదులను, జంతు గణములను, మాయా కార్యములగు నామ రూప భేదములతోఁ బ్రకాశింపఁజేసి యస్తమింపఁ జేయునో, మఱియు బుద్ధీంద్రియాది రూపధారియై, గుణవాహినీ పరంపరల నెవఁడు నెఱవేర్చు చుండునో, లింగభేద రహితుఁడై; దేవ, తిర్యఙ్మనుష్య రస్వరూప- కర్మగుణ భేద సదసత్తులుఁగాక పిదప నన్నిరూపములు నెవఁడు ధరించునో, వానినిఁ దలంతును -

రహ॥ పావకుండర్చుల తగనడంచు శ్రు॥ "యథానిరింధనో వహ్నిస్స్వయోనావుపశామ్యతే-తథావృత్తిక్షయాచ్చిత్తం - స్వయోనావుపశామ్యతే" ఎటులు నిరింధనాగ్ని స్వకారణమందు లయించునో, యట్లు వృత్తి క్షయమగు చిత్తము స్వకారణమగు నాత్మయందు లయించును - అట్లు నామరూప విషయములతో సృష్టించియు పసంహరించు నట్టిన్ని - యెవఁడు బుద్ధీంద్రియాది విషయాది కముగాఁ దానే వివర్తోపాదానమై (భ్రమః పరిణామముగా) పరిణమించెనో, శ్రు॥ "సఏష ఇహప్రవిష్టః ఆనఖాగ్రేభ్యో యథాక్షురః క్షురధానేవహితః స్యాద్విశ్వంభరోవా, విశ్వంభరకులాయే తన్నపశ్యన్త్యకృత్స్నోహి సప్రాణన్నేవ ప్రాణోనామ భవతి వదన్వాక్పశ్యంశ్చక్షుః శృణ్వన్శ్రోత్రం మన్వానో మనః" ఆ పర

మాత్మ, యొరయందుఁ గత్తివలెఁ దారువునందగ్ని వలె శరీరమందుఁ గోటికొన వఱకుఁబ్రవేసించి యంతటితోఁదృప్తిఁ జెందక-నుచ్ఛ్వాసముచేఁబ్రాణుఁడును మాటలాడుచు వాగూ్రపకుఁడును - జూచుటచేఁ జక్షుస్స్వరూపుఁడును - సంకల్పముచే మనో నామకుఁడు నయ్యెను. గాని యిట్లు తెలిసికొనఁ జాలరు - బుద్ధీంద్రియంబులు దానయై

శ్లో॥ మనశ్చక్షు రాదేర్వి * ముక్తస్స్వయం యో
మనశ్చక్షురా
దేర్మనశ్చక్షురాదిః * మనశ్చక్షురాదేరగమ్య, స్వరూపస్సనిత్యో్ప లబ్ధి స్వరూపోహ మాత్మా ॥

తా॥ ఆత్మ - మనశ్చక్షురాదులతో విముక్తి గలిగియున్నది. నాయాక్రియలచే నాయా నామ రూపములు పొంది యున్నది. దైనను మనశ్చక్షు రాదులచేఁ దెలియఁ బడఁదగినది కాదో, యట్టి నిత్యానందోహమగు వానినిఁ దలంతును. మఱియుఁ - స్త్రీ, పుం, న పుంసకాది, లింగభేదము లేక, వెనుకనన్నియుఁదానగు "శ్రు॥సచ్చత్యచ్చాభవతు నిరుక్తం-చానిరుక్తం చనిలయనంచానిలయనంచ సత్యంచాన్వతంచ సత్యమభవతు - ఆ పరమాత్మ సదసత్స్వరూపుఁడును - వేదాంగమగు నిరుక్తమును - నిలయా నిలయములు - సత్యా సత్యములును - సమ

స్త్రము నయ్యెనో, యాతనిఁ దలంతునని భావము

కం॥ కలఁడందురు ♦ దీనులయెడఁ
కలఁడందురు పరమయోగి ♦ గణముల పాలన్
కలఁడందు ♦ రన్ని దిశలను,
కలఁడు కలండ నెడువాఁడు ♦ కలఁడో, లేడో ॥

బాహ్య॥ దీనుల పాలిటను - యోగయుక్త గణముల పాలిటను - అన్ని దిశలును ♦ కలఁడని చెప్పబడు వాఁడు కలఁడో. లేడో ( ఆర్తుని యొక్క యాలాపము )

రహ॥ భక్తి పరిపక్వమయి - జ్ఞానోత్పత్తికిఁ బూర్వపుస్థితి యనగా జ్ఞానుల కంతటను ♦ భక్తుల కభ్యాసాను సారముగాఁ బ్రత్యక్షమగు చుండును.

శ్లో॥ అగ్నిర్దేవోద్విజాతీనాం * మునీనాంహృది దైవతం
ప్రతిమా స్వల్పబుద్ధీనాం * సర్వత్రవిజితాత్మనాం॥

తా॥ బ్రాహ్మణులకు నగ్నియును - మునులకు హృదయమందును - అజ్ఞులకుఁ ( ప్రతీకోపాసన ) ప్రతిమార్చనందును - జ్ఞానులకు నెల్లెడలను దైవము కలఁడని స్మృతి చెప్పుచున్నది. యభ్యాసాను సారమనగా.

శ్లో॥ తంసర్వ భూతహృదయేషు * కృతాలయోపి
త్వన్మంత్ర జాప్యవిముఖేషు * తనోషిమాయామ్

త్వన్మంత్రి సాధన పరేష్వపి యాతి మాయా
సేవానురూప ఫలదోసి యథామహీపః ॥

తా॥ హే రామా ! నీవు సర్వభూత హృదయ నివాస ముఁగలిగిన వాఁడవయ్యును - నీ నామ మంత్ర జపవి ముఖులయందు మాయను విస్తరింపఁ జేయు చున్నావు. మంత్రి జపితలయందుఁగూడ మాయ ప్రసరించు చున్నది. దృష్టాంత మెట్లనఁగా, భూపాలుఁ డెట్లాశ్రయము ననుసరించి ఫలదాతయగుచున్న ట్లున్నది. కావున నట్లెంచి న్యూన ఫలదాతవు గాకుము.

శ్లో॥ సంసార సాగర విశాల కరాళ కామ
నక్రగ్రహ గ్రసన నిగ్రహ విగ్రహస్య
మగ్నస్యరాగల సదూర్మిని పీడితస్య
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబం ॥

తా॥ హే లక్ష్మీనృసింహా ! విశాలమగు సంసార సరమునందుఁ గామ మను మొసలిచే గ్రహింపఁబడిన, విగ్రహముఁ ( శరీరము ) గలవాఁడను మఱియు రాగమను నూర్ముల - ( తరంగముల ) లో మునిఁగి పీడింపఁ బడుచున్న నాకుఁ జేయూత నొసంగుముఁ ఇట్లుజీవుఁడు, కామవిముక్తిఁ గోఱకుఁ బ్రార్థించు చుండెనని భావము.

సీ॥ కలుఁగఁడే నాపాలి ♦ కలిమి సందేహింపఁ
 గలిమి లేములు లేక ♦ కలుగు వాఁడు
నా కడ్డపడరాఁడె ♦ నలి, న సాధువులచేఁ
 బడిన సాధుల కడ్డ ♦ పడెడి వాడు
చూడఁడే నాపాటుఁ ♦ జూపులఁ జూడక
 చూచెడు వారలఁ ♦ జూచువాఁడు
లీలతో నా మొఱా ♦ లింపఁడే మొఱఁగుల
 మొఱ లెఱుంగుచుఁదను ♦ మొఱఁగువాఁడు

గీ॥ అఖిల రూపముల్ దనరూప ♦ మైనవాఁడు
ఆది మధ్యాంతములు లేక ♦ యడరువాఁడు
భక్తజనముల దీనుల ♦ పాలివాఁడు
వినఁడె చూడఁడె తలఁపఁడె ♦ వేగరాఁడెఁ ॥

బాహ్య॥ కలిమిలేము లెంచక సమముగా దర్శన మొసం గునట్టి వాఁడున్నాడో, లేడో, యని సందేహించుచున్న నా పాలి కలుఁగఁడా, ? ఉండడా ? దుర్మార్గులచే బాధింపఁ బడుచున్న సాధు సంరక్షకుఁడగు వాఁడు నాకడ్డపడఁడా ? పరాగ్దృష్టి ( బహిర్దృష్టి) వీడి ప్రత్యగ్దృష్టుల ( అంతరము ) ను జూచువారిని గృపఁ జూచునట్టి దైవము నా పాటు ( కష్టము ) జూడఁడా? మొఱలు వినుచున్నను (దిగోహితుఁడై) కనుపడక యుండువాఁడు నా మొఱ వినలేడా ? తానే యన్ని రూపములు ధరించిన వాఁడును ఆది

మధ్యాంతములు లేని వాఁడునుఁ భక్త, దీనాది జనముల పాలిటి రక్షకుఁడైన వాఁడుఁ వినలేదా ? చూడలేదా !

రహ॥ కలిమి, లేములు " శ్రు॥ నాసదాసీత్ నోసదాసీత్ " తా॥ యేది సదసత్స్వ రూపము కాదో, అనగా, న + అసత్ + ఆసీత్ - న + సత్ + ఆసీత్ - నా సదా శీత్

సీ॥ సత్తుగా దాత్మవి ♦ జ్ఞానంబుచే నెంద
భావమై బాధింపఁ బడుట వలన
నెలమిన సత్తుగా ♦ దేనజ్ఞుఁడన టంచు
నజ్ఞాన భూతమై ♦ యలరుచు నికి
సదసత్తు గాదు, వి ♦ చారింపలే దట్టి
దగ్నివ్యంబు గడువిరు ♦ ద్ధంబు గాన
నిరవయవము గాదు ♦ నిఖిల జగత్స్వరూ
పము చేత మిగులనే ♦ ర్పడుట వలన

గీ॥ సావయవమునుగాదు ♦ దృశ్యము సుషుప్తి
యందడంగినఁదాను, శూ ♦ న్యంబు గామి
నొరయు యుభయాత్మకముగా, ద ♦ యుక్తమగుట
నాంజనేయ మదీయ మా ♦ యాతమంబు॥

తా॥ ఇట్టి మాయాకార్య రూపమగు, కలిమి లేములు లేక, నే తినేతి వాక్యములచే నిషేధింపఁగా నవ శేషుఁడగు, మిగిలిన వాఁడు లేడా ?

అయితే యిన్ని స్వరూపములుగా నేల పరిణమించె ననగా ?

శ్లో॥ అవ్యక్తా హిగతిర్దుఖం * దేహ వద్భిరవాప్యతే॥

తా॥ దేహాత్మ బుద్ధులచే, నవ్యక్తోపాసన దుర్లభ్యము గదా ! కావున సవికల్ప సమాధివల్లనే నిర్వికల్ప సమాధినిఁ బొందవలెను,

శ్లో॥ జేతుంశక్యం మనోరాజ్యం * నిర్వికల్ప సమాధినా
సుసంపాద్యః క్రమాత్సోపి * సవికల్ప సమాధినా

తా॥ మనోరాజ్యము ( గొంతెమ్మ కోర్కెల ) Vain thoughts ను నిర్వికల్ప సమాధిచే జయింప వచ్చును. నా నిర్వికల్ప సమాధిని సవికల్పము చేతనే సంపాదింప వలయుననగా, సగుణ స్వరూప మగు నామ రూపాదియుక్త దేవతామూర్తి ప్రతీకోపాసనచే నిర్గుణ బ్రహ్మము నెఱుంగ వచ్చును. (ప్రతీకము - అవయవము సాలిగ్రామమును, విష్ణువని పూజించుట )

శ్రు॥ ఉపాస కానాం కార్యార్థం * బ్రహ్మణోరూప కల్పనా ”

ఉపాసకుల సౌకర్యమునకై నిరాకార బ్రహ్మమునకు, సాకార మేర్పరుపఁబడినది. కావున నిట్టి సదసత్స్వరూపములు (కలిమి లేములు) లేక ననగా, గారణ కార్యములగు బీజ వృక్షములతోఁ బృధ్వికి

సంబంధము లేనట్లు, మాయా తత్కార్యములతో సంబంధము లేక, ప్రకాశించువాఁడు, కలిమి సందేహించు నా పాలి అంతఃకరణ తత్ప్రతి బింబమునుగూర్చి సందేహించు (సత్యము కాదని నిశ్చయించు) మహావాక్య బోధకుఁడు. నా పాలిట లేఁడా? అహం బ్రహ్మాస్మి యను జ్ఞానము నొసంగఁడా? "శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతాం - ధర్మసంస్థాప నార్థాయ -సంభవామి యుగే యుగే" దుష్ట శిక్షణ శిష్టరక్షణార్థమై యాయా దేశ కాలానుగుణ్యముగా వేషంబులన్ దాల్చి ధర్మ సంస్థాపనం బొనర్చు దేవ దేవుఁడు నను గాపాడఁడా?

కం॥ విశ్వకరు, విశ్వదూరుని
విశ్వాత్ముని, విశ్వవేద్యు ♦ విశ్వుని విశ్వా
శాశ్వతు, నజు, బ్రహ్మప్రభు
నీశ్వరునిం బరమ పురుషు ♦ నే భజియింతున్

తాత్ప॥ ప్రపంచ నిర్మాతయుఁ, బ్రపంచమునకు దూరుఁడును, ప్రపంచమే శరీరముగాఁ గలవాఁడును, ప్రపంచముచేఁ దెలియఁబడువాఁడును, ప్రపంచమునకు విలక్షణుఁడగు, శాశ్వతుఁడును, నజుఁడును, వ్యాపకుడును, ప్రభువును, నియమించు

వాఁడు నగు పరమ పురుషుని భజియించెదనని తాత్పర్యము.

రహా॥ శ్లో॥ యస్యైకాంశాదిత్థమ శేషం జగదేతత్ప్రాదు ర్భూతం. యేనపినద్ధంపునరిద్ధం యే నవ్యాప్తం, యేన విబుద్ధం సుఖ దుఃఖైఃతం సంసారధ్వాంత వినాశం హరి మీడే॥

తా॥ యే పరమాత్మయొక్క యేకాంశముచే నీ జగత్తు ప్రాదుర్భవించినదో, యెవనిచే గట్టఁబడినదో, యెవనిచే వ్యాపింపఁ బడినదో, సుఖ దుఃఖాదులు చే నెవఁడు తెలుసుకొను చున్నాడో, యట్టి (సంసా రచీఁకటిని నశింపఁజేయు) హరిని స్తుతించెదనని భావము.

విశ్వదూరుని – "తస్యకర్తారమపిమాం విద్ధ్యకర్తా రమవ్యయం" నేను కర్తగాఁ గనుపడు చున్నను నకర్తను (దూరుని) గాఁ దెలిసికొనుము – అజు – పుట్టుక లేనివాని "అజోనిత్యశ్శాశ్వతోఽయం పురాణః" అజుఁడు, నిత్యుఁడు, శాశ్వతుఁడు, అట్టి యవ్యక్తాతీతుని భజియింతునని జీవప్రార్థన

వ॥ అని పలికి తనమనంబున నగ్గజేంద్రుం డీశ్వర సన్ని ధానంబుఁ గల్పించుకొని యిట్లనియె.

బాహ్య॥ ఇట్లుప్రార్థించి యగ్గజేంద్రుఁడు మానసికంబుగా నీశ్వరునిఁ గల్పించుకొని.

రహ॥ ఇట్లు జీవుఁడు మానసికముగా బహ్మాకార తేజస్సు
ను గల్పించుకొని

శా॥ లావొక్కింతయు లేదు ధైర్యము విలో ♦ లంబయ్యెఁ
బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చెఁ దనువున్ ♦ డస్సెన్
శ్రమంబయ్యెడిన్
నీవే తప్పనితః పరంబెఱుఁగ, మ ♦ న్నింపందగున్
దీనునిన్
రావే యీశ్వర కావవే వరద, సం ♦ రక్షింపు
భద్రాత్మకా !

బాహ్య॥ అట్లు గజమంతరంగమున నీశ్వర సన్నిధానంబుం
గల్పించుకొని యిట్లు ప్రార్థించెను, నాకు బల
మొక్కింతయును లేదు. ధైర్యము నశించినది. ప్రా
ణంబులు స్వస్థానంబులు దప్పినవి, స్మారకముఁ
దప్పినది. శరీరము బడలినది, ఆయాసమయ్యె నీవు
తప్ప నా కేమియు నాధారంబు లేదు. కావున నో
వరదా ! సంరక్షింపుము, మంగళ స్వరూపా ?

రహ॥ జీవుఁడట్లు మానసంబున నీశ్వర సన్నిధానంబుఁ గ
ల్పించుకొని యనగా " మనఃకృతం కృతంకార్యం
న శరీరకృతం కృతం "

తా॥ " ఉత్తమం మానసం ప్రోక్తం " మనునట్లు మనః
కృతమగు కార్యమే నిజమైన కార్యముకాని శరీర

కృతము నిజమైనకార్యము కానేరదు, కావున నీశ్వర సన్నిధానంబు ( బ్రహ్మాను సంధానము ) కల్పించుకొని యిట్లు ప్రార్థించెను " లావొక్కింతయు లేదు " సత్వగుణ మొక్కింతయు లేదనగా " రజస్సత్వంత మశ్చైవ " రజస్సత్వ గుణములనడంగం ద్రొక్కి తమస్సు వృద్ధియగు చున్నది. కావున సత్వగుణము లేశమైనను లేదు " ధైర్యము విలోలంబయ్యె "

శ్రు॥ శ్లో॥ భావామర్త్య స్యయదంత కైతత్సర్వేంద్రియాణాం జరయంతి తేజః " హే, అంతకా! విషయము లింద్రియములలో నుండు నధి దేవతా సంబంధమైన యాత్మ తేజస్సును నశింపఁజేయుచున్నవి యనగా నాత్మ ధైర్యమను వృక్షము మోహ కల్లోలములచే నొడ్డుకరిఁగి కూలి పోయినది "ప్రాణంబులావులఁదప్పెను" పంచ ప్రాణములు స్వస్థానములు తప్పెననగాఁ బశువులు బంధములను త్రెంచి సంభ్రమణ మొనర్చినట్లు విషయాభి ముఖము లై యష్టమైథునముల వెంబడి పఱుఁగు లిడినవి.

## అష్టమైథునములు.

శ్రు॥ దర్శనం స్పర్శనం కేళిః కీర్తనం గుహ్యా భాషణం
సంకల్పోఽధ్యవసాయశ్చ క్రియా నిర్వృతి రేవతు
ఏతన్మైథున మష్టాంగం ప్రవదంతి మనీషిణః॥

(స్త్రీతో)
1 దర్శనం – చూచుట
2 స్పర్శనం – శరీరముఁ దాఁకుట
3 కేళిః – కలిసి క్రీడించుట (ఆటలాడుట)
4 కీర్తనం – స్తోత్రము
5 గుహ్యాభాషణమ్ – రహస్య సంభాషణ
6 సంకల్పః – తలంచుట
7 అధ్యవసాయః – ఉత్సాహము
8 క్రియానిర్వృతిః – కార్యనిర్వహణము

ఇట్టి యష్టమైథునములలో సంచారమే ప్రాణములు కావుల్దప్పుట మఱియు – మూర్ఛవచ్చె, మోహము చే స్మారకముఁ దప్పెను. తనువు (సూక్ష్మశరీరము) శ్రమనొందెను. కావున నీవేతప్ప ననగా బ్రహ్మ జ్ఞానము వినా వేరుమార్గముఁ గానకున్నాను

శ్లో॥ బోధోపి సాధనేభ్యోహి * సాక్షాన్మోక్షైకసాధనం
పాకస్య పహ్నివజ్ఞానం * వినామోక్షోనసిధ్యతి
జ్ఞానాదేవపి కైవల్యం "

తా॥ మోక్ష సాధనములలో బోధ (జ్ఞానము) ముఖ్యసాధనమై యున్నది. పాకమున కగ్నివలె, మోక్షమునకు జ్ఞానము ముఖ్యమై యున్నది, జ్ఞానము వల్లనే గదా మోక్షము ఇట్లు జ్ఞానోపదేశముఁ జేసి నీ (ఆత్మ) లో నైక్యముఁ జేసికొమ్మని జీవుఁడు ప్రార్థించెనని యాశయము.

ఉ॥ఓ కమలాక్ష! యో వరద!-యోప్రతిపక్షవిపక్షదూర! కుర్యోక్షవి యోగివంద్య! సుగుణోత్తమ! యోశర ణాగతామరానోకహ, యో మునీశ్వర, మనో హర! యో విమల ప్రభావ! రావే, కరుణింపవే, తలఁపవే శరణార్థిని నన్ను గావవే!

బాహ్య॥ ఓ పద్మాక్షా! యోవర ప్రదా! యో శత్రు మిత్ర సమత్వభావా! భేదరహితా! యో సర్వజ్ఞా! యోయోగిజన పూజ్యుఁడా! సుగుణోత్తమ యోగి శరణ్యా! యో దేవతా కల్పభూజా! యో ముని జన మనోహరా! యో విమలప్రభావా! శరణ్యుఁ డగు నన్ను రక్షించుముఁ

రహ॥ 'కం - బ్రహ్మము - అలతి - ప్రకాశయతి - క మలం - బ్రహ్మజ్ఞానము అక్షియస్యసః - నేత్రమె వనికోవాఁడు కమలాక్షుఁడు, బ్రహ్మజ్ఞానమే నేత్ర ముగాఁ గలవాఁడా? వరద- పురుషార్థమగు మోక్ష ప్రదాతా! యో శత్రుమిత్ర సమత్వభావా! శ్లో॥ "సమశ్శత్రౌ చమిత్రేచ. తథామానావ మానయోః శత్రుమిత్రులయందును, మానావమానములయం దును. సముఁడగువాఁడు (నాస్వరూపుఁడే) తలఁ పవే - శరణార్థిని నన్నుఁ గావవే, అయస్కాంత మయస్సునాకర్షించునట్లు నాబుద్ధి ప్రతిబింబిత కళను నాకర్షించి బ్రహ్మతాదాదాత్మ్యము చేయుము,

శ్లో॥ విషయేభ్యస్సమాహృత్య విజ్ఞాతాత్మా మనోమునిః
చింతయేన్ముక్తయే తేన బ్రహ్మభూతం పరేశ్వరం
ఆత్మభావం నయత్యేనం దద్బ్రహ్మధ్యాయినం
మునేవికారమాత్మనశ్శక్త్యాలోహమాకర్షకోయథా॥

తా॥ విజ్ఞానియగువాఁడు విషయములనుండి చిత్తమును మరలించి - ముక్తికొఱకుఁ బరేశ్వరుఁడగు బ్రహ్మమును ధ్యానించ వలయును-అట్టి ధ్యాతయొక్క భావమును, ఆత్మయొక్క శక్తిచే నయస్కాంత మెటు లయస్సును నాకర్షించునో యట్లు బ్రహ్మభావన (తాదాత్మ్యము) నొందించును కావున శరణుఁ జొచ్చిన నాచిత్తవృత్తిని నాకర్షించి పరమాత్మా! నీయందైక్యముఁ జేసికొమ్ము.

వ॥ అనిపలికి మఱియుఁ, నరక్షిత రక్షకుండై యీశ్వరుండా పన్నుండైన నన్నుఁ గాచుగాకయని నింగి నిక్కి చూచుచు నిట్టూర్పులు నిగిడించుచు బయలాలకించుచు నగ్గజేంద్రుఁడు మొఱసేయుచున్న సమయంబున,

బాహ్య॥ మఱియు నగ్గజము - అరక్షిత రక్షకుండైన యీశ్వరుఁడు శరణ్యుఁడైననన్ను రక్షించునని నిశ్చయించి యంత రిక్షమువంకఁ జూచుచు నిట్టూర్పు విడుచు చున్న సమయంబున ముందు కన్వయము.

రహ॥ మఱియు నా జీవుఁడు శ్లో॥ "అరక్షితం తిష్ఠతి దైవరక్షితం సురక్షితం దైవహతం వినశ్యతి" మనుష్యులచే నరక్షితమైనను దైవరక్షితమైన యెడల క్షేమముగా నుండును. మానుష రక్షితమైనను దైవహతమైనచో నాశనమునొందును అనగా జీవుఁడు జగదభిముఖుఁడు కానిచో నాత్మయే తనకభిముఖునుజేసి రక్షించును. అట్టి యాత్మరక్షించుగాక యని సర్వము బ్రహ్మమేయను వృత్తిచే చిత్తము నరికట్టి యంతరిక్షమనగాఁ బరమాత్మ నీక్షించుచు ధ్యానించు చుండెనని తాత్పర్యము.

ఆ॥ వె॥ విశ్వమయత లేమి * వినియు నూరకయుండి
రంబు జాసనాదు * లడ్డపడక
విశ్వమయుఁడు విభుఁడు * విష్ణుండు జిష్ణుండు
భక్తియుతునకడ్డ,* పడదలంచి.

బాహ్య॥ బ్రహ్మాదులకు విశ్వమయత - సర్వవ్యాపకత్వము లేకుండుటచే మొఱనాలకించి నను నడ్డపడఁ జాలరైరి, విశ్వమయుఁడును వ్యాపక శీలుఁడును, జయశీలుఁడునగు విష్ణుండు భక్తియుతుండగు గజమున కడ్డపడ దలంచి.

రహ॥ మాయోపహిత చైతన్య యుపాధి రూపులగుటచే బ్రహ్మాదు లడ్డపడరైరి. అనగా మాయా ప్రతిబింబ స్వరూపులగుటచే సర్వవ్యాపకత్వము లేదని

తాత్పర్యము పరమాత్మ దేశకాలాద్య పరిచ్ఛిన్నుఁ డగుటచే వ్యాపక స్వరూపుండగు విష్ణువు భక్తున కడ్డపడ దలంచెనని తాత్పర్యము.

మ॥ అల వైకుంఠపురంబులో నగరిలో * నామూల సౌధంబుదా పలమందార వనాంత రామృతసరః ప్రాంతేందు కాంతోపలో త్పలపర్యంకరమావినోది యగునా * పన్నప్రపన్నుండు, విహ్వలనాగేంద్రము పాహిపాహి యనఁగు య్యాలించి సౌరంభియై

భావ్య॥ వైకుంఠ పురమున విష్ణువు నివసించు మొదటి హర్మ్య సమీపమునఁ గల్పద్రుమ వనాంతరమంద న్న యమృత సరస్సు యొద్దునఁ జంద్రకాంతమః రచిత పర్యంక (పందిరిమంచ) మున, లక్ష్మితో క్రీడా వినోదియగు నా పన్న శరణ్యుండు - నిక్షేప్తితమైన నాగేంద్రము రక్షించుమని వేడిన నాయా లాపము నాలించి వేగిరపడిన వాఁడై

రహ॥ కుంఠమనగా నశించునది, వికుంఠమనగా నశించ నిది - వికుంఠ స్వభావః - వైకుంఠమనగా నాశః ములేనిది నాకాశములో మూలసౌధము - పరాకాశము - అనిర్వచనీయ సర్వవ్యాపకజ్యోతి- సమీప మందార వనాంత - సత్య సంకల్ప స్వరూప వనాం తరానందామృత సరస్సనగా- శుద్ధబోధానందామృత సరస్సు సమీపమునఁ బరిశుద్ధ సాత్వికయగు ప్ర

కృతితోఁ గ్రీడించు పరాత్పరుఁడు - జీవప్రార్థన
నాలించి యావరణ భంగముఁజేసి తాదాత్మ్యాను
సంధాన సంరంభుఁడై వ్యక్తిగతము - "నీవార
శూకవత్తన్వీ పీతాభాస్వత్యణూపమా- తస్యాఃశిఖా
యా మధ్యేపరమాత్మా వ్యవస్థితః"

తా॥ నివరధాన్యపుముంటివలె సూక్ష్మమైయున్న సుషు
మ్నపీత వర్ణము (పీతాంబరధరుఁడు) దానిలోఁ బర
మాత్మ యున్నాఁడు.

శ్రు॥ "అణోరణీ యాన్మహతో మహీయా నాత్మాగు
హాయాం నిహితో స్యజంతోః

తా॥ అణువులకంటె నణువును మహత్తులకంటె మహ
త్తును గొప్పదియు (నగు ఆత్మ జీవునియొక్క దహ
రమునందుంచ బడినది.

శ్రు॥ భూరిత్య గ్నౌప్రతితిష్ఠతి, భువఇతివా యౌసువరా
దిత్యేమహఇతిచంద్రమాః। చంద్రమసావానజ్యోతీ
గింషి మహీయంతే॥

తా॥ షణ్ముఖ యభ్యాసునకు - భూమండలము - అగ్ని
మండలము - వాయుమండలము - సూర్య-చంద్ర
మండలములు - జ్యోతి దర్శనమగును.

మ॥ సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం - జేదోయి
సంధింపఁడే పరివారంబును జీరఁడభ్రగపతిం-బన్నిం
పఁడా కర్ణికాంతర ధమ్మిల్లముఁజక్క నొత్తఁడు,

వివా - దహోద్ధిత శ్రీకుచో పరిచేలాంచలమైన
వీడఁడు గజ - ప్రాణావనోత్సాహియై

బాహ్య॥ శ్రీమహావిష్ణువు, గజప్రాణ సంరక్షణోత్సాహ సంరంభుఁడై - లక్ష్మితోఁ జెప్పనివాఁడై - శంఖ చక్రములుచేతులం దొడుంగక, నే పరివారమును బిలువకఁ గరుత్మంతు నాయత్తము సేయక, కర్ణి కాంతరములంబడు కేశములనొత్తి చక్కఁజేయక, ప్రణయకల హాజనిత లక్ష్మివక్షోరుహ చేలాంచల మునైన వీడక, బైలుదేరెనని తాత్పర్యము.

రహ॥ - ప్రకృతినిఁ దలంపఁడు, సాంఖ్యయోగ సాధన ముల గ్రహింపక - శమ దమాదులను బిలువకఁ, దనయందంతర్లయమందిన తమస్సును సర్దక, శ్రీ కుచోపరిచే లాంచలమైన వీడక ననగాఁ, బ్రకృతి యొక్క కుచయుగళము, జీవేశ్వరులు వానిదైక్య మును వీడక వెడలెనని తాత్పర్యము

వ॥ ఇట్లు భక్తజన పాలన పరాయణుండును - నిఖిల జంతు హృదయారవింద సదాయనుండును - అగు నారాయణుండు, కరికులేంద్ర విజ్ఞాపిత నానావిధ దీనాలాపంబు లాకర్ణించి - లక్ష్మీకాంతా వినోదం బులందనివి సాలించి - సంభ్రమించి - దిశలు నిరీ క్షించి - గజేంద్ర రక్షాపరత్వంబు నంగీకరించి నిజ

పరికరంబుల మఱల నవధరించి - గగనంబున శుద్ధ
మించి - వేంచేయునపుడు.

బాహ్య॥ - భక్తజనావన సక్తుండును - సకల హృదయా
యనము ( స్థానము ) గలవాఁడునగు నారాయ
ణుండు, గజదీనాలాపంబుల నాకర్ణించి లక్ష్మీవినో
దక్రీడలఁ జాలించి స్వకీయ పరివారంబు మఱలఁ
గైకొని గగనంబున కెగసివచ్చునపుడు ముందు
కన్వయము,

రహ॥ - పరిపక్వశుద్ధ జీవుల నేకీభావ పరాయణుండును -
సకల జంతుహృత్పద్మ స్థానీయుఁడును- అగు నారా
యణుఁడు ( శబ్దగమ్యుఁడు )

శ్లో॥ పాషాణలోహ మణిమృ ణ్మయ విగ్రహేషు
పూజాపునర్జనన కరీము ముక్షోః
తస్మాద్యతి స్వహృదయార్చనమేవకుర్యాత్

తా॥ శిలాలోహమణి విగ్రహాది పూజలు జన్మల నొసం
గును గాన హృదయమునందే పూజించవలెను -
జీవుని దీనాలాపంబులాలించి సాధన చ
తుష్టయ - జ్ఞానభూమికాదివలయు పరివారంబు సం
గ్రహించి విహఁగ ( శుక ) మార్గమున వచ్చున
పుడు -

మ॥ తన వెంటన్ సిరి, లచ్చి వెంటనవరో- ధవ్రాతమున్
దాని వెన్కను బక్షీంద్రుఁడు, వాని పొంతను ధనుః

కౌమోదకీశంఖ చక్ర నికాయంబును, నారదుండు ధ్వజనీ - కాంతుండు, రానచ్చి రొయ్యన వైకుంఠ పురంబునం గలుగు వా - రాబాల గోపాలముం

బాహ్య॥ (శ్రీ)విష్ణువు వెంట లక్ష్మియు - నామె వెనుక నవరోధవ్రాతము - అంతఃపుర కాంతలును, శంఖ చక్రాదికము, ధ్వజనీకాంతుఁడు, గరుత్మంతుఁడు మున్నగు వైకుంఠంబునంగలుగు వా రాబాల గోపాలము ( సంపూర్ణముగా ) బైలుదేరిరని తా॥

రహ॥ - పురుషుని వెంటఁ బ్రకృతియు - దాని వెనుక శుద్ధ సాత్వికమున్నగు పరాకాశంబు నందుండు కాంత లును జ్ఞాన పక్షీంద్రుఁడును - మఱియుఁ గౌమోద కీయనగా " శ్రు॥ ప్రణవోధను శ్శరోహ్యాత్మా - బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే తా॥ ఓం కారమే ధనస్సు ( విల్లు ) శుద్ధాత్మయే శరము - ( బాణము ) బ్రహ్మమే లక్ష్యముఁ గావున నట్టి పరికరములును - నాబాల గోపాల మనగా దైవసంపత్తియగు సద్గుణ సమూహము - సమూలముగా వెడలెనని తాత్ప ర్యము.

వ॥ తదనంతరంబ ముఖారవింద మకరంద బిందు సందో హపరిష్యంద నానంద డిందిరయగు నయ్యింది రా దేవిగోవిందకరార విందసమాకృష్య మాణసంవ్యా న చేలాంచలయయి పోవుచు.

బాహ్య॥ - అనంతరము - నయ్యిందిరాదేవి ముఖపద్మము నందలి మకరంద పరిష్యంద - స్రవించుచున్న మకరంద రసాస్వాదనముచే నానందించు చున్న యిందిందిర ( తుమ్మెద ) లచే శోభాయితమైయొప్పి - గోవిందుని, కర పద్మముచే నాకర్షింపఁ బడిన, సంవ్యాన - శరీర మంతటను వ్యాపించు పైటకొంగు గలదియై పోవుచు.

రహ॥ - ఆ పరమాత్మతోఁగూడి ఛాయాపోల్కినుండు ప్రకృతియొక్క సహస్రార కమలమునందలి బ్రహ్మానందమను మకరందమును గ్రోలు జీవన్ముక్త, విదేహ ముక్తాది మధుపములచేనొప్పు ప్రకృతియొక్క స్వరూపానంద చేలాంచలము నాకర్షింపంబడి పోవుచు.

మ॥ తన వెంచేయుపదంబుఁ జెప్పఁడనా-థస్త్రీజనాలాపముల్ వినెనో ముచ్చులు ముచ్చిలించిరో ఖలుల్ వేద ప్రపంచంబులక్ దనుజానీకము దేవతానగరిపై - దండెత్తెనో భక్తులంగని చక్రాయుధుఁ డేడి చూపుఁడని ధి - క్కరించిరో దుర్జనుల్

బాహ్య॥ - ఇట్లు విష్ణువుచే నాకర్షింపఁబడు చేలాంచలియై లక్ష్మి తనలో నిట్లు చింతించెను, ఎచ్చటకుఁ జనుచున్నాఁడో, యాతురపాటుచేఁ జెప్పఁడయ్యెను - అనాథస్త్రీ ( ద్రౌపదీ మొదలగు ) జనాలాపంబు

లాలించెనో, వేదసమూహములను స్తేనులు ( చోరులు ) ముచ్చిలించిరో - లేక దైత్యులు దివిజులపై దండెత్తిరో - లేక దుర్జనులు చక్రహస్తుసింజూపుమని బాధించిరో - యేదో దుర్భరము సంభవించి యుండును - కానిచో నింతయాతృత యెట్లు సంభవించునని తలంచెను.

రహ॥ - ఇట్లు పరమాత్మచే నాకర్షింపఁబడిన పరాప్రకృతి యిట్లు చింతించెను. అవిద్యచే నాకర్షింపఁబడు విద్యాలాపము వినెనో లేక వేదము, లపౌరుషేయములు కావని వేద బాహ్యులు ప్రబలిరో. యాసుర సంపత్తి - దైవసంపత్తిని మొనచూపకుండా నావరించెనో - పరోక్షా పరోక్షజ్ఞానమే లేదని భక్తులకు దుర్బోధముఁజేసిరోయని చింతించెనని తాత్పర్యము

వ॥ అని వితర్కించుచు.

శా॥ తాటంకాచలనంబుతో భుజనట * ద్ధమ్మిల్ల బంధంబుతో శాటీముక్త కుచంబుతో నదృఢచం * చత్కాంచితో శీర్ణలా లాటాలేపముతో మనోహరకరా * లగ్నోత్తరీయంబుతోఁ గోటీందు ప్రభతోను రోజభరసం * కోచద్విలగ్నంబుతోఁ

బాహ్య॥ (లక్ష్మీదేవినివర్ణించుచున్నాడు) చలించుచున్న కర్ణ భూషణములును- భుజములపై నటించుచున్న కేశబంధమును - చీరచేఁగప్పఁబడిన వక్షోరుహము

లు గలిగినట్టియు - వదులుగానున్న మొలనూలు (ఘంటల యొడ్డాణము) గలిగినట్టియు - వట్టివేరు గంధంబుతో సంస్కరింపఁబడిన ఫాలభాగము గలిగి నట్టియు- చేతులలో నిమిడియున్న పైటచెంగుగలిగి నట్టియు- యురోభర విలగ్నమనగా దద్భారముచే నూగులాడు నడుము గలిగినదియై లక్ష్మి యడుగుట కూహించెనని తాత్పర్యము—

రహ॥ సూర్యచంద్రులను శ్రవణభూషణములును - జీవే శ్వరులను కుచయుగ్మమును- అభిమానమును శాటి యును- మణిపూరచక్రమను వడ్డాణమును-నేతి నేతి వాక్యములచే శేషించిన నడుము గలిగినదియై ప్రకృతియడుగుటకుఁ బ్రయత్నించెనని తాత్పర్యము-

కం॥ అడిగెదనని కడువడిఁజను
నడిగినఁదను మగుడనుడువఁ - డనినడయుడుఁగుఁ
వెడవెడ సిడిముడి దడఁబడ
నడుఁగిడు నడుగడదుజడిమ - నడుగిడునెడలన్

బాహ్య॥ అడిగెదనని చనియుత్తర మిచ్చునో లేదో యని భ్రాయుగ, మీతమువలెఁ జలించ జడత్వముచే నడు గదయ్యెను-

రహ॥ ప్రకృతి చంచల స్వభావయు - నచేతనయు (జడ ము) నగుటచే నాత్మను నెదురుకొనదయ్యె-

సీ॥ నిటలాలకములంట ♦ నివురజుంజుమ్మని
ముఖసరోజమునిండ ♦ ముసరుఁదేంట్లు
నళులఁజోపఁగఁజిల్క ♦ లల్లనల్లనఁజేరి
యోష్ఠబింబద్యుతు ♦ లొడియనుఱుకు
శుకములఁదోలఁజ ♦ త్కుర్మీనములకు మం
దాకినీపాఠీన ♦ లోక మెసఁగు
మీనపంక్తులదాఁట ♦ మెయిదీఁగతోరాయ
శంపాలతలు మింట ♦ సరణిగట్టు.

ఆ॥వె॥ శంపలను జయింపఁ ♦ జక్రవాకంబులు
కుచయుగంబుఁదాఁకి ♦ క్రొవ్వునూపు
మెలఁతమొగులు పిఱిఁది ♦ మెఱుఁగుదీనయుఁబోలె
జలదవర్ణు వెనుక ♦ జరుగునపుడు.

తాత్ప॥ చక్రాయుధుని వెనుక జనుచున్న లక్ష్మియొక్క లావణ్యమును వర్ణించుచున్నాడు- తుమ్మెదలవంటి ముంగురులు - దొండపండువంటి యధరోష్ఠము - మీనములవంటి చంచల దృష్టులు - మెఱుపు దీవ వంటి తనువును - చక్రవాకములవంటి కుచములు గలిగి - మేఘము ననుసరించు విద్యుల్లతవలెఁ జను చుండెనని భావము—

రహ॥ ప్రకృతి పరమాత్మ ననుసరించిపోవు నపుడొక వస్తువు మఱియొక వస్తువువలెఁగనుపడఁ జేయుచున్నదని భావము, దీనిని భ్రాంత్యాలంకారమందురు-

శ్లో॥ పాలాశకుసుమభ్రాంత్యా - శుకతుండే పతత్యళిః
జంబూఫలమితిభ్రాంత్యా తంఅళింహంతు మిచ్ఛతి

తా॥ మోదుగపుష్పమను భ్రాంతిచే తుమ్మెద చిలుకము
క్కుపై వ్రాలినది. యాచిలుక యాతుమ్మెదను నేరే
డుపండను భ్రాంతిచే మ్రింగుటకుఁ జూచుచున్నది.
అనగా భ్రాంతిచేఁబరమాత్మను, జగత్తువలెను- జ
గత్తును బరమాత్మవలెనుజూచుచున్నారని భావము.

మ॥ వినువీధిన్ జనుదేరఁగాంచిరమరుల్- విష్ణుణ్ సురా
రాతి జీవన సంపత్తి నిరాకరిష్ణుఁ గరుణా - వర్ధిష్ణు
యోగీంద్ర హృద్వన వర్తిష్ణు సహిష్ణుభక్తజన బృం
దప్రాభవాలంకరిష్ణు నవోఢోల్లసదిందిరా పరిచరి -
ష్ణున్ జిష్ణురోచిష్ణునిన్

బాహ్యా॥ దైత్యజీవన భంగకరుఁడును - కరుణా మయుం
డును- యోగీంద్రహృద్వనవర్తియును- సహనము
గలవాఁడును- భక్తజనప్రభావము (శక్తి) చేసలం
కరింపఁబడునట్టియు లక్ష్మీదేవి పరిచర్యచే సేవింపఁ
బడువాఁడును- జయశీలుఁడును- ప్రకాశమానుఁడ
గు విష్ణువును నంతరిక్షమార్గమున దేవతలు గాం
చిరని భావము-

హ॥ ఆసురసంపత్తి (దుర్గుణములు) నశింపఁ జేయునట్టిన్ని
ప్రకృతితోనవినా భావ సంబంధమైనట్టియు - యో
గీశ్వర హృదయారామములందువిహరించునట్టియు-

ద్వంద్వసముఁడును- భక్తాధీనుఁడును వ్యాపకస్వరూపుఁడగువానిని- దైవసంపత్తియగు నధ్యాత్మవేత్తలు (దేవతులు) ధ్యేయంబగు మహాకాశమునందే పరమాత్మను వీక్షించుచుండిరి,

వ॥ ఇట్లు పొడగని.

మ॥ చనుదెంచెన్ ఘనుఁడల్లవాఁడె హరిప - జ్జంగంటిరే
లక్ష్మిశంఖ నినాదంబదె చక్రమల్లదె భుజంగధ్వంసి
యున్ వాఁడే క్రిన్ననయేతెంచె నటంచు వేల్పులు
నమో - నారాయణాయేతి నిస్వనులై మ్రొక్కిరి
మింట హస్తిదురవ - స్థావక్రిక్రింజక్రిక్రిన్

భావ్య॥ అదుగోహరి - యాతని మోలిల లక్ష్మి - శంఖ
ధ్వని- చక్రిము- గరుఁడుఁడు - వచ్చుచున్నారని
దేవతులు నమోనారాయణా యని గజముయొక్క
దురవస్థను జక్కపర్ప నేతెంచెడి విష్ణువునకు నమ
స్కరించిరి.

రహ॥ అదిగో పరమాత్మ- చెంతఁబ్రికృతి- ఓంకార ధ్వని
జ్ఞానచక్రిము- గరుడుఁడనగా శుకమార్గము - ము
న్నగునివృత్తిమార్గములు వచ్చుచున్నవని. ఓం
నమోనారాయణాయ యని మోక్ష దీక్షాపరులు
మ్రొక్కిరని తాత్పర్యము -

అకార — నా — న
ఉకార — రా — మ
మకార — య — శి
అర్ధమాత్ర - ణా - వా
నాదము — య — య.

వ॥ అయ్యవసరంబునగుంజరేంద్రపాలన పారవశ్యంబున దేవతా నమస్కారంబులంగీకరింపక మనస్సమాన సంచారుండై పోయిపోయి కొంతదూరంబున శింశుమారచక్రంబునుం బోలె గురుమకర కుళీర మీన మిథునంబై, భాగ్యవంతునిభాగధేయంబునుంబోలె సరాగజీవనంబై, వైకుంఠపురంబునుం బోలె శంఖ చక్రకమలాలంకృతంబై, సంసారచక్రంబునుంబోలె ద్వంద్వసంకులపంక సంకీర్ణంబై, యొప్పు నప్పంకజాకరంబుఁబొడగని —

బాహ్య॥ కుంజరావనపరవశత్వంబున - దేవతా నమస్సుల నందుకోక, మనోవేగుండై వెడలి మకరిలగ్నరాశిం బోలిగుర్వాది గ్రహంబులతోఁగూడి కిన్నరభాండాగారముఁబోలి శ్వేత తాబేటి నిధి గలిగి తియ్యని నీటితోఁగూడి శంఖచక్రాదులు గలిగి సంసార చక్రంబుమాడ్కి సుఖదుఃఖాది ద్వంద్వ సంకులంబై యున్న యాసరస్సుంజూచి—

రహ॥ జీవరక్షణ పరవశత్వంబున విష్ణువు శింశుమార చ

క్రంబనగా సహస్రారమునందు ఓతప్రోత ఆ
క రసాదులతోఁగూడి రాగమను నీటితోడను-
సారముం బోలిరాగ ద్వేషాది ద్వంద్వ యుక్త
మనోసరస్సునుంజూచి -

మ॥ కరుణాసింధుఁడు శౌరివారిచరముఁ - ఖండింపఁ
బంపె సత్వరితాకంపిత భూమి చక్రము మహా
ద్యద్విస్ఫులింగచ్ఛటా పరిభూతాంబర శుక్రమః
బహువిధ - బ్రహ్మాండభాండచ్ఛటాం తర నిర్వ
ముఁ బాలితాఖిలసుధాం - ధశ్చక్రముంజక్రముఁ

బాహ్య॥ భూకంపము గలిగించునట్టియు- విస్ఫులింగము
(అగ్నికణములు) చే భయంకర ధ్వనులచే గప్ప
డిన నంతరిక్షము గలిగినదియు — బ్రహ్మాండసమః
హాంతరములందడ్డు లేనిదియు —

దేవతులను రక్షించునదియునగు చక్రమును మొ
లినిఖండ్రించుటకుఁజక్రహస్తుఁడు పంపెనని తాత్పర్యము

రహ॥ కామమునుద్రుంచుటకునై (యోగముచే) శరీర క
పమును విస్ఫులింగములనగా —

శ్రు॥ యథాసుదీప్తాత్పావకాద్విః స్ఫులింగాఃసహస్రశః ప్ర
భవంతే సరూపాః తథాక్షరాద్వివిధా సోమ్యభావాః
ప్రజాయంతే॥

తా॥ హేసోమ్య - ప్రజ్వలితాగ్నినుండి మిణుఁగురు లెట్లు
వెడలుచున్నవో యట్లాత్మనుండి కళలు బైలుదేరు

చున్నవి. అట్టిబ్రహ్మతేజోవంతమైన కళలతోఁగూ
డినట్టియు బ్రహ్మాండముల బహిరంతముల వ్యాపిం
చినట్టి ప్రజ్ఞాన ఘనచక్రమును బంపెనని తాత్ప॥

వ॥ ఇట్లు పంచిన —

శా॥ అంభోజాకరమధ్యనూతననలి - న్యాలింగనక్రీడనా
రంభుండైన వెలుంగుఱేనిచెలువా—రన్ వచ్చినీటన్
గుభుల్ గుంభధ్వానముతోఁ గొలంకువు, కలం —
కంబొందఁగాఁజొచ్చి దుష్టాంభోవర్తివసించు చక్ర—
టికి డా—యంబోయిహ్రాద్వేగమై॥

బాహ్య॥ ఆసరోవరాంతరమందున్న తామరయందు సూ
ర్యకిరణము లుత్కాంతితోఁగ్రీడ సల్పినట్లు గుభుల్గు
భుల్లను ధ్వనితోఁ జక్రము ప్రవేసించి సరస్సు కలఁ
కం బొంద మొసలియుండు స్థానమునకు మనో వేగ
ముగాఁబోయెనని తాత్పర్యము —

రహ॥ శ్లో॥ యథైదాంసి సమిద్ధోగ్నిర్భస్మసాత్కురుతేర్జున
జ్ఞానాగ్నిస్సర్వకర్మాణి భస్మసాత్కురుతేతథా॥

తా॥ ప్రజ్వలితాగ్నియింధనముల నెట్లు భస్మముఁజేయునో
జ్ఞానాగ్నియవిద్యాకార్యములగు కర్మముల నట్లు న
శింపఁజేయును, (కర్మహేతుకమగు కామమును న
శింపఁజేయును) గావున బ్రహ్మజ్ఞానమను చక్రము
సంకల్పతీవలనడుమఁబ్రవేసించినదని తాత్పర్యము.

శా॥ భీమంబై తలఁద్రుంచి ప్రాణములఁబా-పెంజక్రిః
శుక్రియన్ హేమత్మాధర దేహముంజకితవ-న్యే
ద్రసందోహమున్ గామక్రోధన గేహమున్ గరటి
క్తస్రావగాహంబు నిస్సీమోత్సాహముపీతదాహః
జయ - శ్రీమోహముగ్ గ్రాహమున్.

బాహ్య॥ రక్తవర్ణమై పర్వతాకారమైనట్టియు, గజ సమ
హమునకు భయముగలుగఁజేయునట్టియుఁగామక్ర
ధముల స్థానమైనట్టియు, గజేంద్రుని రక్త ప్రవాహ
మును గ్రహించునట్టియు, నుత్సాహపూరితమైన
యు మోహముచేజయశ్రీ గలిగిన మొసలినిఁద్రుం
(ప్రాణములఁబాపె) నని తాత్పర్యము.

రహ॥ రజోగుణ (రక్త) వర్ణముఁ గలిగినట్టియు, జీవులకు
మోక్షప్రతిబంధకమైబాధించునదియుఁగామక్రోధా
దులకు స్థానమైనట్టియు జీవనివృత్తి యత్నరక్తస్రా
వమునుగ్రహించునట్టి కామమును జ్ఞాన చక్రము
త్రుంచెనని తాత్పర్యము—

వ॥ ఇట్లు నిమిషస్పర్శనంబున సుదర్శనంబు మకరి తలఁ
ద్రుంచు నవసరంబున —

బాహ్య॥ సుదర్శనమిట్లు మకరిని స్పృశించిన తక్షణమే మొ
సలి మరణించె నాసమయంబున —

రహ॥ జ్ఞానమిట్లుకామమును స్పృశించిన తోడనే యావర
ణభంగమై కామ మంతరించెనాతదుపరి-

క॥ మకర మొకటి రవిఁజొచ్చెను
మకరము ఘటిమొకటిధనదు - మాటునడాఁగెన్
మకరాలయమునఁ దిరిగెడు
మకరంబులు కూర్మరాజు - మడువునకరిగెన్

బాహ్య॥ మకరి మరణించినతోడనే, ప్రాణవాయువు లేచి పోయిన పిమ్మట వాయువులన్నియు లేచిపోయినట్లు లాసరస్సులోని మకరములు లేచిపోయెనని మకరి పదమునకుఁగల వివిధములగు నర్థములను స్వభావోక్తిగాఁజెప్పఁబడెను- మకర మొకటి రవిఁజొచ్చెనన గా మకరనామలగ్నరాశి, సూర్యుఁడు గ్రహరాజ గుటచే వానిప్రక్కకుఁబోయెను. ఘటిమొకటి ధన దుమాటునడాఁగెన్ గుబేరునకుఁగల నవనిధులలో మకరనామసిధి వానిచెంతకుఁబోయెను. మకరాల యమనగా సరస్సు దానిలో సంచరించుమకరములు కూర్మరాజనగాఁ గూర్మనామకయుపవాయువు, దా నికి రాజుప్రాణము దానికి మడువు మనస్సు దాని యందుఁజొచ్చిననని తాత్పర్యము లేక కూర్మరాజు మడువు సముద్రము దానిలోఁగలిసెనని యాశయం

రహ॥ కామమనగా నజ్ఞానము, రవిఁజొచ్చె ననగా " వి ద్యాఽవిద్యాంనివర్తేత తేజస్తిమిరసంఘవత్ " తేజ స్సు తిమిరసంఘమును నశింపఁజేసినట్లు విద్య (జ్ఞాన ము) కామము (అజ్ఞానము) ను నశింపఁజేయును -

"విద్యాదివాప్రకాశత్వాత్" విద్యయనగా- పగలు తదధి దేవతయగు సూర్యునిలో, గలిసెను. మఱి యొకటి ధనదునూటున డాఁగెన్-గుబేరునిమాటు- కైలాసము. నీశ్వరుని చెంత నైక్యమయ్యెను, మకరాలయమనగా మనస్సునందలి సంకల్పములు- కూర్మరాజు - కూటస్థుఁడు. వాని, మదువనగాఁబ్రకృతి లేక మాయ దానియందైక్యమైనదని తాత్పర్యము

మ॥ తమముం బాసిన రోహిణీ విభుక్రియన్-దర్పించి సంసారదుఃఖము వీడ్కొన్నవిరక్తచిత్తునిగతిన్ - గ్రాహంబు పట్టూడ్చి పాదములల్లార్చి కరేణుకా విభుఁడు సొం-దర్యంబుతోనొప్పె సంభ్రమదాశాకరిణీకరోజ్ఝితసుధాం- భస్స్నానవిశ్రాంతుఁడై.

భావ్య॥ గజేంద్రుఁడు మొసలియొక్క పట్టు వీడినవాఁడై పాదములు విదలించి విచ్ఛిన్నమేఘమునుండి వెలువడిన చంద్రునిమాడ్కిని సంసారదుఃఖజనిత విరక్తిచే విముక్తి నొందిన సంసారి చాడ్పునను- దిగ్గజములయొక్క కరము (తొండము) లచేఁ దదుపఁబడుచున్న సుధాంభస్స్నాన విశ్రాంతుఁడై యానందముచే నొప్పెనని తాత్పర్యము -

రహ॥ జీవుఁడు కామము యొక్క పట్టువీడి రాహు గ్రహవిముక్త చంద్రుని వడువునను - సంసారబంధవిముక్తవిరక్తుని చందమునను - పరాకాశ ( దిగంతము

XMH3 VEE



లనుండి) సహజానందామృత ధారలచే నిమజ్జితుఁడై స్వ స్వరూపా నందుఁడై సుఖముగా నుండెనని తాత్పర్యము.

—— సంపూర్ణము. ——

గజేంద్రుండు పూర్వమింద్రద్యుమ్నుండను ధరణీ విభుండు వైష్ణవ భక్తుఁడు, పర్వతాగ్రంబునఁ దపంబుఁజే యుచుండ నచ్చోటికి నగస్త్యమునివర్యుఁడేతెంచిన నాఋషివర్యుని గౌరవముసేయక నిర్లక్షించిన-నాతండు-కరివై జన్మింతువుగాకయని శాపంబిచ్చిన నారాజు కరియైజన్మించెను. విష్ణు భక్తుఁడైన కతనఁదద్విష్ణువుచే రక్షింపఁబడెను మొసలి హూహూ యను గంధర్వుఁడు: దేవలఋషి శాప వశంబున మకరమై జన్మించి విష్ణుచక్రముచే శాప విమోచనమయ్యెను.

శ్లో॥ నమస్తే శ్రీరామా! నియమిత గుణగ్రామసతతం
నమోభూయోభూయః పునరపి నమస్తే రఘుపతే
నమోవేదైర్వేద్యాఖిలమునిగణారాధ్యభగవన్నమో
భూయోభూయస్తనచరణ పంకేరుహాయుగే॥

శ్లో॥ అంజనానందనంవీరం - జానకీశోకనాశనం
కపీశమక్షహంతారం- వందేలంకాభయంకరం॥

